# అడుగో అతడే హంతకుడు

నవల

- కొమ్మూరి సాంబశివరావు



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 227

కౌముది మాసపత్రికలో

జనవరి 2020 సంచిక నుంచి డిసెంబర్ 2020 సంచిక వరకూ

వచ్చిన నవల

# (ప్రారంభం)

**"యస్! పోలీస్** కంట్రోల్ రూం" అన్నాడు రాత్రి డ్యూటీలో వున్న సార్జంటు.

"మోటార్ కార్ ఏక్సిడెంట్ జరిగింది. రిపోర్టు చెయ్యడానికి ఫోన్ చేస్తున్నాను."

"మీ పేరు?"

"రాజయ్యర్."

"చిరునామా?"

"మార్కెట్ వీధి, నెంబర్ 550, సైదాపేట."

"ఏక్సిడెంట్ ఎక్కడ జరిగింది?"

"గిండికీ, సైదాపేటకి మధ్య వున్న ఆలందూర్ రోడ్డుమీద."

"ఎవరయినా మరణించారా? ఎవరికయినా గాయాలు తగిలాయా? కారులో ఎంతమంది వున్నారు?" అడిగాడు పోలీస్ ఉద్యోగి.

"ఆఫీసర్! ఈ ఆక్సిడెంట్‌కీ, నాకూ ఏమీ సంబంధం లేదు. నేను యింటికి వెళుతూ చూశాను. ఏక్సిడెంట్ జరిగిన చోట ఎవరూ కనిపించలేదు. మీకు ఫోన్ చెయ్యడం పౌర ధర్మం కనుక టెలిఫోన్ చేశాను."

"థాంక్స్ సార్. వివరాలు చెప్పండి" అడిగాడు సార్జంట్ డైరీ ముందుకి లాక్కుని.

"గిండీ స్టేషన్ వద్ద నేను హోటల్ నడుపుతున్నాను. పన్నెండు గంటలకి హోటలు మూసి యింటికి బయలుదేరాను సైకిల్ మీద. రోడ్‌కి రెండు ప్రక్కలా బాగా లోతైన పల్లం వుంది. పల్లంలో ఏదో తగలబడడం గమనించి సైకిల్ దిగి చూశాను. అది మోటారు కారు. తలకిందులుగా వుంది. కారులోకానీ, చుట్టుపక్కలకానీ ఎవరయినా వున్నారేమోనని పిలిచి చూశాను. ఎవరూ పలకలేదు. దగ్గరే వున్న పబ్లిక్ టెలిఫోన్ బూత్‌కి వచ్చి మీకు ఫోన్ చేస్తున్నాను" అన్నాడు రాజయ్యర్.

"వెరీ మెనీ థాంక్స్ సార్. కాసేపట్లో పోలీస్ ఉద్యోగులు ఏక్సిడెంట్ జరిగిన చోటికి వస్తారు. దయచేసి మీరు అక్కడికి వెళ్ళి కాచుకోండి."

"ఆఫీసర్ చాలా ఆలస్యం అయింది. ఇంటికి వెళ్ళాలి."

"సారీ సార్! మీరు ఇంటికి వెళ్ళినా ఆఫీసర్లు ఎలాగూ వచ్చి మిమ్మల్ని పిలుస్తారు. కనుక ఏక్సిడెంట్ జరిగిన చోట కాచుకోవడం మంచిది. థాంక్స్ ఒన్స్ ఎగెయిన్" అని సార్జంట్ డిస్కనెక్ట్ చేసి, యింకో టెలిఫోన్ తీసి "ఆపరేటర్ రిపోర్ట్ మోటార్ కార్ ఏక్సిడెంట్. ఆలందూర్ రోడ్డు, గిండీ, సైదాపేట మధ్య. రిపోర్టెడ్ బై రాజయ్యర్" అని టెలిఫోన్ పెట్టేశాడు.

వెంటనే పోలీస్ వైర్‌లెస్ ఆపరేటర్ మైక్‌లో మాట్లాడడం ప్రారంభించాడు.

"ఎమర్జన్సీ పెట్రోల్ వ్యాన్ నెంబర్ ఎయిట్. రిసీవ్ మెసేజ్ ఎమర్జన్సీ పెట్రోల్ నెంబర్ ఎయిట్. రిసీవ్ మెసేజ్" అన్నాడు.

"పెట్రోల్ వ్యాన్ ఎయిట్ రిసీవింగ్ మెసేజ్. రిపోర్ట్."

"మోటార్ కార్ ఏక్సిడెంట్ బిట్వీన్ సైదాపేట అండ్ గిండీ. ఆలందూర్ రోడ్ రిపోర్టెడ్ బై రాజయ్యర్ రిసీవ్"

"మోటార్ కారు ఏక్సిడెంట్ బిట్వీన్ సైదాపేట అండ్ గిండీ" అన్నాడు పెట్రోల్ వ్యాన్ లోని సార్జంట్.

సైదాపేటకి, త్యాగరాయనగరానికి మధ్య అమౌంట్ రోడ్ మీద వున్నది పెట్రోల్ కారు రిపోర్ట్ వచ్చినపుడు. పెట్రోల్ వ్యాన్ డ్రైవర్ స్పీడ్ హెచ్చించాడు.

"అర్ధరాత్రిళ్ళు రోడ్డుమీద ఎవరూ లేనపుడు ఆక్సిడెంట్‌లు ఎలా జరుగుతాయో?" అన్నాడు సార్జంట్.

"వీధుల్లో ఎవరూ లేనపుడే బాగా స్పీడుగా వెళ్ళి ఏ టర్నింగ్‌లోనో కంట్రోల్ తప్పి ఆక్సిడెంట్ చేస్తారు" అన్నాడు డ్రైవర్.

సార్జంట్ చేతి గడియారం చూసుకున్నాడు. పన్నెండు గంటల పదినిముషాలయింది. డైరీలో రాసుకోవడం ప్రారంభించాడు.

"ఇక్కడే సార్" అన్నాడు డ్రైవర్ బ్రేక్ నొక్కి వాన్ ఆపి.

సార్జంట్ వాన్‌లోంచి దిగాడు.

"నా పేరు రాజయ్యర్. నేనే రిపోర్టు చేసింది" అంటూ రాజయ్యర్ సార్జంట్ దగ్గరికి వెళ్ళాడు. సార్జంట్ తలవూపి ముందుకి వెళ్ళాడు. కాలుతున్న మోటారుకారు అతనికి కనిపించింది. ఏక్సిడెంట్ ఎక్కడ జరిగిందని అడగవలసిన అవసరంలేదు. రోడ్డు పక్కన నిలుచుని కిందకి చూశాడు. పల్లంలో పడివున్నది కారు. మంటలు చల్లారాయి. పొగ మాత్రం వస్తోంది.

పెట్రోల్ వాన్ డ్రైవర్ వచ్చి సార్జంట్ పక్కన నిలుచున్నాడు.

"ఇంత విశాలమైన రోడ్డు వుండగా ఎలా పడిందంటావు  ఆ కారు ఆక్కడ?" సార్జంట్ డ్రైవర్ని అడిగాడు.

"తాగివున్నాడేమో ఆ డ్రైవర్."

సార్జంట్ తలవూపి "కారులో ఎవరయినా వుంటే యీపాటికి మసి అయిపోయి వుండాలి. హెడ్‌క్వార్టర్స్‌కి రిపోర్ట్ చేసి అంబులెన్స్, ఫైర్ యింజన్ కావాలని చెప్పు."

పెట్రోలు కారు డ్రైవర్ తలవూపి వాన్ దగ్గరికి వెళ్ళాడు.

"పెట్రోలు వాన్ నెంబర్ ఎయిట్ రిపోర్టింగ్. మేజర్ మోటార్ కార్ ఏక్సిడెంట్. ఆలందూర్ రోడ్డు.. బిట్వీ సైదాపేట అండ్ గిండీ. అంబులెన్స్, ఫైర్ ఇంజన్ రిక్వయిర్డ్"

హెడ్ క్వార్టర్స్‌నించి వైర్‌లెస్ ఆపరేటర్ వార్త అందుకున్నానని తెలియచెయ్యగానే వాన్ డ్రైవర్ వెనక్కి తిరిగివెళ్ళాడు. సార్జంట్ పల్లంలోకి దిగి కారుని దగ్గర్నించి పరీక్ష చేయడానికి ప్రయత్నిస్తున్నాడు.

"వద్దు సార్! కాలుజారితే చాలా ప్రమాదం. ఫైర్‌మెన్ వస్తారుగా" చెప్పాడు డ్రైవర్.

సార్జంట్ తలవూపి రాజయ్యర్ వైపు తిరిగి "మీరు చూసినప్పుడు మంటలు వస్తున్నాయా?" అడిగాడు.

"అవును అన్నాడు రాజయ్యర్.

"కారులో ఎవరూ లేరా?"

"నాకెలా తెలుస్తుంది. నేను కేకేశాను. ఎవరూ పలకలేదు."

"ఆ మంటని బట్టి మీరు యిక్కడికి వచ్చేముందు ఎంతసేపటి క్రితం కారు యీ పల్లంలో పడిందంటారు" అడిగాడు సార్జంట్.

రాజయ్యర్ ఆలోచించి "పదినిముషాలు అయివుండాలి" అన్నాడు.

అంతలో సైరన్ ఊదుకుంటూ అంబులెన్స్, అంబులెన్స్ వెనక ఫైర్ యింజన్, యింకో పోలీస్ వాన్ వచ్చి అక్కడ ఆగాయి.

పోలీస్ వాన్‌లోంచి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, కొందరు పోలీసు కానిస్టేబుల్స్ దిగారు. సార్జంట్ ఇన్‌స్పెక్టర్‌కి రిపోర్ట్ యిచ్చాడు. క్షణంలో ఫైర్‌మెన్ కింద పల్లంలోకి తాళ్ళనిచ్చెనలు వేసేశారు. హెల్మెట్స్ పెట్టుకుని అగ్నిమాపకదళం వారు పల్లంలోకి దిగారు. ఫోటోగ్రాఫర్లు

ఫోటోలు తీస్తున్నారు. రోడ్డుకి, పక్కన పల్లానికి వున్న దూరం కొలుస్తున్నారు పోలీస్ కానిస్టేబుల్స్. ఏక్సిడెంట్ జరిగిన తర్వాత పోలీసులు జరపవలసిన తతంగం అంతా జరుగుతోంది.

## 2

కాలింగ్‌బెల్ చప్పుడు కాగానే పార్వతి లేచి కూర్చున్నది.

"అమ్మా! నాన్న వచ్చాడా?" అడిగింది పదేళ్ళ జయ.

"నాన్నే అయివుండాలి" అని పార్వతి లేచి దీపం వెలిగించింది.

"అబ్బా! చాలా ఆలస్యం అయిందే.రెండు" అనుకుంటూ వెనక్కి తిరిగి చూసి "జయా! నువ్వు రావద్దు. వాళ్ళిద్దరూ లేస్తే ఎవరూ లేకపోతే భయపడతారు" అన్నది పార్వతి కూతురితో. అవతల మంచం మీద ఏడేళ్ళ కొడుకు రవి, నాలుగేళ్ళ పిల్ల ఉమ నిద్రపోతున్నారు.

"త్వరగా రా! నాకు భయం వేస్తోంది" అన్నది జయ.

"ఛ దీపం వెలిగించివుంటే నీకేమిటి భయం. పదేళ్ళదానివి" అని పార్వతి హాల్లోకి వెళ్ళింది.

అంతలో బజర్ మళ్ళీ బొయ్యిమన్నది. పార్వతి గబగబా వెళ్ళి తలుపు తీసింది.

"డాక్టర్ శ్రీనివాస్‌గారి యిల్లు యిదేనా?" అడిగాడు గుమ్మం అవతల నిలుచున్న మనిషి. పాంటు, షర్టు, కోటు వేసుకున్నాడు. అలాటి డ్రెస్‌లోనే యింకో మనిషి ఉన్నాడు అతని పక్కన.

"అవును డాక్టర్‌గారు యింట్లో లేరు" అన్నది పార్వతి.

"ఒక క్షణం మేము లోపలికి రావచ్చా?" అడిగాడు ఒకతను.

పార్వతి మోహం చిట్లించి "ఎందుకు? డాక్టరుగారు యింట్లో లేరు. ఎప్పుడు వస్తారో తెలియదు" అన్నది.

"మేము పోలీస్ ఆఫీసర్లం."

పార్వతి బిత్తరచూపులు చూసి "పోలీసులా?" అడిగింది.

"పోనీ వసారాలో దీపం వెలిగించండి" అంటూ అతను జేబులోంచి ఒక చేతిగడియారం, ఒక వుంగరం తీశాడు.

"ఏమిటివి?" అడిగింది పార్వతి.

"ఇవి మీ భర్తగారివేనా?" అడిగాడు వాటిని పార్వతికిచ్చి.

"అవును. ఇవి మీకు ఎలా వచ్చాయి?" పార్వతి గుండె దడదడమంటున్నది.

"నెంబర్ ఎం.ఎక్స్.వై 19998 కారు డాక్టర్ శ్రీనివాస్‌గారిదేనా?"

"అవును. ఏం జరిగింది?" అడిగింది పార్వతి ఖంగారుగా.

"మోటారు కారు ఏక్సిడెంట్ జరిగింది" అన్నాడు పోలీస్ ఆఫీసర్.

"కారు ఏక్సిడెంటా? ఆయనకు గాయాలు..."

"ఈ దుర్వార్త చెపుతున్నందుకు నన్ను క్షమించండి. డాక్టరుగారు ఏక్సిడెంట్‌లో మరణించారు."

పార్వతి కళ్ళప్పగించి మాటలేకుండా ఆ ఆఫీసర్ని చూసింది.

"ఏమిటీ? ఏమిటీ?" అడిగింది.

"ఇంట్లో మీ వాళ్ళు... తండ్రీ, తల్లీ పెద్దవాళ్ళు ఎవరూ లేరా?" అడిగాడు అతను.

"ఆయన ఏక్సిడెంట్‌లో పోయారా? నేను నమ్మను. నేను నమ్మను. ఎక్కడున్నారు ఆయన?" అరిచింది.

ఆ అరుపుకి పిల్లలు లోపల్నించి పరుగెత్తుకు వచ్చారు. పిల్లల్ని చూడగానే పార్వతికి దుఃఖం కట్టలు తెంచుకుని వచ్చేసింది. భోరున ఏడ్వడం మొదలు పెట్టింది. పిల్లలూ తల్లిని కావలించుకుని ఏడుస్తున్నారు.

ఎదురింట్లోవాళ్ళు, పక్క యింట్లో వాళ్ళు వచ్చారు ఆ గోల విని.

''డాక్టర్‌గారి తల్లిదండ్రులు, ఈమె తల్లిదండ్రులు ఎక్కడున్నారు? మేము కబురు పంపుతాము'' అన్నాడు పోలీస్ ఆఫీసర్ పక్కింటి పెద్దమనిషితో.

''డాక్టర్‌గారి తల్లితండ్రులు లేరు. ఈమె తల్లితండ్రులు బెంగుళూరులో వుంటున్నారు. అడ్రస్ నాకు తెలియదు. ఆమెనే అడగాలి.''

నలుగురు ఆడవాళ్ళు పార్వతిని సముదాయిస్తున్నారు. ఏమని ఓదారుస్తారు. ఏం చెపితే ఆమె దుఃఖం పోతుంది. ముగ్గురు పిల్లల్ని చూసి చూసి, కడుపు తరుక్కుపోయేటట్లు ఏడుస్తోంది.

బెంగుళూరులో వున్న ఆమె తల్లితండ్రుల చిరునామా ఎవర్నో అడిగి తెలుసుకుని పోలీస్ ఆఫీసర్లు వెళ్ళిపోయారు.

## 3

''యస్'' అన్నాడు అసిస్టెంట్ కమీషనర్ ఇన్‌స్పెక్టర్ ఆంథోనీ లోపలికి రాగానే.

''డాక్టర్ శ్రీనివాస్ కారు ఏక్సిడెంట్ కేసుగురించి సార్''

''యస్ రిపోర్టు ఏది?''

''ఇదుగో సార్''

''దర్యాప్తు పూర్తయిందా?'' అడిగాడు ఏ.సి.

''ఇది ఏక్సిడెంట్‌లా తోచడంలేదు సార్''

''ఏం?''

''కారు సైదాపేటనించి గిండీవైపు వెళుతూ ఆ పల్లంలో పడింది. దాదాపు పన్నెండు గంటల ప్రాంతంలో ఏక్సిడెంట్ జరిగివుండాలి. తలవూపాడు ఏ.సి.

''రోడ్డు మీద టయిర్ గుర్తులని బట్టి యిరవైమైళ్ళ స్పీడుకన్నా వేగంగా వచ్చి వుండడానికి వీల్లేదు అని తేలింది.''

''అలాగా!''

''కారు పల్లంలోకి పడిన చోట టయిర్ గుర్తులని బట్టి కారు నడుపుతున్నప్పుడు యింకా నెమ్మదిగా, అంటే రెండు మూడు మైళ్ళ స్పీడుకన్నా ఎక్కువ వుండి వుండదు.''

''కారు వెనక్కి తిప్పుతున్నప్పుడు పడిందేమో?'' అన్నాడు ఏ.సి.

''రివర్స్ గేర్‌లో లేదు సార్''

''వెనక్కి తిప్పడానికి, కాస్త వెనక్కి వెళ్ళి మళ్ళీ ముందుకి తిప్పుతున్నప్పుడు పడిందేమో?'' అన్నాడు ఏ.సి.

''అలా జరిగివుండవచ్చు కానీ రేడియేటర్ కిందికి వుండేటట్లు నిలువునా పడింది. అలా పడినపుడు కారుకి నిప్పు అంటుకోవలసిన అవసరంలేదు. పెట్రోలు టాంక్ మూత తెరిచివుంది. వెనక వున్న పెట్రోలు టాంక్ వద్ద మంట ప్రారంభం అయి తర్వాత ముందుకి వ్యాపించిందని తేలింది.''

''అనుమానానికి అంతేనా యింకేమైనా ఆధారాలున్నాయా?'' అడిగాడు ఏ.సి.

''రాజయ్యర్ అంటే ఏక్సిడెంట్ రిపోర్ట్ చేసిన మనిషి గిండీనించి, సైదాపేట వైపు సైకిలు మీద వెళుతూ మంటలు చూశాడు.''

"అవును. ఆ రిపోర్ట్ చూశాను."

"ఏక్సిడెంట్ జరిగిన చోటినించి అరఫర్లాంగు దూరంలో రాజయ్యర్‌కి ఎదురయ్యాడుట కాలినడకన గిండీవైపు వెళుతున్న ఓ మనిషి"

"ఎలా వున్నాడు ఆ మనిషి?" అడిగాడు ఏ.సి

"సూటు వేసుకున్నాడని మాత్రం జ్ఞాపకం వుంది రాజయ్యర్‌కి. అంతకన్నా వివరంగా ఆనవాళ్ళు చెప్పలేకుండా వున్నాడు."

"ఏక్సిడెంట్ జరిగిన చోటునించి గిండీవైపు వెళుతున్నాడన్నమాట ఆ మనిషి"

"అవును సార్! ఏక్సిడెంట్ జరిగిన ప్రదేశానికి, ఆ మనిషి రాజయ్యర్‌కి కనిపించిన చోటికి మధ్య యింకో రోడ్డు లేదు. అంటే కాలినడకన వెళుతున్న ఆ మనిషి కారుని చూసి వుండాలి."

"చూసినా రాజయ్యర్‌కి ఆ విషయం ఎందుకు చెప్పలేదనా?"

"అవును సార్. అదే అనుమానం. అంతేకాదు. కారు ఆ పల్లంలో పడిన తర్వాత కారు తలుపు తెరుచుకుని బయటికి రావడానికి డాక్టర్ శ్రీనివాస్‌కి చాలా వ్యవధి వుండి వుండాలి. అటువంటి ప్రయత్నం డాక్టర్ చెయ్యలేదని అనుకోవలసి వస్తోంది."

"ఎందువల్ల తన ప్రాణం కాపాడుకోవడానికి డాక్టర్ ప్రయత్నం చెయ్యలేదంటావు?" అడిగాడు ఏ.సి.

"రెండే కారణాలు కనిపిస్తున్నాయి సార్. ఒకటి ఆత్మహత్య. డాక్టర్ ఆత్మహత్య చేసుకోవడానికే ఆ కారులోంచి బయటికి రాలేదనుకోవాలి."

"రెండో కారణం?" అడిగాడు ఏ.సి.

"హత్య."

ఇన్ స్పెక్టర్ సందేహించాడు నిముషం పాటు.

"చెప్పండి యిన్‌స్పెక్టర్" ఏ.సి అడిగాడు.

"ఆత్మహత్యే అయ్యుండాలి సార్. రాజయ్యర్‌కి కనిపించిన మనిషి ఏక్సిడెంట్ విషయం రాజయ్యర్‌కి చెప్పకపోవడానికి అతనికి ఏవో కారణాలు వుండివుండవచ్చు. అత్యవసరంగా ఎక్కడికయినా వెళుతున్నాడేమో? పోలీస్ ఇన్వెస్టిగేషన్‌తో సంబంధం పెట్టుకోవడం యిష్టంలేకేమో? డాక్టర్‌కి శత్రువులుకానీ, హత్య చేసేటంత ద్వేషించేవాళ్ళు కానీ వున్నట్లు లేరు. డాక్టర్ మరణం వల్ల ఎవరికీ లాభం రాదు. అందువల్ల ఆత్మహత్య అని నా అనుమానం" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

ఏ.సి తలవూపి "హత్య జరిగిందేమోనని అనుమానం కలిగింది కనుక, హోమిసయిడ్ డిపార్టుమెంట్‌కి యీ కేసు పంపించడం మంచిదనుకుంటాను" అన్నాడూ.

"యస్ సార్"

"సరే నేను క్రైం డి.సి.కి పంపిస్తాను రిపోర్టు" అని డిప్యూటీ కమీషనర్‌కి టెలిఫోన్ చేశాడు.

## 4

"ఇటువంటి కేసులంటే నాకు ఏమాత్రం ఇష్టంలేదు" అన్నాడు డిటెక్టివ్ యిన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు డాక్టర్ శ్రీనివాస్ కారు ఏక్సిడెంట్ కేసుకి సంబంధించిన రిపోర్ట్ అంతా చదివి సార్జంట్ శివంతో.

"ఎందుకు యిష్టంలేదు సార్?" అడిగాడు సార్జంట్.

"ఏక్సిడెంట్ జరిగినచోట యిప్పుడు ఏమీలేదు. కారు అక్కణ్ణించి తీసేశారు. శవమూ పూర్తిగా కాలిపోయింది. సాక్ష్యాలు ఏమైనా వుండివుంటే అన్నీ పోయాయి" అన్నాడు ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు.

"ఈ రిపోర్ట్‌ని బట్టి మీ అభిప్రాయం ఏమిటిసార్?" అడిగాడు సార్జంట్.

"ఆత్మహత్య అనే అనిపిస్తోంది."

"ఆ రాజయ్యర్ అనే అతనికి ఎవరో కాలినడకన ఎదురయ్యారుట. అతని సంగతి?"

"ఫలానా చోట ఓ కారు తగలబడుతున్నదని రాజయ్యర్‌కి చెప్పడానికిగానీ, తనే పోలీసులకి రిపోర్ట్ చెయ్యకపోవడానికి గానీ లక్షా తొంభై కారణాలు వుండివుండవచ్చు. అతనికేమీ సంబంధం వుండి వుండదు. నిజంగా అతను డాక్టర్‌ని హత్యచేసి వుంటే అంత అజాగ్రత్తగా రోడ్డుమీద నడిచి వెళతాడా? రాజయ్యర్ సైకిల్ మీద రావడం దూరాన్నించి చూసి ఏ చెట్టువెనకో దాక్కోడా?" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"అవును సార్. ఇప్పుడే మీరు దర్యాప్తు ప్రారంభిస్తారా?" అడిగాడు సార్జంట్.

"అవును. ఎందుకు ఆలస్యం? త్వరగా తేల్చిపారేస్తే సరి, పద"

"ఎక్కడికి?"

"డాక్టర్ భార్యని కలుసుకుందాం" అన్నాడు ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు.

"నేను డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావుని. శ్రీమతి పార్వతిగారున్నారా?" అడిగాడు ఇన్ స్పెక్టర్.

"ఉన్నది. రండి" అని హాల్లోకి తీసికెళ్ళి "పార్వతి నా కుమార్తె. నా పేరు చలపతిరావు. నిన్ననే నేనూ, నా భార్యా బెంగుళూర్‌నించి వచ్చాము. చాలా షాక్ అయ్యాం" అని 'పార్వతీ' అని కేకేశాడు.

ఒదులుగా జుట్టు ముడివేసుకున్నది. చామనఛాయ, సన్నగా పొడుగ్గా వున్నది. అందమైనదీ కాదు, అనాకారీ కాదు పార్వతి.

"మిమ్మల్ని ఈ దుఃఖ సమయంలో ప్రశ్నలు అడగడానికి వచ్చినందుకు క్షమించండి. కానీ తప్పదు" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"మీరు ఎన్ని ప్రశ్నలు అడిగినా ఏం లాభం? ఆయన మళ్ళీ రారు" అన్నది పార్వతి దిగులుగా.

అంతలో ముగ్గురు పిల్లలూ హాల్లోకి వచ్చారు.

"అమ్మా! పిల్లల్ని తీసుకెళ్ళు. వెళ్ళండి" అన్నది పార్వతి పిల్లలతో. ముగ్గురు పిల్లలూ తల్లినీ, ఇన్‌స్పెక్టర్నీ కళ్ళప్పగించి చూస్తున్నారు.

"వెళ్ళండమ్మా! వెళ్ళి ఆడుకోండి" అన్నాడు స్వరాజ్యరావు. స్వరాజ్యరావు గొంతు వినగానే బెదిరిపోయినట్లు ముగ్గురు పిల్లలూ లోపలికి పరిగెత్తారు.

"అడగండి.." అన్నది ఇన్‌స్పెక్టర్ని చూసి పార్వతి

"ఉన్నది వున్నట్లు నిర్మొహమాటంగా మాట్లాడతాను. క్షమించండి. మీవారు ఆత్మహత్య చేసుకున్నారేమోనని మాకు అనుమానంగా వుంది. పొరపాటున కారు పల్లంలో పడలేదని అనిపిస్తోంది. మీవారు ఆత్మహత్య చేసుకోవడానికి కారణాలు ఏమైనా వున్నాయా?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"ఆత్మహత్యా? ఆయన ఎందుకు ఆత్మహత్య చేసుకుంటారు?"

"బతుకుమీద ఎవరికి ఎప్పుడు విరక్తి కలుగుతుందో చెప్పటం చాలా కష్టం. డాక్టరుగారికి డబ్బు యిబ్బందులు ఏమైనా వున్నాయా?"

"లేవు. ఇది మా సొంత యిల్లు. చిల్లుకానీ అప్పులేదు. నాకు తెలిసినంతవరకూ ఆయన యెక్కడా అప్పు చెయ్యలేదు. బాంక్‌లో దాదాపు పదివేలరూపాయలున్నాయి. మంచి ప్రాక్టీసు వున్నది."

"మీకూ, డాక్టరుగారికీ మనస్పర్థలు ఏమైనా కలిగాయా?"

పార్వతి జాలిగా చూసింది ఇన్‌స్పెక్టర్ని. "మాకు పెళ్ళయి పన్నెండేళ్ళయింది. ఈ పన్నెండేళ్ళల్లో నేనూ ఆయన ఎన్నడూ ఒకళ్ళని ఒకళ్ళం ఒక మాట అనుకోలేదు. తిట్టుకుని పోట్లాడుకునే తత్వాలు కావు మావి. భార్యగా, నా పిల్లల తల్లిగా నేను నిర్వహించవలసిన బాధ్యతలు నిర్వహించేదాన్ని. మనస్పర్థలు ఎందుకు కలుగుతాయి?"

"వేరే యింకేదయినా కారణం వల్ల మానసిక వ్యథ అనుభవించేవారా?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"నాకు చెప్పలేదు. ఆత్మహత్య చేసుకునేటంత క్షోభపడుతున్నట్లు కనిపించలేదు ఎన్నడూ" అన్నదామె.

"క్షమించండి, కొంచెం ప్లెయిన్‌గా అడుగుతున్నందుకు. మరెవరైనా స్త్రీ వలలో పడి ఆయన యిబ్బందులపాలు అయ్యారా?"

"ఏమో? మరొక స్త్రీచేత ఆకర్షింపబడి వుండవచ్చు. అంతమాత్రాన ఆయన ఆత్మహత్య ఎందుకు చేసుకుంటారు?" అడిగింది.

ఇన్‌స్పెక్టర్ రెండు నిముషాలు మౌనంగా వుండిపోయాడు. "ఆయనకి విరోధులెవరైనా వున్నారా?" అడిగాడు.

"విరోధులా.. లేరు."

"చూడమ్మా! డాక్టరుగారు ఆత్మహత్య అయినా చేసుకునుండాలి, లేదా హత్య చెయ్యబడి వుండాలి. ఏక్సిడెంట్ మాత్రం కాదు ఆయన మరణానికి కారణం. మీరు సహకరిస్తే కానీ మేము ఏం చెయ్యలేము."

పార్వతి ఏడుస్తోంది.

"ప్లీజ్ ఏడవకండి"

"ఏడవక ఏం చెయ్యను? దుఃఖం ఎలా ఆపుకోను ఇన్‌స్పెక్టర్. ఆయన మరణించారు. ఇక రారు. మీరు ఎన్ని ప్రశ్నలు అడిగినా నేనెన్ని సమాధానాలు చెప్పినా ఆయన యిక రారు. నా పిల్లలకి యిక తండ్రిలేడు" ఏడుస్తోంది.

"క్షమించండి. మేము వెళ్ళివస్తాము" అని ఇన్‌స్పెక్టర్ లేచి నిలబడ్డాడు.

"ఒక విషయం మాత్రం నేను నిశ్చయంగా చెప్పగలను. ఆయన ఆత్మహత్య చేసుకునుండరు" అన్నది పార్వతి.

"థాంక్స్" అని ఇన్ స్పెక్టర్ వెళ్ళిపోయాడు.

## 5

**డిటెక్టివ్ యుగంధర్** కన్సల్టింగ్ రూంలో రివాల్వింగ్ కుర్చీలో కూర్చుని దినపత్రిక చదువుతున్నాడు. అతని అసిస్టెంట్ రాజు ఆ గదిలోనే బల్లవెనక కూర్చుని ఉత్తరాలు టైపు చేస్తున్నాడు.

కాలింగ్ బజర్ చప్పుడు అయింది.

రాజు వెళ్ళి నిముషంలో తిరిగి వచ్చి "ఎవరో చలపతిరావు, ఆయన కుమార్తె పార్వతి వచ్చారు. మిమ్మల్ని కలుసుకోవాలిట" అన్నాడు యుగంధర్‌తో.

"ఎందుకో చెప్పారా?"

"లేదు. మీతోనే మాట్లాడాలన్నారు."

"తీసుకురా" అని యుగంధర్ చెప్పగానే రాజు వెళ్ళి క్షణంలో తిరిగి వచ్చాడు.

"ఈయన చలపతిరావుగారు. బెంగుళూరు గవర్నమెంట్ ఉద్యోగి. ఈమె పార్వతిగారు. ఆయన కుమార్తె, వీరే యుగంధర్" అని రాజు పరిచయం చేశాడు.

"కూర్చోండి" అన్నాడు యుగంధర్.

"మిమ్మల్ని గురించి ఎంతో విన్నాను. మీ ఫోటోలు కూడా పత్రికల్లో చూశాను. ఎప్పుడూ కలుసుకునే అవకాశం లేకపోయింది" అన్నాడు చలపతిరావు.

"నన్ను కలుసుకోవలసిన అవకాశం రావాలని కోరుకోవడం మంచిది కాదేమో" అన్నాడు యుగంధర్ నవ్వుతూ.

"యు ఆర్ కరెక్ట్" అని చిన్నగా నవ్వి "ఇటువంటి చిన్నకేసులు మీరు తీసుకోరనీ, మీకు వ్యవధి వుండదనీ అమ్మాయికి చెప్పాను. కానీ వినిపించుకోలేదు. మీరే చెపితే తృప్తిపడుతుంది" అన్నాడు చలపతిరావు.

"ఏమిటా కేసు?" అడిగాడు యుగంధర్.

చలపతిరావు గొంతు సవరించుకున్నాడు. "డాక్టర్ శ్రీనివాస్ నా అల్లుడు. పార్వతి ఆయన భార్య. వారం రోజుల క్రితం నా అల్లుడు కారు ప్రమాదంలో మరణించాడు."

యుగంధర్ తలవూపాడు.

"ముగ్గురు పిల్లలు. మంచి ప్రాక్టీసున్నది అతనికి. పోలీసులు దర్యాప్తు చేసి డాక్టరు శ్రీనివాస్ ఆత్మహత్య అయినా చేసుకునుండాలి లేదా హత్య అయినా చేయబడి వుండాలి అన్నారు."

"రెండింటిలో ఏదో నిశ్చయించారా?" అడిగాడు యుగంధర్.

"ఆత్మహత్య అని నిన్ననే నిశ్చయించారు."

"అలాగా" అన్నాడు యుగంధర్.

"భర్త ఆత్మహత్య చేసుకుని మరణించాడని అంటే పార్వతికి ఎలా వుంటుందో మీరు ఊహించగలరనుకుంటాను. రేపు పిల్లలు పెద్దవాళ్ళయ్యాక వాళ్ళకి ఎలా వుంటుంది? తండ్రి ఆత్మహత్య చేసుకోవడానికి తల్లి కారకురాలేమోననే అనుమానం కలుగుతుంది. అవునా?"

"చెప్పండి" అన్నాడు యుగంధర్.

"తన భర్త ఆత్మహత్య చేసుకునుండడని పార్వతి నిశ్చయంగా నమ్ముతోంది. ప్రమాదవశాత్తూ మరణించి వుండాలి లేదా హత్యచేయబడి వుండాలి అంటోంది."

"డాక్టరుగార్ని హత్య చేసేటంత ద్వేషించే విరోధులు వున్నారా ఆయనకి"

"లేరనుకుంటాను. ఉన్నా మాకు తెలియదు. ఆత్మహత్య చేసుకునుంటే దానికి కారణమూ తెలియడంలేదు. పోలీసులూ చెప్పలేకుండా వున్నారు. మీరు యీ కేసు దర్యాప్తు చెయ్యాలనీ, డాక్టర్ మరణానికి నిజమైన కారణం ఏమిటో తెలుసుకోవాలనీ పార్వతి మిమ్మల్ని కోరడానికి యిక్కడికి వచ్చింది" అన్నాడు చలపతిరావు.

"సామాన్యంగా యిటువంటి విషయాలలో పోలీసులు పొరపాటు పడరు. ఏక్సిడెంట్ అయినదీ, ఆత్మహత్య అయినదీ, హత్య అయినదీ నిశ్చయించేందుకు పోలీసు శాఖలో ఆ విషయానికి సంబంధించిన నిపుణులున్నారు. ఆత్మహత్య అని పోలీసులు నిశ్చయించారంటే వాళ్ళకి తగిన ఆధారాలుంటాయి. కారణం మీకు చెప్పక పోవడానికీ కారణం వుండి వుండవచ్చు" అన్నాడు యుగంధర్.

అప్పటివరకూ పార్వతి ఒక్కమాట మాట్లాడలేదు. యుగంధర్ని చూసి "డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ స్వరాజ్యరావుగారుట. ఆయన శక్తిసామర్థ్యాలను నేను శంకించడంలేదు కానీ సూచనగా ఆయన నా భర్త ఆత్మహత్య చేసుకోవడానికి కారణం చెప్పారు. అది నమ్మశక్యంగా లేదు" అన్నది.

"ఏమిటా కారణం?" అడిగాడు యుగంధర్.

"మరొక స్త్రీచే ఆకర్షించబడి నా భర్త ఆమెకి దాసుడయి నన్ను విడవలేక, ఆమెనీ విడవలేక, ఆ యిరకాటంలోపడి బతకలేక ఆత్మహత్య చేసుకున్నారని."

"అలా జరిగి వుండకూడదా?" అడిగాడు యుగంధర్.

తల విదిలించింది పార్వతి. "ఆరునెలల నించీ మావారు ఎవరో యింకో స్త్రీతో తిరుగుతున్నారని నాకు తెలుసు. నాకు తెలుసునని ఆయనకీ తెలుసు. ఆ విషయం నేను కానీ, ఆయన కానీ ఎన్నడూ ప్రస్తావించలేదు. ఆయనని నేను పల్లెత్తుమాట అనలేదు. ముగ్గురు పిల్లల తల్లిని. వాళ్ళ పోషణలో యింటి బాధ్యతల్లో నాకు సరిపోతుంది. ఆయనతో సరదాగా షికార్లకి తిరగడానికి తీరికవుండేదికాదు. ఆయన కులాసాగా, సంతోషంగా వుంటే నేను బాధపడే మనిషిని కాను" అన్నది పార్వతి.

"ఆయన మరొక స్త్రీతో సంబంధం పెట్టుకున్నా మీరు పోట్లాడలేదు కనుక ఆయన ఆత్మహత్య చేసుకోవలసిన అవసరం లేదంటారు. అవునా?"

"అవును."

"మీ వల్ల కాకపోయినా ఆమెవల్ల ఆత్మహత్య చేసుకునుండవచ్చుగా?" అడిగాడు యుగంధర్.

పార్వతి తలవూపింది. "అందుకే మిమ్మల్ని దర్యాప్తు చెయ్యమని కోరుతున్నారు. ఆమె ఎవరో తెలుసుకోవాలని కూడా నాకు లేదు. కానీ ఆయన ఆత్మహత్య చేసుకునుంటే కారణం తెలుసుకోవాలి" అన్నది పార్వతి.

ఆమె కళ్ళలోంచి నీళ్ళు జలజలా రాలాయి.

యుగంధర్ నిముషం పాటు ఆలోచిస్తూ వుండిపోయాడు. పార్వతిని చూస్తేనే తెలుస్తుంది ఆమె సాధ్వి అనీ, సుగుణవతి అనీ, భర్తే దైవంగా పిల్లలే ప్రపంచంగా తలుస్తూ సంసారం చక్కదిద్దుకునే ఆడది అని.

"ఇటువంటి వ్యవహారాలు ఎక్కువగా కెలికి దర్యాప్తు చెయ్యడం మంచిది కాదేమో" అన్నాడు యుగంధర్.

"ఇంతకన్నా ఎవరు ఎక్కువ కెలుకుతారు. తల గిర్రున తిరిగిపోతోంది. నేనేం నేరం చేశాను? ఆయన నన్ను వదిలించుకోవడానికి ఆత్మహత్య చేసుకున్నారా? యుగంధర్గారూ! దయచేసి మీరు దర్యాప్తు చేసి నిజం తెలుసుకోవాలి. నాకోసం కాదు. నా పిల్లల కోసం" అని పార్వతి వెక్కి వెక్కి ఏడవసాగింది.

"ఊరుకోండమ్మా నేను దర్యాప్తు చేస్తాను. నాకు సాధ్యమైతే నిజం తెలుసుకుంటాను. నా దర్యాప్తుకి ఉపయోగపడే సూచనలు ఏమైనా యివ్వగలరా?"

"నేను ఏం సూచనలు యివ్వగలను? ఆయన క్లినిక్ పానగల్ పార్కు దగ్గిరున్నది. అంతే. అంతకన్నా నాకేం తెలియదు."

"ప్రైవేటు ప్రాక్టీసేనా? ఏదయినా ఆస్పత్రిలో కూడా పని చేసేవారా?"

"ప్రైవేట్ ప్రాక్టీసే."

"క్లినిక్ మాత్రమేనా? నర్సింగ్ హోం కూడా వున్నదా?"

"నర్సింగ్ హోం లేదు. పొద్దున్న మౌంట్ రోడ్డు, సాయంకాలం త్యాగరాయ నగర్ క్లినిక్‌లో వుండేవారు."

"నెలకి రాబడి ఏ మాత్రం వుండేది?"

"వెయ్యికి పైగా వుండేది."

"నర్సులు కానీ, కాంపౌండర్లు కానీ క్లినిక్‌లో పనిచేసేవారా?"

"కాంపౌండర్, నర్సు అంతా ఒకే మనిషి ఎమిలీ. పొద్దున్నే మౌంట్ రోడ్‌కి, సాయంకాలం త్యాగరాయ నగర్‌కి వచ్చేది."

"ఆరు నెలలుగా మీ భర్త మరొక స్త్రీతో సంబంధం పెట్టుకున్నట్లు చెప్పారు. ఆమె ఎమిలీ అయ్యుండవచ్చా?" అడిగాడు యుగంధర్.

పార్వతి మొట్టమొదటిసారి నవ్వింది. "కాదు. ఎమిలీకి యాభై ఏళ్ళుంటాయి" అన్నది.

"మీ వారు ఎవరో యింకో స్త్రీతో స్నేహంగా వున్నారని మీరు అన్నారు. ఆ విషయం మీకు నిశ్చయంగా తెలుసా? ఎలా తెలుసు?"

"నిశ్చయంగా తెలియడం అంటే? ఇటువంటి విషయాలు నిశ్చయంగా ఎలా తెలుస్తాయి, ఆయన చెపితే తప్ప. ఆయన చెప్పలేదు సరికదా ఎన్నడూ ఆ విషయం మాట్లాడలేదు. వీలయినంత వరకూ నాకు తెలియకుండా వుండాలని రహస్యంగా వుంచడానికి ప్రయత్నించారు."

"అయితే ఎలా తెలిసింది?"

"సిక్స్‌త్ సెన్స్ అయ్యుండవచ్చు, ఇంట్యూషన్ అయ్యుండవచ్చు. రాత్రిళ్ళు ఆలస్యంగా వచ్చేవారు యింటికి. క్లినిక్‌కి ఫోన్ చేస్తే అక్కడ వుండేవారు కారు. ఏ అర్జంటు కేసో వచ్చి వెళ్ళివుంటారని అనుకునేదాన్ని మొదట్లో. చాకలాడికి బట్టలు వేస్తున్నపుడు కోటు జేబులో ఎండిపోయిన మల్లెపువ్వులు, పాంటు జేబుల్లో ఆడవాళ్ళ చిన్న సిల్కురుమాళ్ళు, ఆయన దగ్గిర కొత్త సెంట్ వాసన. యిలాటివే. వీటిని బట్టే అనుమానం కలిగింది. ఆఖరిదాని పుట్టినరోజునాడు సాయంకాలం త్వరగా యింటికి రమ్మని మరీ మరీ చెప్పాను క్లినిక్‌కి వెళుతున్నప్పుడు. అయినా చాలా ఆలస్యంగా, అది నిద్రపోయిన తర్వాత రాత్రి పన్నెండు గంటలకి ఇంటికి వచ్చారు. నా పిల్లలమీద ఒట్టేసి చెపుతున్నాను. ఆ వేళ కూడా నేను ఆయన్ని ఒక్కమాటా అనలేదు. అసలు ఏమీ అడగలేదు. ఏదో అర్జంటు కేసు వచ్చివుంటుంది అని నేనే అన్నాను. ఆయన తలవూపారు. ఆయన జీవితంలోకి యింకో స్త్రీ వచ్చిందని నాకు తెలిసినా ఆ విషయం చర్చించడం నాకు ఇష్టంలేదు. ముగ్గురు పిల్లల తల్లిని, పిల్లలకోసం యింటిని నరకంగా మార్చదలుచుకోలేదు. నా బాధ నాది. నేను గొడవ చేస్తే ఆయన మరింతగా ఆ యింకో స్త్రీ చేత ఆకర్షింపబడతారని తెలుసు. నేను ఏమీ తెలియనట్లు వూరుకుంటే కొన్నాళ్ళకి విసుగెత్తి ఆయనే ఆమెని వదిలేస్తారు. ఇలాటి కారణాలవల్లే నేను ఆ యింకో స్త్రీ గురించి ఆయనతో తగాదా పెట్టుకోలేదు" అన్నది పార్వతి.

"ఆమె ఎవరో మీకు సూచనగానైనా తెలియదన్నమాట" అడిగాడు యుగంధర్.

"తెలియదు" అన్నది పార్వతి.

"నేను యివాళే దర్యాప్తు ప్రారంభిస్తాను. ఒకటి రెండురోజుల్లో మిమ్మల్ని కలుసుకుంటాను" అన్నాడు యుగంధర్.

చలపతిరావు గొంతు సవరించుకుని "మీ ఫీజు?" అడిగాడు.

"వివరాలు నా అసిస్టెంట్ రాజు చెపుతాడు" అన్నాడు యుగంధర్.

# 6

"డాక్టర్ శ్రీనివాస్ కేసు మీరు దర్యాప్తు చేస్తున్నారని ఎ.సి. చెప్పారు" అన్నాడు డిటెక్టివ్ యుగంధర్ ఇన్స్పెక్టర్ స్వరాజ్యరావు గదిలోకి వెళ్ళి.

"కూర్చోండి యుగంధర్! అవును. నేనే దర్యాప్తు చేశాను. మీకేమిటి ఆ కేసులో ఇంట్రస్టు?" అడిగాడు ఇన్స్పెక్టర్.

"డాక్టర్ శ్రీనివాస్ భార్య పార్వతీదేవి నన్ను దర్యాప్తు చెయ్యమనీ, నిజం తెలుసుకోమనీ కోరింది."

డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ స్వరాజ్యరావు నవ్వాడు. "తెలుసుకోవడానికి, మీరు దర్యాప్తు చెయ్యడానికి ఏమీలేదు. చాలా సింపుల్ కేసు" అన్నాడు.

"అలాగా! వివరాలు చెపుతారా?" అడిగాడు యుగంధర్.

"డాక్టర్ శ్రీనివాస్‌కి జయంతి అనే అమ్మాయితో ఎనిమిదినెలల క్రితం పరిచయం అయింది. ఆ జయింతి సి.టి కాలేజీలో బి.ఏ ఫైనల్ చదువుతోంది. హాస్టలులో వుంటోంది. ఆ అమ్మాయి తండ్రి మధురలో వ్యాపారస్తుడు. బాగా డబ్బున్నవాళ్ళు. ఒకరోజు సాయంకాలం జయంతి త్యాగరాయ నగరంలో డాక్టర్ శ్రీనివాస్ క్లినిక్ ముందు రోడ్డుమీద కాలుజారి పడిందట. సరిగ్గా ఆ సమయానికి డాక్టర్ శ్రీనివాస్ క్లినిక్‌లోంచి బయటికి వస్తున్నాడుట. వెంటనే డాక్టర్ శ్రీనివాస్ జయంతి కాలు పరీక్ష చేసి, కట్టుకట్టేందుకు తన క్లినిక్‌లోకి తీసుకెళ్ళాడుట. అలా ఆవేళ డాక్టర్‌కీ, జయంతికి పరిచయం అయింది. ఆ తర్వాత కాలికి కట్టు కట్టించుకునేందుకు జయంతి డాక్టర్ క్లినిక్‌లోకి రోజూ సాయంకాలం వచ్చేదిట. అలా ప్రారంభమైంది వాళ్ళ స్నేహం. మధ్య వయస్కుడు, ముగ్గురు పిల్లల తండ్రి అయిన డాక్టర్ శ్రీనివాస్‌లో జయంతికి ఏం ఆకర్షణ కనపడిందో మనకు తెలియదుకాని, వారం రోజులలోపున డాక్టరూ, జయంతీ ప్రేయసీ ప్రియులు అయ్యారు" అని గుక్క తిప్పుకోకుండా చెప్పాడు ఇన్స్పెక్టర్.

"ఈ వివరాలన్నీ మీకు ఎవరు చెప్పారు?"

"నర్సు ఎమిలీ చెప్పింది. భార్యకి తెలియకుండా తన ప్రేమాకలాపం చాలా రహస్యంగా ఉంచడానికి డాక్టర్ శ్రీనివాస్ ప్రయత్నం చేశాడుట. నర్సు ఎమిలీ కూడా పార్వతితో చెప్పలేదు."

"జయంతి హాస్టలులో వుంటోంది కదా! విచ్చలవిడిగా డాక్టర్‌తో తిరుగుతూ వుంటే హాస్టల్ మాట్రన్ ఊరుకున్నదా?"

"డాక్టర్ శ్రీనివాస్‌తో స్నేహం అయిన పదిరోజుల తర్వాత జయంతి హాస్టల్లోంచి వచ్చేసింది. మైలాపూరులో స్నేహితుల యింట్లో వున్నది."

"మరి ఆమె తండ్రి అడగలేదూ, ఎందుకు హాస్టల్లోంచి వచ్చేశావని?"

"హాస్టలు భోజనం తనకి పడలేదనీ, తన స్నేహితురాలి యింట్లో వుంటాననీ, నెలకి యింత అని వాళ్ళకి డబ్బు యిస్తాననీ తండ్రికి ఉత్తరం రాస్తే ఆ పెద్దమనిషి కూతురు రాసింది నమ్మి సరేనన్నాడు."

"ఎవరా స్నేహితురాలు? డాక్టర్ స్నేహితులా? జయంతి స్నేహితులా? పెళ్ళికాని పిల్ల అలా తిరుగుతే వాళ్ళు ఎందుకు ఊరుకున్నారు?"

"వాళ్ళు డాక్టర్ స్నేహితులు. విచిత్రమైన దంపతులు. నీతిని గురించీ, స్త్రీ పురుషుల సంబంధం గురించీ వాళ్ళ అభిప్రాయాలు అవకతవకగా వున్నాయి. డాక్టర్‌కీ, ఆ అమ్మాయికీ యిష్టమైతే వాళ్ళు సుఖంగా వుండడం ఎవరూ అభ్యంతర పెట్టకూడదని వాళ్ళ అభిప్రాయమట. వాళ్ళకి ఏమీ పట్టలేదు. నా అనుమానం జయంతి నెలకి యిచ్చే ఎనభై రూపాయలకి ఆశపడ్డారని."

"వాళ్ళు ఎవరు? అతనికేం ఉద్యోగం?" అడిగాడు యుగంధర్.

"ఆయన పేరు సుబ్బరామయ్య. రిటైర్ అయిన హెడ్‌క్లర్కు. అతని భార్య కొన్నాళ్ళపాటు ఉద్యోగం చేసి అనారోగ్యం వల్ల ఉద్యోగం మానేసింది. వాళ్ళకి పిల్లలు లేరు. అతని ఫించన్ డబ్బు వాళ్ళ జీవనాధారం."

యుగంధర్ తలవూపి "డాక్టర్ శ్రీనివాస్ జయంతి అనే అమ్మాయిని ప్రేమించాడు. సుబ్బరామయ్య పుణ్యమా అంటూ ఆ అమ్మాయిని వాళ్ళ యింట్లో అట్టే పెట్టి గుట్టుగా ప్రణయం సాగిస్తున్నాడు. అటువంటప్పుడు తన ఆత్మహత్య ఎందుకు చేసుకోవాలి?" అడిగాడు.

ఇన్ స్పెక్టర్ స్వరాజ్యరావు కాస్త విసుగ్గా యుగంధర్ని చూసి "ఆత్మహత్య చేసుకునే వాళ్ళందరూ ఆ సమయంలో మనస్సు స్థిమితంగా లేకే చేసుకుంటారు అని మీకూ తెలుసు. తన భార్యకీ, పిల్లలకీ అపచారం చేస్తున్నాననే చింతతోనో లేక ఆ జయంతి అతన్ని ఏదో చిక్కుల్లో పెట్టడంవల్లో అతను ఆత్మహత్య చేసుకునుంటాడు" అన్నాడు.

"జయంతి ఏమన్నది? డాక్టర్ శ్రీనివాస్ ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడన్నది?" అడిగాడు యుగంధర్.

"జయంతి కనపడడంలేదు" చెప్పాడు యిన్‌స్పెక్టర్ చల్లగా.

"వాట్ జయంతి కనపడడంలేదా? ఏమైంది?" అడిగాడు యుగంధర్ ఆశ్చర్యంతో.

"డాక్టర్ శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకున్న రాత్రినించీ జయంతి కూడా కనపడడంలేదు."

"ప్లీజ్ వివరంగా చెప్పండి."

"ఏమున్నది చెప్పడానికి? డాక్టర్ శ్రీనివాస్ మరణించినది జూలై ఎనిమిదో తేదీ. అదే రోజు ఎనిమిది గంటలకి తను ఊరికి వెళ్ళిపోతున్నానని సుబ్బరామయ్యకీ, అతని భార్యకీ చెప్పి, సామానులన్నీ సర్దుకుని జయంతి వెళ్ళిపోయిందిట."

"తండ్రి ఇంట్లో లేదా?"

"లేదు. అక్కడకు వెళ్ళలేదు. పాపం ఆ తండ్రి చాలా ఖంగారుగా వున్నాడు."

"సుబ్బరామయ్య యింటినించి ఒక్కతే వెళ్ళిందా? ఎలా వెళ్ళింది? టాక్సీలోనా?"

"అవును. టాక్సీ డ్రైవర్ని పట్టుకున్నాము. జయంతిని ఆ రాత్రి ఎనిమిది గంటలకి సెంట్రల్ స్టేషన్‌లో దింపానని చెప్పాడు."

"ఏ ఊరికి టిక్కెట్టు కొన్నదీ తెలియలేదా?"

"లేదు. మూడవక్లాసు టిక్కెట్టు కొనుండాలి. బుకింగ్ క్లర్క్ చెప్పలేకపోయాడు. దీన్నిబట్టి డాక్టర్ శ్రీనివాస్‌కీ, జయంతికీ ఏదో తగాదా వచ్చిందనీ, అందువల్లే ఆయన ఆత్మహత్య చేసుకున్నాడనీ నేను అనుకుంటున్నాను."

"ఐ యామ్ సారీ. అలా వూహించడం నా నైజం కాదు ఇన్‌స్పెక్టర్. యీ కేసుని గురించిన వివరాలు వ్రాసిన రిపోర్టు వున్నదా? మొదటినించీ అంటే ఏక్సిడెంట్‌కి సంబంధించిన వివరాలు అన్నీ."

"ఓ ఎస్. ఇక్కడే నా బల్ల సొరుగులోనే వున్నది" అంటూ ఇన్‌స్పెక్టర్ ఒక పొడుగాటి కవరు తీసి యుగంధర్‌కి యిచ్చాడు.

"మళ్ళీ వస్తాను" అన్నాడు యుగంధర్ లేచి నిలబడి.

"ప్లీజ్ యుగంధర్ సులభంగా, ముక్కుకి సూటిగా వున్న కేసుని దయచేసి కలగాపులగం చెయ్యకండి" అన్నాడు ఇన్‌స్పెక్టర్ నవ్వుతూ.

# 7

**డాక్టర్ శ్రీనివాస్** మరణం గురించిన పోలీస్ రిపోర్ట్ అంతా చదివి కాగితాలు మడిచి బల్లమీద పెట్టాడు రాజు.

"ఏమంటావు?" అడిగాడు యుగంధర్ తన అసిస్టెంట్‌ని.

"ఏక్సిడెంట్ మాత్రంకాదు. అంతవరకూ నిశ్చయంగా చెప్పవచ్చు" అన్నాడు రాజు.

యుగంధర్ తలవూపాడు. "ఇటువంటి విషయాలలో పోలీసులు పొరబడరు. నిస్సందేహంగా ఏక్సిడెంట్ మాత్రం కాదని తేలుతోంది. యిక మిగిలింది హత్యా, ఆత్మహత్యా అనేది" అన్నాడు యుగంధర్.

ఏక్సిడెంట్‌ని గురించి రిపోర్ట్ యిచ్చిన రాజయ్యర్‌కి కనిపించిన మనిషి గురించి పోలీసులకి ఏమీ తెలియలేదు. అతనెవరో, ఏక్సిడెంట్ చూసినా ఎందుకు రిపోర్ట్ చెయ్యలేదో తెలిస్తే బావుంటుంది" అన్నాడు రాజు.

"జయంతి యేమైంది? ఎక్కడికి వెళ్ళింది? తండ్రికి తెలియకుండా ఎక్కడికి పారిపోయి వుంటుంది? ఎందుకు పారిపోయింది? మనిషి కనిపించకుండా ఎలా మాయమవుతుంది?" అన్నాడు యుగంధర్.

"అవును. ఒకవేళ డాక్టర్ శ్రీనివాస్‌తో ఆమెకి తగాదా వచ్చినా, తండ్రికి తెలియచెయ్యకుండా ఊరు విడిచి ఎక్కడికో పారిపోవలసిన అవసరం ఏమున్నది?" అన్నాడు రాజు.

అంతలో కాలింగ్‌బెల్ చప్పుడయింది. రాజు వెళ్ళి నిమిషంలో తిరిగివచ్చి "జయంతి తండ్రి రాఘవన్. పిలవనా?" అని అడిగాడు యుగంధర్ని.

"ఈ రోజే ఆమె తండ్రి మనల్ని కలుసుకోవడానికి రావడం కేవలం కాకతాళీయమా?" అన్నాడు యుగంధర్.

రాజు భుజం చరిచి వెళ్ళి రాఘవన్‌తోపాటు గదిలోకి వచ్చాడు.

"కూర్చోండి" అన్నాడు యుగంధర్.

"నమస్కారం. మా జయంతి జాడ యేమైనా తెలిసిందా అని కనుక్కోవడానికి నేను ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావుని కలుసుకున్నాను. మీరు ఈ కేసు దర్యాప్తు చేస్తున్నారనీ, డాక్టరుగారి భార్య మిమ్మల్ని సహాయం కోరిందని చెప్పారు. నేనుకూడా వచ్చి మిమ్మల్ని కలుసుకుని" అని గొంతు సవరించుకున్నాడు. గొంతు బొంగురుపోయింది వొణుకుతోంది.

"అయ్యా! యుగంధర్‌గారూ! మాకు ఒక్కతే కూతురు. చాలా గారాబంగా పెంచాము. అది కనిపించకుండా పోయేసరికి నా భార్య మంచాన పడింది. నేను వ్యాపారం కట్టిపెట్టి వారంరోజులుగా ఈ ఊళ్ళోనే ఉంటున్నాను. యుగంధర్‌గారూ! ఎలాగయినా మా అమ్మాయి ఎక్కడున్నదో తెలుసుకోవాలి, ప్లీజ్" అన్నాడు రాఘవన్.

"పోలీసులు ఆమె జాడలు తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారుగా, ఖంగారుపడకండి"

"పోలీసులు అసమర్థులని నేను అనడంలేదు. వాళ్ళకి ఎన్నో కేసులుంటాయి. వాటిలో యిది ఒకటి. అమ్మాయి మా దగ్గిరకి రావడానికి భయపడుతున్నదేమో? పల్లెత్తుమాట అనను దాన్ని, నచ్చచెప్పి తీసుకురండి" రాఘవన్ వేడుకుంటున్నాడు.

మీ అమ్మాయి జాడలు నాకు తెలిస్తే తప్పకుండా మీకు చెపుతాను. దయచేసి ఒకటి రెండు ప్రశ్నలకి జవాబులు చెపుతారా?"

"అడగండి" అన్నాడు రాఘవన్.

"మీ అమ్మాయి హాస్టల్లోంచి వెళ్ళిపోయి ఎవరి యింట్లోనే వుంటే మీకు అనుమానం కలగలేదా?"

"లేదండీ లేదు. అటువంటి అనుమానం కలిగివుంటే వెంటనే వచ్చి జయంతిని చదువు మాన్పించి యింటికి తీసుకెళ్ళిపోయేవాణ్ణి."

"ఆమె తరుచు మీకు ఉత్తరాలు రాసేదా?"

"ఈ ఆరు నెలలుగా అట్టే రాయడంలేదు. అప్పుడప్పుడూ కులాసాగా వున్నానని ఒక పోస్టుకార్డు రాసేది. చదువులో తీరిక లేకుండా వున్నదనుకున్నామే కానీ యిటువంటి వ్యవహారంలో యిరుక్కున్నదని మేము అనుకోలేదు."

"మీ బంధువుల యిళ్ళకి వెళ్ళిందేమో కనుక్కున్నారా?"

"ఆ! ఎవరింటికీ వెళ్ళలేదు."

"కాలేజీలో స్నేహితురాళ్ళ యింటికి వెళ్ళిందేమో?"

"లేదు. ఆ విషయమూ విచారించాము."

"సరేనండీ రాఘవన్‌గారూ! నేను యీ కేసు దర్యాప్తు చేస్తున్నానుగా. మీ అమ్మాయి విషయం తెలిస్తే చెపుతాను."

"అలాకాదు. మా అమ్మాయి విషయం ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుని మీరు దర్యాప్తు చెయ్యాలి. మీ ఫీజు నేను యిస్తాను."

యుగంధర్ నవ్వాడు. "సరే, మీ అడ్రసు యిచ్చి వెళ్ళండి" అన్నాడు.

**8**

చింతాద్రిపేటలో ఒక యిరుకు సందులో వీధిలోకి వున్న కటకటాల యిల్లు అది. మిస్ ఎమిలీ, క్వాలిఫయిడ్ నర్సు అని బోర్డున్నది. రాజు తలుపు తట్టగానే యాభై ఏళ్ళ స్త్రీవచ్చి తలుపు తీసి తళతళ మెరుస్తున్న క్రిజ్లర్ కారునీ, కారు తలుపు దగ్గిర నిలుచున్న యుగంధర్నీ ఆశ్చర్యంతో చూసి "ఎవరు?" అని అడిగింది.

"మిస్ ఎమిలీ మీరేనా?" అడిగాడు రాజు.

ఆమె తలవూపింది.

"డాక్టర్ శ్రీనివాస్‌గారి మరణం గురించి ఆయన భార్య పార్వతీదేవి తరపున దర్యాప్తు చేస్తున్నాం, డిటెక్టివ్ యుగంధర్‌ని. మీ సహకారం కోరుతున్నాను" అన్నాడు యుగంధర్ మెట్లదగ్గిరకి వెళ్ళి.

"రండి" అని తలుపు తీసి లోపలికి తీసుకెళ్ళి పేము కుర్చీలు చూపించింది ఎమిలీ.

"డాక్టర్ శ్రీనివాస్‌గారు మరణించడం గురించి మీ అభిప్రాయం ఏమిటి? ఆయన ఆత్మహత్య చేసుకున్నారని అంటారా?" అడిగాడు యుగంధర్.

బాగా నెరిసిన జుట్టు సన్నగా పొడుగ్గా ఉన్నది. తెల్లని చీర, తెల్లని జాకెట్టు. చేతికి గడియారం, మెళ్ళో ఒంటివరస హారం, హారానికి క్రాస్ పెండెంట్. సహనమూ, ఔదార్యము, మంచితనం ఆమె కళ్ళల్లో గోచరిస్తున్నాయి.

"ఏమో? నేనెలా చెప్పగలను?" అన్నది.

"మీరెన్నాళ్ళనించి డాక్టర్ శ్రీనివాస్ వద్ద పనిచేస్తున్నారు?"

"ఎనిమిదేళ్ళుగా."

"ఎనిమిదేళ్ళు పనిచేసిన తర్వాత ఆయన తత్వం గురించి మీకు ఏమీ తెలియదా?" అడిగాడు యుగంధర్.

"నేను ఇరవై తొమ్మిదేళ్ళనించీ నర్సుగా పనిచేస్తున్నాను. ఎవరెవరు ఎప్పుడు ఏం చేస్తారో చెప్పటం కష్టం అనీ, ఎవరి నైజమూ మనం తెలుసుకోలేమనీ యిన్నేళ్ళ అనుభవంతో తెలుసుకున్నాను" అన్నది.

"డాక్టర్‌గారికి జయంతి అనే అమ్మాయితో పరిచయం అయిన రోజున మీరు క్లినిక్‌లో వున్నారా?" అడిగాడు యుగంధర్.

"లేను. ఉండివుంటే వాళ్ళిద్దరికీ అంత చనువు ఏర్పడేది కాదేమో?"

"కనుక మర్నాడు జయంతి మళ్ళీ కాలికి కట్టు కట్టించుకోవడానికి వచ్చినప్పుడు మీరు ఆమెని చూశారన్నమాట."

"అవును"

"ఎలా ఉంటుంది?"

"చాలా అందంగా వుంటుంది. చాలా చలాకీపిల్ల. తెలివైనది."

"ఆ అమ్మాయితో డాక్టర్ అంత చనువుగా వుంటే వద్దని మీరు వారించలేదా?"

"లేదు. అనవసర విషయాల్లో జోక్యం కల్పించుకోను. నా హద్దు దాటి ప్రవర్తించను."

"డాక్టర్‌కీ, ఆమెకీ బాగా చనువు ఏర్పడిందనీ, వాళ్ళు అక్రమ సంబంధం పెట్టుకున్నారనీ మీకు తెలుసా?"

"తెలియదు. గ్రహించాను."

"పార్వతీదేవికి ఈ విషయం చెప్పవద్దని డాక్టర్ మీకు చెప్పారా?"

"లేదు."

"జయంతి క్లినిక్‌కి తరుచూ వచ్చేదా?"

"ఆ! దాదాపు రోజూ కాలేజీనించి తిన్నగా క్లినిక్‌కి వచ్చేది."

"కనుక వాళ్ళు తమ ప్రణయకలాపం రహస్యంగా ఉంచడానికి ప్రయత్నం చెయ్యలేదన్నమాట."

తలవూపింది ఎమిలీ.

"డాక్టర్‌గారు మరణించిన రోజు మీరు క్లినిక్‌నించి ఎన్నిగంటలకి బయలుదేరి వెళ్ళిపోయారు?"

"ఏడున్నరకి."

"డాక్టర్ క్లినిక్‌లోనే వున్నారా అప్పుడు?"

"ఆఁ!"

"సామాన్యంగా మీరే ముందు వెళ్ళిపోతారా?"

"ఒక పద్ధతి లేదు. ఒకప్పుడు ఆయన ముందు వెళ్ళిపోతారు. ఒకప్పుడు నేను ముందు వెళ్ళిపోతాను. మా యిద్దరి దగ్గిరా తాళం చెవులుండేవి."

"ఆ రోజు ఆయనకేమైనా ముఖ్యమైన పనుండి ఉండిపోయారా?"

"నాకు తెలియదు."

"ఆరోజు సాయంకాలం జయంతి క్లినిక్‌కి వచ్చిందా?"

"రాలేదు."

"డాక్టర్ ఏమైనా మానసిక వ్యథలో వున్నట్టు కనిపించారా?"

"పరధ్యానంగా వున్నారు."

"ఆ రోజు రాత్రి పన్నెండు గంటలవరకూ క్లినిక్‌లో వుండవలసిన పనివున్నదా డాక్టర్‌గారికి?"

"నాకు తెలిసినంతవరకూ అటువంటి పని ఏమీలేదు. నేను వెళ్ళిన తర్వాత అర్జంట్ కేసు వచ్చి వుంటే తప్ప."

"డాక్టర్‌గారికి విరోధులు ఎవరయినా వున్నారా?"

"నాకు తెలియదు. ఆయనతో పోట్లాడేందుకు క్లినిక్‌కి ఎవరూ రాలేదు యీ ఎనిమిదేళ్ళల్లో."

"జయంతిని ప్రేమించిన యువకుడు ఎవరయినా వుండవచ్చా" అన్నాడు యుగంధర్.

"ఏమో, నాకు తెలియదు."

"థాంక్స్ వస్తాము" అని యుగంధరూ, రాజూ అక్కణ్ణించి బయలుదేరారు.

రాజు కారు డ్రైవ్ చేస్తున్నాడు. "ఎమిలీకి డాక్టర్‌ని గురించి చర్చించడం యిష్టంలేదు" అన్నాడు.

"ఎమిలీ తనకి తెలిసిన విషయాలన్నీ చెప్పడంలేదు. దాస్తోంది" అన్నాడు యుగంధర్.

"బెదిరించి నిజం చెప్పించలేమా?"

"చిన్నపిల్లా? చదువుకోనిదా? ఏమని బెదిరించగలం? ఎమిలీనించి మనకి ఏమీ తెలియదు. పద, సుబ్బరామయ్య ఇంటికి" అన్నాడు యుగంధర్.

మైలాపూర్‌లో కొత్తగా కట్టిన సి.ఐ.టి. కాలనీలో ఒక చిన్న యింటిముందు రాజు కారు ఆపి "ఇదే సుబ్బరామయ్య ఇల్లు" అన్నాడు.

"వసారాలో పడకకుర్చీలో కూర్చున్న మనిషి అతనే అయుండాలి. పద" అని యుగంధర్ లోపలికి దారితీశాడు.

అరవై ఏళ్ళుంటాయి సుబ్బరామయ్యకి. సన్నగా పొడుగ్గా వున్నాడు. గూడకట్టు లాల్చీ, తెల్లని క్రాఫింగు తల. పడక కుర్చీలోంచి లేచి యుగంధర్ని ప్రశ్నార్థకంగా చూశాడు.

"నా పేరు యుగంధర్ ఇతను నా అసిస్టెంట్ రాజు. జయంతిని గురించి దర్యాప్తు చేస్తున్నాము" అన్నాడు యుగంధర్.

"లోపలికి రండి" అని హాల్లోకి తీసుకెళ్ళాడు. చిన్నహాలు, ఒక సోఫాసెట్టు. చాలా శుభ్రంగా వుంది గది. ముగ్గురూ కూర్చున్నాక "లక్ష్మీ! కాఫీ మూడు కప్పులు" అని కేక వేశాడు.

"జయంతి మీ యింట్లో ఎంతకాలం వున్నది?" అడిగాడు యుగంధర్.

"ఆరునెలలు."

"డాక్టరుగారు తీసుకువచ్చి యిక్కడ వుంచారా?"

"డాక్టర్‌గారు అడగడం వల్ల ఇక్కడ మా యింట్లో పెట్టుకున్నాం."

"నెలకి ఎంత యిచ్చేది?"

"ఎనభై రూపాయలు."

"చాలా ఎక్కువ కదూ?"

"జయంతి కానీ, డాక్టర్‌గారు కానీ అలా అనుకోలేదు."

"డాక్టరు మీ యింటికి తరుచూ వచ్చేవారా?"

"ఆ! ఆయన మా స్నేహితులు."

"ఎంతకాలంగా డాక్టరు మీ స్నేహితులు?"

"పదేళ్ళనించీ, పదేళ్ళక్రితం నా భార్యకి పెద్ద జబ్బు చేసింది. అప్పట్నించీ"

"డాక్టర్‌గారు యిక్కడికి వచ్చి రాత్రిళ్ళు జయంతితో గడిపేవారా?"

సుబ్బరామయ్య నవ్వాడు. "రాత్రంతా వుండేవారు కాదు. ఏ అర్ధరాత్రో యింటికి వెళ్ళిపోయేవారు. మేము అభ్యంతరం చెపుతామని కాదు. ఆయన భార్యకి కష్టం కలగకుండా."

"జయంతి పెళ్ళికాని పిల్ల. చదువుకుంటోంది. డాక్టర్ పిల్లల తండ్రి, భార్య బతికే వుంది వాళ్ళిద్దరి మధ్యా యిటువంటి బాంధవ్యాన్ని మీరు ఎలా ప్రోత్సహించారు?"

"ఒక ఆడదీ, ఒక మొగాడూ ఒకర్ని ఒకరు ఇష్టపడితే వారి బాంధవ్యం అవినీతికరమైనదని నేను అనుకోను" అన్నాడు సుబ్బరామయ్య.

"జయంతి వున్న గది చూడడానికి వీలుంటుందా?"

"నిరభ్యంతరంగా. కానీ ఆ గదిలో ఆమె వస్తువు ఒకటీలేదు. రండి" అని పక్కనేవున్న గదితలుపు తెరిచాడు. మంచం, సీలింగ్‌ఫాన్, చిన్న బీరువా, డ్రెస్సింగ్ టేబుల్, ఓ కుర్చీ వున్నాయి.

"ఈ ఫర్నీచరంతా మీదా, జయంతిదా?"

"నాదే" అన్నాడు సుబ్బరామయ్య. అంతలో యాభై అయిదేళ్ళ స్త్రీ ట్రేలో మూడుకప్పుల కాఫీ తీసుకువచ్చి బల్లమీద పెట్టింది.

తన భార్యని పరిచయం చేశాడు సుబ్బరామయ్య.

"జయంతి వెళ్ళిపోతున్నప్పుడు ఎందుకు వెళ్ళిపోతున్నదీ మీకు చెప్పలేదా?"

"లేదు. వెళ్ళిపోతానన్నది అంతే."

"ఎక్కడికో చెప్పిందా?"

"లేదు. తల్లితండ్రుల దగ్గిరకి వెళుతున్నది అనుకున్నాను."

"జయంతిని మీ ఇంట్లో పెట్టింది డాక్టర్‌కదా! జయంతి వెళ్ళిపోతానంటే ఆయనకి తెలియజేయవలసిన బాధ్యత మీకు లేదా?"

"ఆమెకి నిజానికి డాక్టర్ గార్డియన్ కాడు. జయంతిమీద డాక్టర్‌కి గల హక్కులు ఆమె యిచ్చినవే. వాటితో నాకు సంబంధంలేదు. వెళ్ళిపోతానంటే సరేనన్నాను."

"జయంతి కోసం డాక్టరు ఆ వేళ యిక్కడికి రాలేదా?"

"రాలేదు."

"జయంతి మీ ఇంట్లోంచి వెళ్ళిపోతున్నదని డాక్టర్‌కి తెలుసా?"

"ఏమో?" అన్నాడు సుబ్బరామయ్య.

"జయంతికి టాక్సీ ఎవరు తీసుకువచ్చారు?"

"నేనే."

"మళ్ళీ వస్తానని మీతో చెప్పిందా?"

"లేదు."

"మీకు ఉత్తరం రాసిందా వెళ్ళిపోయిన తర్వాత?"

"లేదు."

"డాక్టరు ఆత్మహత్య చేసుకున్నాడనే మీరూ అనుకుంటున్నారా?"

"లేదు. ప్రమాదవశాత్తూ ఏక్సిడెంట్‌లో మరణించారని నా అభిప్రాయం."

"పోలీసుల దర్యాప్తులో తెలిసిన వివరాలని బట్టి ఏక్సిడెంట్ కాదని తేలింది."

"పోలీసులు పొరబడి వుండవచ్చు."

"జయంతికి డాక్టర్ ఒక్కడేనా యింకెవరయినా ప్రియులున్నారా?"

"లేరనుకుంటాను. ఆమెకోసం ఈ యింటికి యింకో మొగాడు ఎన్నడూ రాలేదు."

"డాక్టర్‌తో స్నేహం కాకముందు ఎవడైనా యువకుడు ఆమె ప్రియుడు అయ్యుండవచ్చు. డాక్టరుతో స్నేహం అయ్యాక అతనితో స్నేహం మానేసి వుండవచ్చు" అన్నాడు యుగంధర్.

"అటువంటి కసి వున్న మనిషి వుంటే జయంతి తండ్రికి వివరంగా ఆమె ప్రవర్తన గురించి అతను ఉత్తరం రాసేవాడు కదూ" అన్నాడు సుబ్బరామయ్య నవ్వుతూ.

"డాక్టరు ఏదయినా మానసిక వ్యథలో వున్నట్లుకానీ, బాధ పడుతున్నట్లు కానీ మీకు చెప్పారా?"

"లేదు."

"థాంక్స్" అని యుగంధరూ, రాజు సుబ్బరామయ్య ఇంటినించి బయలుదేరారు.

"సుబ్బరామయ్యని గురించి మీ అభిప్రాయం ఏమిటి?" అడిగాడు రాజు.

"డబ్బుకి ఆశపడి డాక్టరు, జయంతుల ప్రణయానికి ప్రోత్సాహం యివ్వలేదు. సిన్సియర్‌గా అతని అభిప్రాయాలు అవి. కానీ మనతో అబద్ధాలు చెప్పాడు."

"ఏమని?"

"ఏం అబద్ధాలు చెప్పాడో తెలిస్తే యింకేం? నిజం తెలుస్తుంది" అన్నాడు యుగంధర్

"త్యాగరాయనగర్‌లో వున్న డాక్టర్ శ్రీనివాస్ క్లినిక్‌కి వెళదాం"

"ఎవరుంటారక్కడ? తాళం వేసి వుండదూ?"

"తాళం చెవి ఇన్‌స్పెక్టర్ని అడిగి తీసుకున్నాను."

అయిదు నిమిషాలలో క్రిజ్లర్ కారు క్లినిక్ ముందు ఆపాడు రాజు. యుగంధర్ తాళం తీశాడు. ఓ హాలు, హాలు పక్కన చిన్న కన్సల్టింగ్ గది. ఆ గదికి అవతల డిస్పెన్సరీ. ఆ క్లినిక్కు అన్ని క్లినిక్స్ మల్లేనే వుంది. ప్రత్యేకతేమీ లేదు.

**"డాక్టర్ క్లినిక్‌నించి** ఆ రోజు ఎన్నిగంటలకి బయలుదేరాడో కనుక్కోవాలి. ప్రయత్నించి చూడు" అన్నాడు యుగంధర్.

రాజు తలవూపి బయటికి వెళ్ళాడు. డాక్టర్ బల్ల సొరుగులు తెరిచి పరీక్షించడం ప్రారంభించాడు యుగంధర్. రోగులకి సంబంధించిన వివరాలు, ఇన్‌కంటాక్స్‌కు సంబంధించిన లెక్కలు, డైరీ, మెడికల్ లిటరేచర్ అంతే. డాక్టర్ అంతరంగిక జీవితానికి సంబంధించిన కాగితాలు ఏవీలేవు. జయంతి డాక్టరుకి రాసిన ఉత్తరాలు ఏవైనా దొరుకుతాయేమోనని వెతికాడు యుగంధర్.

బల్లసొరుగులో క్రోమియం ఫోటో ఫ్రేము ఒకటి ఉంది. ఆ ఫ్రేములో ఫోటోలేదు. ఖాళీ ఫ్రేము మాత్రమున్నది. యుగంధర్ ఫ్రేముని పరీక్షగా చూశాడు. కొత్తది కాదు. అందులో ఫోటో ఉండి ఉండాలి. ఎవరిది? జయంతిదా? డాక్టర్ పిల్లలదా? డాక్టర్ భార్య పార్వతి ఫోటో వుండేదా? ఆ ఫోటో ఏమైంది? ఎవరు తీశారు? యుగంధర్ ఆలోచిస్తున్నాడు. అతని దృష్టి బల్ల అవతల ఉన్న టెలిఫోన్ మీద నిలిచింది. డాక్టర్ యింటికి టెలిఫోన్ చేశాడు.

"పార్వతిగారూ నేను యుగంధర్ని. డాక్టరుగారి బల్లసొరుగులో ఒక ఫొటో ఫ్రేమున్నది. ఖాళీగా ఉంది. అందులో ఎవరి ఫోటో వుండేదో మీకు తెలుసా?" అడిగాడు.

"తెలియదు. నేను ఒకసారే క్లినిక్కి వెళ్ళాను. అదీ నిముషమే ఉన్నాను అక్కడ" అన్నది ఆమె.

"థాంక్స్" చెప్పి యుగంధర్ డిస్కనెక్ట్ చేశాడు. ఎమిలీని అడిగితే తెలుస్తుంది. ఈ విషయం అబద్ధం చెప్పదు. అబద్ధం చెపితే బయటపడుతుంది కనుక. ఎమిలీ ఒకతే కాదు డాక్టర్ పేషెంట్లు చాలామంది ఈ ఫ్రేము చూసి ఉండవచ్చు, బల్లమీద ఉండి వుంటే.

రాజు తిరిగివచ్చాడు. "డాక్టరు క్లినిక్ నించి ఎన్నిగంటలకి బయలుదేరి వెళ్ళినదీ తెలియలేదు కానీ ఆ రాత్రి దాదాపు పదకొండు గంటలవరకూ యిక్కడే ఉన్నట్లు తెలిసింది" అన్నాడు.

"ఎవరయినా చూశారా?" అడిగాడు యుగంధర్.

రాజు తలవూపి "మూడో యింట్లో వున్న ఒక పెద్దమనిషి బంధువుల యింటికి భోజనానికి వెళ్ళి బాగా ఆలస్యంగా తిరిగివచ్చాడుట. క్లినిక్ ముందునించే వెళ్ళాడుట. క్లినిక్లో దీపం వెలుగుతోందని చెప్పాడు. అప్పుడు దాదాపు పదకొండు గంటలయి ఉంటుందన్నాడు."

"దీపం వెలుగు మాత్రం చూశాడా? డాక్టర్నీ చూశాడా?"

"డాక్టరుని చూడలేదుట. తలుపు మూసి ఉందిట."

యుగంధర్ ఆలోచిస్తూ "రాత్రి పదకొండుగంటలవరకూ డాక్టరు క్లినిక్లో ఏం చేస్తున్నాడు? జయంతి కోసం కాచుకున్నాడా? జయంతి ఎనిమిదిన్నరకల్లా రైలుస్టేషన్కి వెళ్ళిందిగా! ఎక్కడికయినా అర్జంటు కేసుమీద వెళ్ళి వచ్చివుంటాడా? అంత రాత్రి యింటికి వెళ్ళకుండా క్లినిక్కి ఎందుకు వస్తాడు? ఆ పేషెంటుకి ఏదో మందు కావలసి క్లినిక్కి వచ్చివుంటాడా? మందు తీసుకుని ఆ రోగి ఇంటికి వెళ్ళి, మందు ఇచ్చి, ఇంటికి తిరిగి వెళుతున్నప్పుడు మరణించిడం జరిగిందా? అయితే ఆత్మహత్య ఎందుకు అవుతుంది? డాక్టరు డైరీ బల్ల సొరుగులోనే ఉంది. డైరీ తీసి చూశాడు. ఆ రాత్రి విజిట్కి వెళ్ళినట్లు రాయలేదు. అసలు రోజంతా ఎక్కడికీ విజిట్కి వెళ్ళినట్లు లేదు డైరీలో. డైరీ క్లినిక్లో ఉన్నది కనుక మర్నాడు పొద్దున్న రాయవచ్చని అనుకుని ఉంటాడా? ఆ రాత్రి అర్జంటు కేసుమీద విజిట్కి వెళ్ళివుంటే ఆ రోగి తరఫున వాళ్ళు పార్వతితో, పోలీసులతో ఆ విషయం చెప్పివుండేవాళ్ళు. కనుక డాక్టరు అంత రాత్రివరకూ క్లినిక్లో ఉండటానికి కారణం అతని వృత్తికి సంబంధించినది కాదు" అన్నాడు.

"ఆంతరంగిక విషయమైతే జయంతికి సంబంధించినది అయివుండాలి" అన్నాడు రాజు.

యుగంధర్ తలవూపి "మనం యిలా ఎంతకాలం చర్చించినా ఏమీ తేలదు. ఏక్సిడెంట్ జరిగినపుడు ఆ రోడ్ మీద రాజయ్యర్కి కనిపించిన మనిషి ఎవరో తెలుసుకోవాలి. జయంతి సెంట్రల్ స్టేషన్ నించి ఎక్కడికి వెళ్ళిందో తెలుసుకోవాలి. ఈ రెండూ చాలా అవసరం. నువ్వు గిండీకి వెళ్ళి వాకబు చెయ్యి. నేను స్టేషన్కి వెళతాను" అన్నాడు యుగంధర్.

## 9

గిండీ రైలు స్టేషన్కి ఎదురుగా వున్న రాజా కాఫీ హోటల్లోకి వెళ్ళాడు రాజు. గల్లా పెట్టె దగ్గిర కూర్చున్న అతన్ని చూసి "రాజయ్యర్ గారు తమరేనా?" అడిగాడు.

"అవును" అన్నాడతను.

"నా పేరు రాజు. డిటెక్టివ్ యుగంధర్ అసిస్టెంట్ని. డాక్టర్ శ్రీనివాస్ కారు ప్రమాదం గురించి దర్యాప్తు చేస్తున్నాను" అన్నాడు.

రాజయ్యర్ విసుగ్గా చూసి "ఇప్పటికి ఓ వందసార్లయినా పోలీసులు యిక్కడికి వచ్చి అడిగిన ప్రశ్నలే మళ్ళీ అడిగారు. కొత్తగా నేను చెప్పగలిగింది ఏమీలేదు ఆ సమయాన నేను అటువెళ్ళడం నా దురదృష్టం. అటు వెళ్ళినవాణ్ణి నోరుమూసుకుని నా దారిన నేను ఇంటికి వెళ్ళకుండా పౌరసత్వ బాధ్యత అని పోలీసులకి ఫోన్ చెయ్యడం నా బుద్ధిపొరపాటు" అన్నాడు.

రాజు నవ్వి "మిమ్మల్ని ఎక్కువ వేధించను కాస్త క్షమించి నా ప్రశ్నలకి జవాబులు చెపితే సంతోషిస్తాను" అన్నాడు.

రాజయ్యర్ కూడా నవ్వి "అడగండి, కాఫీ తాగుతారా?" అన్నాడు.

"ఒద్దు. మీరు హోటల్‌నించి బయలుదేరి వెళుతున్నప్పుడు ఏక్సిడెంట్ జరిగినచోటు దగ్గిర తోవలో ఎవరో ఓ మనిషి కాలినడకన వెళ్ళడం చూశానన్నారు. ఏక్సిడెంట్ జరిగిన చోటునించి సరిగా ఎంతదూరంలో అతను మీకు కనిపించాడు."

"ఒక ఫర్లాంగు దూరం వుంటుంది."

"సైకిల్ మీద వెళుతున్నారు. మీ సైకిల్‌కి లైటున్నదా?"

"ఉన్నది. నూనెదీపం."

"కనుక సైకిల్ తనవైపు వస్తుండడం అతను దూరాన్నించే చూసివుండాలి."

"అవును గుడ్డివాడు అయితే తప్ప."

"మీకు కనిపించకుండా దాక్కోవాలని అతను అనుకుని వుంటే అందుకు అవకాశం ఉందా?"

"ఎందుకు లేదు? ఏ చెట్టు వెనక్కో వెళ్ళి దాక్కునుండవచ్చు."

"అతనికి ఎదురుగా మీరు వెళ్ళినప్పుడు మీ వైపు చూశాడా?"

"లేదు మొహం అవతలవైపుకి తిప్పుకున్నాడు."

"మీ వైపు తిరిగి వుంటే సైకిల్ దీపం వెలుగులో అతని మొహం మీకు కనిపించేదా?"

"కనిపించేది అనుకుంటాను."

"అతను కావలసి మీకు కనిపించకుండా తన మొహం పక్కకి తిప్పుకున్నాడంటారా?"

రాజయ్యర్ నిమిషం పాటు ఆలోచించి "ఆలోచిస్తే అలాగే అనిపిస్తోంది" అన్నాడు.

"ఏక్సిడెంట్ జరిగిన చోటినించి అతను మీకు కనిపించిన చోటువరకూ మీరు నడుస్తున్న రోడ్డుకి పక్క రోడ్లు ఏవీలేవు. ఆ ప్రాంతల ఏ యింట్లోంచో అడ్డదారిన పడి రోడ్లోకి రావడానికి వీలుంటుందా?"

"ఆ ప్రాంతంలో యిళ్ళేవీ లేవు. ఒక మైలుదూరంలో ఓ కాలనీ ఉంది. ఆ కాలనీ వాళ్ళకి గిండి దగ్గిర రోడ్డు ఉన్నది."

"ఈ స్టేషన్ ప్రాంతాల్లో రాత్రి పన్నెండు గంటలు దాటాక ఏ షాపయినా తెరిచి వుంటుందా?" అడిగాడు రాజు.

"అదుగో ఎదురుగా వున్న ఆ టీకొట్టు తెరిచి ఉంటుంది. ఆ వైపున వున్న బోర్డింగ్ అండ్ లాడ్జింగ్ హౌస్ గేటు ముందు రాత్రంతా ఒక గూర్ఖా కాపలా ఉంటాడు. అసలు రాత్రిళ్ళు అన్ని సమయాలలోనూ యీ రోడ్డుమీద రద్దీ వుంటుంది. కారులు, లారీలు, బస్సులు. ఇది ట్రంక్ రోడ్డు కదూ" అన్నాడు రాజయ్యర్.

"థాంక్స్" చెప్పి రాజు హోటల్లోంచి బయలుదేరి ఎదురుగా వున్న టీ కొట్టులోకి వెళ్ళాడు.

"దాదాపు పదిరోజుల క్రితం ఆలందూర్ రోడ్డుమీద అర్ధరాత్రి కారు ఏక్సిడెంట్ జరిగింది జ్ఞాపకమున్నదా?" అడిగాడు రాజు కొట్టు అతన్ని.

"ఆఁ ఎవరో డాక్టరు పోయాడు. ఏం?"

"ఏక్సిడెంట్ జరిగిన ఓ పావుగంట ముందు ఆ రాత్రి ఎవరయినా ఓ మనిషి కాలినడకన ఇటు వచ్చాడా?"

"అవును. పావుగంటేమిటీ దాదాపు గంట ముందు" అన్నాడు టీ కొట్టు అతను.

ఏక్సిడెంట్ విషయం టీకొట్టు అతనికి ఆలస్యంగా తెలిసి వుంటుందని రాజు జ్ఞాపకముంచుకుని "ఆఁ గంటకి ముందు అతన్ని మీరు చూశారా?" అడిగాడు.

"దూరాన్నించి చూశాను. రాజయ్యర్ హోటల్‌కి అవతల నిలుచున్నాడు. నా కొట్టుకి రాలేదు."

"నిలుచుని ఏం చేశాడు?"

"ఒక లారీ ఆపి దాంట్లో ఎక్కి వెళ్ళాడు."

"లారీకి సంబంధించిన మనిషా?"

"ఏమో? నాకెలా తెలుస్తుంది?"

"ఎలా వున్నాడు? ఆనవాలు చెప్పగలరా?"

"ఫుల్ సూట్‌లో ఉన్నాడు ఫెల్ట్‌హేట్ పెట్టుకున్నాడు. పొడుగ్గా వున్నాడు. అంతే చెప్పగలను."

"ఆ లారి నెంబరు కానీ, ఏ కంపెనీదో చెప్పగలరా?"

"సారీ సార్ నేను అదేమీ చూడలేదు. నా పనిలో నేను ఉండిపోయాను" అన్నాడు టీ కొట్టు అతను.

"లారీ ఊళ్ళోకి వెళ్ళిందా? లేక దక్షిణానికి వెళ్ళిందా?" అడిగాడు రాజు.

"టౌన్ వైపే వెళ్ళింది సార్."

"లారీ కోసం ఎంతసేపు అక్కడ కాచుకున్నాడు అతను?"

"ఓ అయిదు నిముషాలు."

"థాంక్స్" చెప్పి రాజు అక్కణ్ణించి బయలుదేరాడు.

10

"పదిరోజుల క్రితం ఒక యువతి టాక్సీలో వచ్చి ఇక్కడ దిగింది సామానుతో. మీలో ఎవరయినా ఆమె సామాను మోసికెళ్ళి రైలులో పెట్టారా?" అడిగాడు యుగంధర్ సెంట్రల్ రైల్వే స్టేషన్ పోర్టికోలో నిలబడ్డ పోర్టర్లని.

"అయ్యా! రోజూ రెండు వందలమంది ఆడవాళ్ళు ఇక్కడ టాక్సీలలో, కార్లలో దిగుతూ ఉంటారు. పదిరోజుల క్రితం కాదు సరికదా, నిన్నటి విషయం అడిగినా చెప్పలేము" అన్నాడు నవ్వుతూ ఓ పోర్టర్.

యుగంధర్ కూడా నవ్వాడు. ఆ పోర్టర్లని ఆ విధంగా సంభాషణలోకి దింపాలనే యుగంధర్ ప్రయత్నం.

"అవును. కష్టమే. కానీ మీలో కొంతమందికి ఎక్కువ జ్ఞాపకశక్తి ఉంటుంది అనుకుంటాను."

"ఎంత జ్ఞాపకశక్తి వుంటే మాత్రం ఏం ప్రయోజనం సార్" అన్నాడు ఇంకో పోర్టర్.

"ఆ అమ్మాయి ఫోటో నాదగ్గరున్నది. చూపిస్తాను. ఎవరికయినా జ్ఞాపకం వస్తుందేమో?" అంటూ యుగంధర్ జేబులోంచి జయంతి ఫోటో తీసి చూపించాడు. యుగంధర్ చుట్టూ నిలుచున్న పోర్టర్లు మెడలు వంచి చూస్తున్నారు.

"ఇలా కాదు. ఒకళ్ళ తర్వాత ఒకళ్ళు చూడండి" అని ఫోటో ఓ పోర్టర్‌కి ఇచ్చాడు యుగంధర్.

"నేను యీమెని చూశాను సార్" అన్నాడు ఒక పోర్టర్.

"అలాగా. ఎన్ని రోజుల క్రితం?"

"దాదాపు పదిరోజుల క్రితం సార్. బాగా జ్ఞాపకమున్నది."

"ఈ అమ్మాయేనా?"

"అవును సార్. యీమే."

"ఏ రైలు ఎక్కింది?"

"రైలు ఎక్కలేదు సార్. టాక్సీ ఎక్కింది."

"టాక్సీ ఎక్కిందా? టాక్సీ దిగిందా?" అడిగడు యుగంధర్.

"టాక్సీలోంచి దిగడం నేను చూడలేదు సార్. టాక్సీలో సామాను పెట్టాను. ఆమె ఎక్కింది. టాక్సీ వెళ్ళిపోవడం చూశాను" అన్నాడు ఆ పోర్టర్.

"ఈ అమ్మాయేనని నీకు నిశ్చయంగా ఎలా తెలుసు?" అడిగాడు యుగంధర్.

"కాస్త గొడవ జరిగిందిలెండి."

"ఇక్కడికి వచ్చి ఎవర్నో దింపిన టాక్సీలోకి సామాను ఎక్కించమన్నది. క్యూలో వున్న టాక్సీలో ఎక్కాలి కానీ ఆ టాక్సీ ఎక్కనివ్వరని చెప్పాను. నా మాట నమ్మక టాక్సీ డ్రైవర్ని అడిగింది. అతను నేను చెప్పినట్టే చెప్పాడు. నన్ను వెళ్ళి ఇంకో టాక్సీ తీసుకురమ్మన్నది. క్యూ దగ్గిర పోలీసు కానిస్టేబుల్ ఉంటాడనీ, నన్ను టాక్సీ తీసుకురమ్మన్నది. క్యూ దగ్గిర పోలీసు కానిస్టేబుల్ ఉంటాడనీ, నన్ను టాక్సీ తీసుకు రానివ్వడని చెప్పాను. అయితే పోర్టర్లు దేనికి అని అడిగింది. టాక్సీలో సామానులు పెట్టడానికనీ డ్రైవర్ సామానులు ఎత్తి పెట్టడనీ చెప్పాను. కోపంగా వెళ్ళిపోయి టాక్సీ తనే తెచ్చుకున్నది. సామాను టాక్సీలో పెట్టాను. నాకు రూపాయి ఇచ్చింది. అసలే కోపంగా వున్న మనిషి ఇంకా ఏమైనా అడిగితే ఇవ్వదని ఊరుకున్నాను" అన్నాడు ఆ పోర్టర్.

"వెరీగుడ్ ఆ టాక్సీ నెంబరు తెలుసా?"

"తెలియదండీ డ్రైవర్ తెలుసు. పేరు షణ్ముగం."

"ఎక్కడికి తీసుకెళ్ళమన్నదో విన్నావా?"

"లేదండీ. టాక్సీ ఎక్కుతున్నప్పుడు డ్రైవర్‌కి ఏం చెప్పిందో నేను వినలేదు."

యుగంధర్ అయిదు రూపాయల నోటు తీసి ఆ పోర్టర్‌కి ఇచ్చాడు.

"ఆ డ్రైవర్ షణ్ముగం వస్తే మీ దగ్గిరికి పంపించనా?" అడిగాడు అతను.

"అవసరంలేదు. నేనే వెళ్ళి కనుక్కుంటాను" అని యుగంధర్ స్టేషన్‌నించి బయలుదేరాడు.

రాత్రి పదకొండు గంటలయింది. గిండి రైలు స్టేషన్‌కి ఎదురుగా నిలుచున్నాడు రాజు. మద్రాసు వైపు వెళుతున్న ప్రతి లారీని ఆపుతున్నాడు.

"పదిరోజుల క్రితం మీరు ఇక్కడ, ఇదే స్థలంలో ఎవర్నయినా మీ లారీ ఎక్కించుకుని తీసుకెళ్ళారా?" అదే ప్రశ్న. అడిగిన ప్రశ్నే మళ్ళీ యింకో లారీ రాగానే ఆపి ఆ డ్రైవర్ని అడుగుతున్నాడు.

అతన్నెవర్నో ఎక్కించుకున్న లారీ మళ్ళీ అదే రోడ్డువెంట అదే టైంకి వస్తుందని నిశ్చయం ఏమీలేదు. ఆ లారీ ఏదయినా ట్రాన్స్‌పోర్ట్ కంపెనీదయితే రావచ్చు. అందుకని రాజు ప్రయత్నిస్తున్నాడు. మరే ఊర్నించో వచ్చిన లారీ అయితే, మళ్ళీ అటు రాకపోవచ్చునని రాజుకి తెలుసు. అయినా ప్రయత్నం చెయ్యక తప్పదు. అపరాధ పరిశోధకుడికి చాలా సహనముండాలి అని యుగంధర్

ఎన్నోసార్లు చెప్పాడు. రాజు ఆ విషయం జ్ఞాపకం తెచ్చుకుని తనలో తను నవ్వుకున్నాడు. అప్పటికి ఇరవై ఎనిమిది లారీలని ఆపాడు. అందరూ మాకు తెలియదంటే తెలియదన్నారు. పన్నెండున్నర అయింది. విసుగెత్తింది. ఏమైనా సరే తెల్లారేటంతవరకూ తను అక్కడ వుండి వచ్చే ప్రతి లారీని ఆపి అడగవలసిందే అని నిశ్చయించుకున్నాడు.

రాత్రి రెండు గంటల ప్రాంతంలో బెంగుళూరునుంచి వస్తున్న ఓ లారీ డ్రైవర్ "అవును సార్ పదిరోజుల క్రితం ఓ పెద్దమనిషిని యిక్కడ నా లారీలో ఎక్కించుకున్నాను" అన్నాడు.

రాజు మొహం వికసించింది.

"నీతో మాట్లాడాలి. మిమ్మల్ని ఇక్కడ ఇలా ఆపి పెట్టడం మంచిదికాదు. నేనూ లారీలో వస్తాను. డ్రైవ్ చేస్తూ నేను అడిగే ప్రశ్నలకి సమాధానాలు చెప్పవచ్చు" అన్నాడు రాజు.

లారీ డ్రైవర్ రాజుని అనుమానంగా చూశాడు. "మీరెవరు?" అడిగాడు. రాజు చెప్పాడు. తన ఐడెంటిఫికేషన్ కార్డు యిచ్చాడు.

లారీ డ్రైవర్ తృప్తిపడి "సరే రండి" అని లారీ పోనిచ్చాడు.

క్లీనర్ వెనక్కి వెళ్ళాడు. రాజు డ్రైవర్ పక్కన కూర్చుని "ఈ లారీలో ఆ వేళ ఎక్కిన అతను ఎలా ఉన్నాడో వర్ణించి చెప్పగలరా?" అడిగాడు.

"ఫుల్ సూటులో ఉన్నాడు. ముదురు కాఫీరంగు సూటు, ఫెల్టు హేట్ పెట్టుకున్నాడు. ఒక సిగిరెట్ తర్వాత ఇంకొకటి వెలిగిస్తూనే ఉన్నాడు."

"మొహం చూడలేదా?"

"చూశాను. ఆనవాలు ఉండే మొహం కాదు. చామనఛాయ."

"అలాకాదు. ఇంకా వివరంగా చెప్పాలి. మీసాలున్నాయా? కళ్ళద్దాలు పెట్టుకున్నాడా? మొహం మీద మచ్చ ఏదయినా ఉందా? ఇలాటివి" అన్నాడు రాజు.

డ్రైవర్ నవ్వి "సారీ సార్ నేను అంత పట్టింపుగా అతని మొహం చూడలేదు. కళ్ళద్దాలు లేవనుకుంటాను. మీసాలున్నాయో లేవో నాకు జ్ఞాపకం లేదు. మచ్చలు, గాట్లు వున్నాయో లేవో నేను చూడలేదు. అతని మొహం జ్ఞాపకం పెట్టుకుని తర్వాత అతన్ని వర్ణించి చెప్పవలసి ఉంటుందని నేను అనుకోలేదు" అన్నాడు.

రాజు కూడా నవ్వి "నిన్ను ఆపి ఏమని అడిగాడు?" అన్నాడు.

"ఊళ్ళోకి వెళ్ళేటట్టుంటే దింపమని అడిగాడు. డబ్బు యిస్తానన్నాడు."

"అర్థరాత్రి అక్కడ ఏం చేస్తున్నదీ, అంత రాత్రివేళ ఊళ్ళోకి ఎందుకు వెళుతున్నదీ చెప్పలేదా?"

"ఏదో గొణిగాడు. నేను వినిపించుకోలేదు."

"ఊళ్ళో ఎక్కడ దింపమన్నాడు?"

"మౌంట్ రోడ్ మీదుగా వెళుతున్నావా? అని అడిగడు. అవునన్నాను. మౌంట్ రోడ్లో దింపమన్నాడు."

"మౌంట్ రోడ్లో ఎక్కడ దిగాడు?"

"రౌండ్ తానా దగ్గిర."

"అప్పుడు టయిం ఎంత అయివుంటుంది?"

"పన్నెండున్నర దాటి వుండాలి. రాత్రి ఆట సినిమాలు చూసివచ్చిన జనం టాక్సీల కోసం తిరుగుతుండడం గమనించాను."

"నీకు డబ్బు ఇచ్చాడా?"

"ఆ! ఒక రూపాయి ఇచ్చాడు."

"చాలా థాంక్స్" అని రాజు ఆ లారీ డ్రైవర్‌కి అయిదురూపాయల నోటు ఇచ్చాడు. మౌంట్ రోడ్లో దిగేశాడు. రాత్రి మూడు గంటలయింది.

**రాత్రిళ్ళు** టాక్సీలు డ్రైవ్ చేసే డ్రైవర్లు సామాన్యంగా మౌంట్ రోడ్డు ప్రాంతాల్లో తారట్లాడుతుంటారు. టాక్సీస్టాండ్ వద్దకి వెళ్ళి వాకబు చేశాడు. ఆ ఫుల్ సూటు మనిషి టాక్సీ ఎక్కివెళ్ళి ఉంటాడని రాజు ఊహిస్తున్నాడు. అతని యిల్లు దగ్గర్లో ఉండి ఉంటే కాలినడకన వెళ్ళి ఉండవచ్చు. మొత్తం ఆరు టాక్సీలున్నాయి. ఫుల్ సూటులో ఉన్న మనిషి గురించి చెప్పి రాజు ఆ డ్రైవర్లని అడిగాడు ఎవరయినా అతన్ని టాక్సీ ఎక్కించుకున్నారా? అని. ఆ ఆరుగురూ లేదని తలలు తిప్పారు. టీ కొట్టులో, రెస్టారెంట్స్‌లో, సైకిల్ రిక్షావాళ్ళనీ అడగాలి అని రాజు అనుకుంటుండగా యింకో టాక్సీ వచ్చి ఆగింది స్టాండులో. రాజు ఆ డ్రైవర్ని అడిగాడు.

"పదిరోజుల క్రితమో, వారం రోజుల క్రితమో నాకు జ్ఞాపకం లేదు సార్ ఓ రాత్రి ఒంటిగంట ప్రాంతాల్లో నైట్ షో సినిమా విడవగానే మీరు చెప్పినటువంటి ఓ మనిషి నా టాక్సీ ఎక్కాడు సార్" అన్నాడు డ్రైవర్.

అమ్మయ్య అనుకున్నాడు రాజు. "ఎక్కడ దింపావు?" అడిగాడు.

"హోటల్ లగ్జరీలో."

"తిన్నగా ఇక్కణ్ణించి హోటల్ లగ్జరీకి తీసుకెళ్ళావా?"

"అవును సార్"

రాజు చేతిగడియారం చూసుకున్నాడు. అప్పుడిక హోటల్ లగ్జరీకి వెళ్ళడం అనవసరం. తెల్లారిన తర్వాత వెళ్ళవచ్చునని టాక్సీ ఎక్కి యింటికి వెళ్ళాడు.

డిటెక్టివ్ యుగంధర్ ట్రాఫిక్ అండ్ లైసెన్సింగ్ ఆఫీస్‌కి వెళ్ళి షణ్ముగం చిరునామా తెలుసుకున్నాడు.

చింతాద్రి పేటలో షణ్ముగం యింటికి వెళ్ళి "డ్రైవర్ షణ్ముగం ఉన్నాడా?" అడిగాడు తలుపు తట్టి.

"లేడు. మీరెవరు?" అడిగింది తలుపు తెరిచిన స్త్రీ.

"అతనితో నాకు పనుంది. ఎక్కడ దొరుకుతాడు ఇప్పుడు?"

"ఏమో? చెప్పడం ఎలా? సవారీమీద ఏ మారుమూలలకయినా వెళ్ళి ఉండవచ్చు" అన్నదామె.

"ఇంటికి ఎన్నిగంటలకి వస్తాడమ్మా?"

"రాత్రి ఎప్పుడో కానీ రాడు."

"రాతి ఎన్ని గంటలకి వస్తాడు?"

"పదో, పదకొండో అవుతుంది"

"మళ్ళీ వస్తాను" అని చెప్పి వెళ్ళిపోయి రాత్రి పదిగంటలకి మళ్ళీ షణ్ముగం యింటికి వెళ్ళాడు.

"ఇంకా రాలేదు. వచ్చే వేళయింది. అలా బెంచీమీద కూర్చోండి" అన్నదామె.

యుగంధర్ ఓపికగా కాచుకున్నాడు. షణ్ముగం యింటికి తిరిగి వచ్చేటప్పటికి రాత్రి ఒంటిగంటయింది. యుగంధర్ని చూసి "ఎవరండీ?" అడిగాడు.

"పాపం యీ పెద్దమనిషి మధ్యాహ్నం వచ్చాడు. మళ్ళా పదిగంటలకి వచ్చి అప్పట్నించీ నీ కోసం కాచుకున్నారు. ఎక్కడికి వెళ్ళావు?" అడిగిందామె.

"సినిమాకి వెళ్ళాను."

"అదే వచ్చే నాలుగు డబ్బులు సినిమాలకి తగలెయ్యి. కట్టుకునేందుకు ఇంకో చీర లేక చస్తున్నాను."

యుగంధర్ నవ్వి "పొద్దున్నించీ పనిచేసిన మనిషి కాస్త ఉత్సాహంగా సినిమా చూడకపోతే ఎలాగమ్మా?" ఆమెతో అని షణ్ముగం వైపు ఇరిగి "పదిరోజుల క్రితం సెంట్రల్ స్టేషన్లో నువ్వు ఒక ఆమెని టాక్సీ ఎక్కించుకున్నావు. అప్పుడు రాత్రి ఎనిమిదిన్నరో, ఎనిమిదిముప్పావో, తొమ్మిదో అయివుంటుంది. ఆమెని ఎక్కడికి తీసుకెళ్ళావో జ్ఞాపకం ఉన్నదా?" అడిగాడు.

షణ్ముగం యుగంధర్ని అనుమానంగా చూసి "మీరెవరు? మీకెందుకు?" అడిగాడు.

యుగంధర్ చెప్పాడు.

"యుగంధర్ గారూ రోజూ ఎందరో స్త్రీలు నా టాక్సీలో ఎక్కుతూ ఉంటారు. ఎక్కడెక్కడికో తీసుకెళతాను. నాకెలా జ్ఞాపకముంటుంది చెప్పండి."

"ఆవిడకూడా ఎవరూ లేరు. సామానులతో పోర్టికోలో నిలబడి వుంది. ఆమె వచ్చి క్యూలో నిలబడి టాక్సీ ఎక్కి, పోర్టికోలోకి తీసికెళ్ళి సామానులు ఎక్కించుకుంది. ఇది ఆమె ఫోటో" అని యుగంధర్ జయంతి ఫోటో చూపించాడు.

షణ్ముగం జయంతి ఫోటో పరీక్షగా చూసి "కాస్త వ్యవధి ఇవ్వండి. జ్ఞాపకం చేసుకోవడానికి ప్రయత్నిస్తాను" అని కాసేపు ఆలోచించి "ఆ! ఒక హోల్డాల్, ఒక తోలు పెట్టె, ఒక పేము బుట్ట ఉన్నాయి. పేము బుట్ట డిక్కీలో పట్టలేదు. ఇప్పుడు జ్ఞాపకం వచ్చింది ఈమె."

"ఎక్కడికి తీసుకెళ్ళావు?" అడిగాడు యుగంధర్.

"హోటల్ లగ్జరీకి సార్."

యుగంధర్ ఆ డ్రైవర్కి పదిరూపాయలు ఇచ్చి అక్కణ్ణించి బయలుదేరాడు. ఆ రాత్రికి యిక హోటల్ లగ్జరీకి వెళ్ళినా ప్రయోజనం లేదని యింటికి వెళ్ళిపోయాడు.

## 11

రాజు కన్సల్టింగ్ రూంలోకి వచ్చేటప్పటికి ఎనిమిది గంటలయింది. అప్పటికే యుగంధర్ డ్రెస్ చేసుకుని రెడీగా ఉన్నాడు.

"నేను వెళ్ళాలి. నీకోసమే కాచుకున్నాను. ఏమైనా తెలిసిందా?" అడిగాడు యుగంధర్.

"ఫుల్సూటు మనిషి గురించేనా? ఆ! చాలా తెలిసింది" అన్నాడు రాజు నవ్వుతూ.

"ఏమిటి తెలిసింది?"

"గిండీ స్టేషన్కి ఎదురుగా నిలబడి, ఊళ్ళోకి వెళుతున్న ఓ లారీని ఆపి, ఎక్కి మౌంట్రోడ్లో దిగాడుట."

"రాజయ్యర్కి కనిపించిన మనిషి అతనే అని నిశ్చయం చేసుకున్నావా?"

"నిశ్చయం ఎలా చేసుకుంటాను? ఆ రాత్రి ఫుల్ సూట్లో ఫెల్టుహేట్ పెట్టుకుని గిండీ ప్రాంతంలో ఇద్దరు మనుష్యులు తిరుగుతుంటే తప్ప ఇతనే అయ్యుండాలి."

"ఆ మౌంట్ రోడ్డు నించి ఎక్కడికి వెళ్ళాడు?"

"హోటల్ లగ్జరీకి" అన్నాడు రాజు.

యుగంధర్ ఆశ్చర్యంతో "హోటల్ లగ్జరీకా?" అడిగాడు.

"అవును."

"రాత్రి మూడుగంటలకా?"

"అవును."

"సామానులు లేకుండా?"

"అవును. ఎందుకు అంత ఆశ్చర్యం?" అడిగాడు రాజు. జయంతిని హోటల్ లగ్జరీలో దింపానని డ్రైవర్ షణ్ముగం చెప్పిన విషయం రాజుకు చెప్పాడు యుగంధర్.

రాజు నవ్వి "అయితే ఇంకేం? మనం ఇద్దరం ఒక చోటికే వెళుతున్నాం" అన్నాడు.

ఇరవై నిముషాల తర్వాత హోటల్ లగ్జరీ పోర్టికోలో రాజు క్రిజ్లర్ కారు ఆపాడు. మేనేజర్ ఇంకా డ్యూటీలోకి రాలేదు కానీ అసిస్టెంట్ మేనేజర్ ఉన్నాడు. అది చాలా పెద్ద హోటల్.

యుగంధర్ తనని తాను పరిచయం చేసుకున్నాడు. "జూలై 14వ తేదీ రాత్రి మీ హోటల్‌కి ఒక అమ్మాయి వచ్చింది. పేరు జయంతి. ఆమె యింకా హోటల్లోనే ఉన్నదా?" అడిగాడు.

"రిజిష్టర్ చూసి చెబుతానుండండి" అని రిజిష్టర్ తిప్పి "సారీ సర్ జయంతి అనే పేరుగల ఆమె మా హోటల్లో బస చెయ్యలేదు" అన్నాడు.

"బహుశా పేరు మార్చుకుని ఉంటుంది. జులై 14వ తేదీ రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో ఎవరయినా స్త్రీ మీ హోటల్‌కి వచ్చి గది తీసుకుందా?" అడిగాడు.

"లేదు సార్" అన్నాడు అసిస్టెంట్ మేనేజర్.

"దయచేసి సరిగా విచారించి చెప్పండి. ఆమెని మీ హోటల్లో దింపినట్లు ఇక్కడికి ఆమెని తీసుకు వచ్చిన టాక్సీ డ్రైవర్ చెప్పాడు."

"జూలై 14వతేదీ రాత్రి మా హోటల్‌కి ఎవరూ వచ్చినట్లు రిజిష్టరులో లేదు. ఎవర్ని విచారించమంటారో చెప్పండి?" అడిగాడు అతను.

యుగంధర్ ఆలోచనలో పడ్డాడు. షణ్ముగం పొరపడ్డాడా? ఇంకో హోటల్‌కి బదులు యీ హోటలు పేరు చెప్పాడా?

"అదే రాత్రి మూడుగంటల ప్రాంతాల్లో మీ హోటల్లో బసచెయ్యడానికి ఒక పురుషుడు వచ్చి ఉండాలి. అతని విషయం ఏమైనా చెప్పగలరా?" అడిగాడు రాజు.

అసిస్టెంట్ మేనేజర్ రాజుని చిరాకుతో చూసి "సారీ మిష్టర్ జూలై పధ్నాలుగో తేదీ రాత్రి ఏడుగంటల తర్వాత మా హోటలుకి మొగవాళ్ళు కానీ, ఆడవాళ్ళు కానీ ఎవరూ రాలేదు బస చెయ్యడానికి. వచ్చివుంటే యీ రిజిష్టరులో రాసి ఉంటుంది. మీరే చూసుకోండి" అన్నాడు పుస్తకం ముందుకి తోసి.

"ఒకవేళ పగలు ఎప్పుడో వచ్చి గది తీసుకుని ఉంటే?" అడిగాడు యుగంధర్.

"అయితే అర్ధరాత్రి వచ్చిన వాళ్ళని గురించి ఎందుకు అడిగారు?

"పగలు ఎప్పుడో వచ్చి గది తీసుకుని, డబ్బు ఇచ్చి వెళ్ళిపోయి రాత్రి సామానులతో వచ్చి ఉండవచ్చుగా. అప్పుడు రాత్రి వచ్చినట్లు రిజిష్టర్‌లో ఉండదు కదా!"

"యు ఆర్ పర్‌ఫెక్ట్‌లీ కరెక్టు సార్. పగలు వచ్చి ఉంటే రాత్రి వచ్చినట్లు రిజిష్టర్‌లో ఉండదు. చాలా సింపుల్ లాజిక్" అన్నాడు అసిస్టెంట్ మేనేజరు.

"అటువంటి పక్షంలో ఆ స్త్రీకానీ, ఆ పురుషుడు కానీ రాత్రి వచ్చినదీ లేనిదీ తెలుసుకోలేరా? రాత్రి డ్యూటీలో ఎవరూ ఉండరా?"

"ఉంటారు. గేటు జవాను, నైట్ డ్యూటీ క్లర్కు, యిద్దరు రూం బాయిస్."

"వాళ్ళని అడిగితే" అన్నాడు యుగంధర్.

"వాళ్ళని అడిగితే తెలియవచ్చు."

"అయితే పిలిపించండి. అడగాలి."

"నైట్ డ్యూటీలో ఉన్నవాళ్ళు పగలు డ్యూటీలో ఉండరు. పగలు డ్యూటీలో ఉన్నవాళ్ళు నైట్ డ్యూటీ క్లర్కు ఎక్కడుంటాడో చెప్పండి."

"ఇంట్లో ఉంటాడు."

"ఇల్లు ఎక్కడో చెప్పండి" అడిగాడు యుగంధర్ ఓపికగా.

"నాకు తెలియదు. మేనేజర్ ఫైల్లో అడ్రసు ఉంటుంది."

"పోనీ రూం బాయిస్, గేటు జవాను ఎక్కడుంటారో చెప్పండి"

"రాత్రికి రండి. వాళ్ళంతా డ్యూటీలో ఉంటారు" అన్నాడు అసిస్టెంట్ మేనేజర్.

అంతవరకు ఆ అసిస్టెంట్ మేనేజర్ పెంకి జవాబులు వింటూ ఓపిక పట్టిన యుగంధర్ ఇక తను మెత్తగా ఉంటే లాభం లేదనుకుని "రాత్రివరకు కాచుకోవడానికి మాకు వ్యవధిలేదు. అవసరము లేదు. ఆల్‌రైట్" అని టెలిఫోన్ తీసి పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కి ఫోను చేసి "హల్లో ఇన్‌స్పెక్టర్ డాక్టరు శ్రీనివాస్ కేసు సందర్భంలో హోటలు లగ్జరీ అసిస్టెంట్ మేనేజర్ మాతో సహకరించడంలేదు. మీరు పోలీసు బలగంతో వస్తే మంచిది అనుకుంటాను" అన్నాడు.

వాటీజిట్ పోలీసులు ఎందుకు? వెయిట్ ప్లీజ్" అన్నాడు అసిస్టెంటూ మేనేజర్ ఖంగారుగా.

"డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు వచ్చి మిమ్మల్ని హెడ్‌క్వార్టర్స్‌కి తీసుకెళితే మీరు యింకొంచెం సరిగా జవాబులు చెప్పి సహకరిస్తారని."

"నో! నో! ఒద్దు. ప్లీజ్. పోలీసులు వచ్చారంటే మేనేజర్ నామీద ఎగురుతాడు. ఆ బాయిస్‌ని పిలిపిస్తాను. నైట్ డ్యూటీ క్లర్కుని పిలిపిస్తాను ప్లీజ్" అని మొరపెట్టుకున్నాడు అతను.

యుగంధర్ నవ్వి "ఆల్ రైట్. ఇన్‌స్పెక్టర్ థాంక్స్. అవసరంలేదు. మీ పేరు వినగానే అసిస్టెంట్ మేనేజర్‌కి ముచ్చెమటలు పోశాయి" అని రిసీవర్ పెట్టేశాడు.

"అయిదు నిమిషాలుండండి వాళ్ళని పిలిపిస్తాను. రూం బాయిస్, హోటలు వాచ్‌మెన్ యిక్కడే క్వార్టర్స్‌లో నిద్రపోతుంటారు. నైట్ డ్యూటీ క్లర్కు ఇల్లు దగ్గిరే. పిలిపిస్తాను పదినిముషాలలో వస్తాడు" అన్నాడు అసిస్టెంట్ మేనేజర్ హడావిడిగా గదిలోంచి బయటికి వెళుతూ.

అయిదు నిముషాలలో రూం బాయిస్ యిద్దరూ యుగంధర్ ముందు హాజరయ్యారు.

"జూలై 14వతేదీ రాత్రి తొమ్మిది గంటలప్పుడు సామానుతో ఒక స్త్రీ వచ్చిందా? బహుశా గది అంతకుముందే రిజర్వు చేసుకునుండాలి" అడిగాడూ అసిస్టెంట్ మేనేజర్.

ఇద్దరు కుర్రాళ్ళూ "జ్ఞాపకం లేదు సార్" అన్నారు.

యుగంధర్ జయంతి ఫోటో తీసి వాళ్ళకి చూపించి "ఈమెని మీరు ఎప్పుడయినా చూశారా?" అడిగాడు.

"నేను చూశాను సార్ తేదీ జ్ఞాపకం లేదు కానీ ఓ రాత్రి యీమె సామానులతో వచ్చింది."

"ఎన్ని సామానులు తెచ్చింది?"

"మూడు సార్ ఒక తోలుపెట్టె, హోల్డాల్, పేము బుట్ట."

"నువ్వే గదిలో పెట్టావా?"

"అవును సార్. రూం నెంబర్ 28 సార్"

"పొద్దున్నే అంటే ఎన్ని గంటలకి? టాక్సీలోనా?"

"ఆరుగంటలకి సార్. టాక్సీలోనే వెళ్ళింది."

"రాత్రి ఆమెగదికి ఎవరయినా మొగతను వచ్చాడా?"

కుర్రాడు అదోరకంగా నవ్వి "నేను అప్పుడు లేను సార్. కింద ఉన్నాను. చూడలేదు" అన్నాడూ.

"వెళ్ళేటప్పుడు ఆమెకూడా ఎవరయినా మొగతను ఉన్నాడా?"

"లేదు సార్. ఆమె ఒక్కతే వెళ్ళింది."

అంతలో నైట్ డ్యూటీ క్లర్కు వచ్చాడు. అతన్ని యుగంధర్‌కి పరిచయం చేశాడు అసిస్టెంటు మేనేజరు. యుగంధర్ జయంతి ఫోటో అతనికి చూపించి "ఈమె మీ హోటల్లో జూలై 14వ తేదీ గది బుక్ చేసుకుని ఆ రాత్రి తొమ్మిది గంటలకి సామానులతో వచ్చింది. మర్నాడు పొద్దున్నే వెళ్ళిపోయింది. జ్ఞాపకమున్నదా?" అడిగాడు.

"జ్ఞాపకం ఉన్నది. రాత్రి తొమ్మిదిగంటలకి వచ్చింది. గది తాళం చెవి అడిగితే యిచ్చాను."

"ఏ పేరున రిజిష్టరు చేసుకుంది?"

క్లర్కు "రూం నెంబరు 28. మిస్ కమల" అన్నాడు.

"అదే రాత్రి మూడుగంటల ప్రాంతంలో ఒకతను ఫుల్ సూట్‌లో ఉన్నతను మీ హోటల్‌కి వచ్చాడు. అతను అంతకుముందే ఒక గది యిక్కడ రిజిష్టరు చేసుకున్నాడా?"

"రాత్రి మూడుగంటలకి ఇక్కడికి ఎవరూ రాలేదు సార్"

"అతన్ని మీ హోటలు ముందు దింపానని టాక్సీ డ్రైవర్ చెప్పాడు."

"సారీ సార్. మా హోటల్‌కి రాలేదు. అంత రాత్రివేళ వచ్చివుంటే నాకు జ్ఞాపకం ఉంటుంది."

"కమల అనే పేరున గది రిజర్వు చేసుకున్న అమ్మాయి తనే వచ్చి రిజర్వు చేసుకున్నదా? ఎవరినైనా పంపించిందా?" అడిగాడు యుగంధర్ అసిస్టెంట్ మేనేజర్ని.

"క్షణం ఆగండి, చెపుతాను. రిజర్వేషన్ పుస్తకం చూసి చెపుతాను" అని రెండు నిముషాల్లో "టెలిఫోన్ చేసి రిజర్వు చేసుకున్నది సార్" అన్నాడు.

"ఎన్ని గంటలకి?"

"సాయంకాలం అయిదుగంటలకి."

"రూం బాయిస్‌కి కానీ, నైట్ డ్యూటీ క్లర్కుకి కానీ కనిపించకుండా లోపలికి ఎవరయినా వెళ్ళేందుకు వీలుంటుందా?" అడిగాడు రాజు.

"గేటు జవాను రానిస్తే ఎవరయినా రాత్రివేళ కాటేజీల్లో దిగివుంటే అక్కడికి ఎవరికీ కనిపించకుండా వెళ్ళవచ్చు. కానీ మెయిన్ బిల్డింగ్‌లో రూమ్స్‌కి వెళ్ళడానికి వీలుండదు" అన్నాడు అసిస్టెంట్ మేనేజర్.

"నైట్ వాచ్‌మెన్ ఏడీ?" అడిగాడు యుగంధర్.

"బయట కూర్చున్నాడు. పిలవనా?" అని నైట్ వాచ్‌మెన్‌ని పిలిచాడు అసిస్టెంట్ మేనేజర్.

సెల్యూట్ చేసి నిలబడ్డాడు ఎదురుగా వాచ్‌మెన్.

"పదిరోజుల క్రితం రాత్రివేళ మూడుగంటల ప్రాంతంలో ఫుల్‌సూటులో ఉన్న మనిషి యీ హోటల్లోకి వచ్చాడా?" అడిగాడు యుగంధర్.

వాచ్‌మెన్ కళ్ళు మూసుకుని ఓ నిముషం పాటు దీర్ఘంగా ఆలోచించి "అవును. ఎవరో అటువంటి మనిషి వచ్చినట్లే జ్ఞాపకం" అన్నాడు.

"ఫుల్‌సూటులో ఉన్నాడు ఫెల్టు హేట్ పెట్టుకున్నాడు. టాక్సీలో దిగాడు" చెప్పాడు రాజు.

"అవును. అటువంటి మనిషి వచ్చాడు."

"లోపలికి వెళ్ళాడా?"

"యస్ సార్"

ఏ గదిలో దిగాడో చెప్పాడా?"

"నాకెందుకు చెపుతారు సార్? మనిషి చూస్తే హోటల్లో బస చేసిన మనిషిలా ఉన్నాడు. గేటు తెరిచాను. లోపలికి వెళ్ళిపోయాడు" అన్నాడు వాచ్‌మెన్.

"అయితే ఏదో ఒక కాటేజీలోకి వెళ్ళివుంటాడు" అన్నాడు అసిస్టెంట్ మేనేజర్.

"ఏ కాటేజీలోకి వెళ్ళినదీ తెలుసుకోగలరా?" యుగంధర్ ప్రశ్నించాడు.

"ఎలా తెలుస్తుంది? తాళం చెవి అతని దగ్గరే వుండి ఉంటుంది. ఎవర్నీ నిద్రలేపవలసిన అవసరంలేదు. తిన్నగా తన కాటేజీలోకి వెళ్ళి ఉంటాడు" అన్నాడు అసిస్టెంటు మేనేజర్.

"ఆవేళ కాటేజీలో ఎవరెవరు బస చేశారో జాబితా చూపించండి" అడిగాడు రాజు.

అసిస్టెంట్ మేనేజర్ రిజిష్టర్ రాజు ముందుకి తోసి "చూడండి" అన్నాడు.

**"రాజూ!** అతని విషయం నువ్వు ఆరా తియ్యి. నేను జయంతి ఇక్కణ్ణించి ఎక్కడికి వెళ్ళిందో కనుక్కోవడానికి ప్రయత్నిస్తాను" అని వెళ్ళిపోయాడు యుగంధర్.

పోలీసు అధికారుల సహాయం లేనిదే అందరు టాక్సీ డ్రైవర్లనీ అడిగి తెలుసుకోవడం చాలా కష్టం. సాధ్యమైన పనికాదు. అందుకని యుగంధర్ తిన్నగా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌కి వెళ్ళి ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావుని కలుసుకున్నాడు.

"జూలై 15వ తేదీ హోటల్ లగ్జరీనించి జయంతి టాక్సీలో బయలుదేరింది సామానులతో సహా. ఎక్కడికి వెళ్ళిందో తెలుసుకోవాలి."

"అట్టే కష్టమైన పని కాదనుకుంటాను. ఎన్ని గంటపుడు టాక్సీ ఎక్కిందో తెలుసా?"

"పొద్దున్న ఆరుగంటలకి."

"అది తెలిస్తే యింకేం? డ్రైవర్ లాగ్ బుక్కులో ఉంటుంది ఎక్కడికి వెళ్ళినదీ. ఇన్‌స్ట్రక్షన్ ఇస్తాను" అని టెలిఫోన్ తీసి, యింకొక పోలీసు ఉద్యోగితో మాట్లాడి "అరగంటో, గంటో, రెండు గంటలో పట్టవచ్చు అంతే" అన్నాడు స్వరాజ్యరావు.

"థాంక్స్" అని ఫుల్‌సూటులో వున్న మనిషికూడా ఆ రాత్రి మూడుగంటల ప్రాంతాల్లో హోటల్ లగ్జరీకి చేరుకున్నాడనీ, బహుశా అతను ఒక కాటేజీ తీసుకునుండాలనీ యుగంధర్ ఇన్‌స్పెక్టర్‌కి చెప్పాడు.

"విచిత్రంగా ఉంది. ఫుల్‌సూటులో వున్న మనిషి డాక్టర్ శ్రీనివాస్ కారు ఆక్సిడెంట్ అయిన చోటినుంచి బయలుదేరాడు. డాక్టర్ శ్రీనివాస్ హత్య చేయబడి వుంటే యితనే హంతకుడు అని అనుకోవాలి. ఇతనికీ, జయంతికి సంబంధం ఏమిటో?"

"సంబంధం ఉన్నదని మనకి తెలియదు. జయంతి మెయిన్ బిల్డింగ్‌లో ఉన్నది. ఇతను కాటేజీలో ఉన్నాడు. మర్నాడు పొద్దున్నే జయంతి హోటల్‌నించి వెళ్ళిపోయింది. ఈ ఫుల్‌సూటు అతను హోటల్ లగ్జరీలో జయంతిని కలుసుకున్నాడో లేడో" అన్నాడు యుగంధర్.

"అంటే ఒకేరోజు జయంతీ, ఆ ఫుల్‌సూటు మనిషి హోటలు లగ్జరీలో గదులు తీసుకోవడం కేవలం కాకతాళీయంగా జరిగిందంటారా?" ఇన్‌స్పెక్టర్ అడిగాడు.

యుగంధర్ తల విదిలించాడు. "జయంతి జూలై 14 వ తేదీ సాయంకాలం హోటల్లో గది రిజర్వ్ చేసుకున్నది. అతను ఎప్పుడు కాటేజీ రిజర్వు చేసుకున్నాడో మనకి తెలియదు. జయంతి ఫలానా హోటల్లో గది రిజర్వ్ చేసుకున్నదని తెలిసి అదే హోటల్లో అతనూ కాటేజీ తీసుకుని వుండవచ్చు."

"అయితే మెయిన్ బిల్డింగ్‌లో గది తీసుకోకుండా కాటేజీ ఎందుకు తీసుకుంటాడు?"

"మెయిన్ బిల్డింగ్‌లో గది ఖాళీ లేదు. రిజిష్టర్‌లో అది గమనించాను."

"అయితే యీ ఫుల్ సూటు మనిషి డాక్టర్ని హత్య చేసి తర్వాత జయంతిని హత్య చెయ్యడానికి అక్కడకి వెళ్ళాడన్నమాట"

"ఏమో? అతను హోటల్‌కి ఎందుకు వెళ్ళాడో తెలియడం కష్టం ఇప్పుడే అసలు జయంతి ఆ హోటల్లో గది ఎందుకు తీసుకున్నదో తెలిస్తే" అన్నాడు యుగంధర్.

"అన్నట్లు మీకు చెప్పడమే మర్చిపోయాను. డాక్టర్ శ్రీనివాస్ బాంక్‌లో నయాపైసా కూడా లేదు" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"పదివేలు ఉన్నాయని అతని భార్య చెప్పిందే"

"అవును. ఉండాలి అనుకున్నది ఆ ఇల్లాలు. జూలై 14వ తేదీన డాక్టర్ శ్రీనివాస్ పదివేలూ తీసేసుకున్నాడు."

"ఆయనే వెళ్ళి తీసుకున్నాడా?"

"అవును. ఆయనే స్వయంగా వచ్చి తీసుకున్నాడని బాంక్ క్యాషియర్ చెప్పాడు."

యుగంధర్ ఆలోచిస్తున్నాడు.

"జయంతీ, ఫుల్ సూటులో వున్న మనిషీ కలిసి డాక్టర్ని హత్యచేసి, డబ్బు తీసుకుని పారిపోయి వుంటారా?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"జయంతి తండ్రి సంపన్నుడు. అదీకాక ఆమె కాలేజీలో చదువుకుంటున్న యువతి. పదివేల రూపాయలకోసం ఒక మనిషిని హత్య చెయ్యడానికి కుట్రపన్నుతుందని నాకు అనిపించడంలేదు. అసలు డాక్టరు బాంక్‌నించి పదివేల రూపాయలు ఎందుకు తీసుకున్నారు?" అన్నాడు యుగంధర్.

"పదివేల రూపాయల కోసం డాక్టర్ని హత్య చెయ్యడానికి జయంతి కుట్రపన్ని ఉండకపోవచ్చు. డాక్టరు మీద కసికొద్దీ అతన్ని హత్య చెయ్యడానికి పూనుకునుండాలి."

యుగంధర్ నవ్వాడు. "ఇప్పటివరకూ మనం సేకరించిన సాక్ష్యాలని బట్టి జయంతి డాక్టర్ని ప్రేమిస్తోందనే తేలింది కాని ద్వేషిస్తోందని తెలియలేదే"

"ఒకప్పుడు ప్రేమించింది నిజమే. పెళ్ళికాని పిల్ల డాక్టరు ఆకర్షణకి లోబడి తన శీలాన్ని అతనికి అర్పించింది. కొన్నాళ్ళకి డాక్టర్‌కి ఆమె మీద మోజుపోయింది. పదివేల రూపాయలు ఇచ్చి ఆమెని వొదుల్చుకోవడానికి ప్రయత్నించి ఉండాలి. అన్నాళ్ళు తనని అనుభవించి మోజు పోగానే వదిలి వేస్తున్నాడని జయంతికి కోపం వచ్చి ఉంటుంది. తను ఎంత బ్రతిమాలినా, ఎంత ఏడ్చినా ప్రయోజనం ఉండదని తెలిసుండాలి. తన జీవితం అలా నాశనం చేసినందుకు జయంతికి డాక్టరు మీద వున్న ప్రేమ అంతా ద్వేషంగా మారడంలో ఆశ్చర్యంలేదు. సామాన్యంగా ప్రేమించిన వాళ్ళే ఎక్కువగా ద్వేషిస్తారు ప్రేమ పోయిన తర్వాత."

"ఊఁ! చెప్పండి" అన్నాడు యుగంధర్.

ఇన్‌స్పెక్టర్ సిగిరెట్ వెలిగించాడు. "ఫుల్‌సూటులో వున్న మనిషి జయంతి స్నేహితుడు. డాక్టరుతో ఆమెకి పరిచయం కాకముందు ఆమె ప్రియుడు అయ్యుండవచ్చు. డాక్టర్ని పదివేలు తీసుకురమ్మని చెప్పివుంటుంది. ఆమె, డాక్టరూ కలిసి ఆలందూర్ రోడ్లోకి వెళ్ళివుండాలి."

యుగంధర్ నవ్వి "డాక్టరు హత్య చేయబడిన సమయంలో జయంతి హోటల్ లగ్జరీలో ఉన్నది" అన్నాడు.

"అయితే జయంతి డాక్టర్ని ఆలందూర్ రోడ్లో ఫలానా చోటికి వచ్చి అక్కడ కాచుకోమని చెప్పివుంటుంది. డాక్టరు అక్కడ కాచుకుని వుంటాడు. జయంతికి బదులు ఆ పాత ప్రియుడు ఫుల్‌సూటు మనిషి వెళ్ళి డాక్టర్ని చంపి ఆక్సిడెంటు జరిగినట్లు కారుని పల్లంలోకి తోసేసి, నిప్పు అంటించి పదివేలు తీసుకుని హోటలు లగ్జరీకి వెళ్ళి ఉండాలి."

"అయితే అతను హోటల్లో జయంతిని ఎందుకు కలుసుకోలేదు?"

"ఎవరికయినా అనుమానం కలిగి తనని వెంటాడి వున్నా అనుమానం జయంతి మీదికి పోకుండా ఉండేందుకు హోటలు లగ్జరీలో యిద్దరూ కలుసుకోలేదు. ఎక్కడో కలుసుకునుంటారు."

"డాక్టర్‌కి జయంతి మీద మోజుపోయి వుంటే ఆమె అర్ధరాత్రి ఫలానా చోట తనకోసం కాచుకోమని చెపితే డాక్టరు ఎందుకు వెళతాడు?" అడిగాడు యుగంధర్.

"పదివేల రూపాయలు తీసుకుని, తన దగ్గిర వున్న ఉత్తరాలు యిస్తానని జయంతి చెప్పివుంటుంది. తమ బాంధవ్యం తెగతెంపులు చేసుకోవడానికి వెళ్ళివుంటాడు" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"తార్కింగా ఆలోచిస్తే ఒకటి రెండు లోపాలున్నాయి మీరు చెప్పినదాంట్లో, అయినా మీరు చెప్పినట్టు జరిగివుండవచ్చు" అని యుగంధర్ అంటుండగా సార్జంట్ శివం గదిలోకి వచ్చి "టాక్సీ నెంబరు ఎం.ఎస్.సి.9999, డ్రైవర్ పేరు అబ్రహాం. జూలై పదిహేనువ తేదీ పొద్దున్న హోటలు లగ్జరీనించి ఆరుగంటలకి సెంట్రలు రైల్వేస్టేషన్‌కి సవారి వెళ్ళానని చెప్పాడు. ఒక స్త్రీని తీసుకెళ్ళాడట" అన్నాడు.

"థాంక్స్" అని యుగంధర్ లేచాడు.

"రైలుస్టేషన్‌కి వెళుతున్నారా?"

"అవును. జూలై 14 వతేదీ బహుశా జయంతి రైలు తప్పివుండవచ్చు. మళ్ళీ సుబ్బరామయ్య యింటికి వెళ్ళడం యిష్టంలేక ఆమె హోటల్‌కి వెళ్ళివుండవచ్చు. అంతకన్నా ఏమీలేదేమో అందులో రహస్యం" అన్నాడు యుగంధర్.

**12**

జూలై 14వతేదీన కాటేజీలో బసచేసిన వాళ్ళ పేర్లు అన్నీ చదివాడు రాజు. ఎనిమిమంది దిగారు. ఆరుగురు తిన్నగా హోటల్‌కి వచ్చి కాటేజీలు తీసుకున్నారు. ఇద్దరు మాత్రం ముందుగా రిజర్వ్ చేసుకున్నారు. ఒక మనిషి జూలై 14వతేదీ మధ్యాహ్నం మూడుగంటలకి కాటేజీ రిజర్వ్ చేసుకున్నాడు. ఆ రెండు కాటేజీలకి సంబంధించిన రూం బాయిస్‌ని పిలిపించి రాజు ప్రశ్నించాడు.

"అవును సార్! మీరు చెప్పినటువంటి మనిషి కాటేజీ 28లో బస చేశారు" అన్నాడు ఒక రూం బాయ్.

"నీకెలా జ్ఞాపకం?" అడిగాడు రాజు.

"ఫుల్ సూటులో వున్న మనిషి సాయంకాలం ఆరుగంటలకి వచ్చి కాటేజీలో అరగంట ఉండి వెళ్ళిపోయారు సార్. సామానులు లేవు. నేనడిగాను. సాయంత్రం వస్తాయని చెప్పారు. మర్నాడు పొద్దున్న నేను డ్యూటీలోకి వచ్చేటప్పటికి ఆయన కాటేజీలో ఉన్నారు" అన్నాడు.

"ఎప్పుడు ఖాళీచేసి వెళ్ళాడు?" అడిగాడు రాజు.

"ఆవాళ పన్నెండు గంటలకి వెళ్ళిపోయారు సార్."

"సామానులు ఏమీ లేవా?"

"లేవు సార్."

"టాక్సీలో వెళ్ళాడా?"

"అవును సార్."

"టాక్సీ నెంబరు తెలుసా?"

"తెలియదు సార్. చిన్న టాక్సీ కాదు. పెద్ద టాక్సీ. మా హోటలు గేటు దగ్గర ఎప్పుడూ రెండు పెద్ద టాక్సీలు ఉంటాయి. వాటికి ఇదే స్టాండు. డ్రైవర్ తెలుసు."

"ఉన్నాడేమో చూసి పిలుచుకురా"

కుర్రాడు పరిగెత్తుకు వెళ్ళి పదినిముషాలలో తిరిగివచ్చాడు డ్రైవర్‌తో. రాజు అతన్ని అడిగాడు.

"జ్ఞాపకమున్నది సార్. ఈ రోజుల్లో బేబీ టాక్సీలు వచ్చాక మాకు అంత గిరాకీ లేదు. ఎప్పుడయినా అయిదుగురు ఓసారిగా వెళుతుంటే తప్ప మమ్మల్ని ఎవరూ పిలవరు. అలాటిది ఒక్కడే అయినా పెద్ద టాక్సీ ఎక్కారు. అందుకే జ్ఞాపకమున్నది."

"వర్ణించి చెప్పు. ఎలా ఉన్నాడతను?"

"నేను మొహం సరిగా చూడలేదు సార్. ఫుల్‌సూట్‌లో ఉన్నాడు. బట్టలు కాస్త నలిగి ఉన్నాయి. ఫెల్టు హేట్ పెట్టుకున్నాడు. అందుకే మొహం స్పష్టంగా చూడలేకపోయాను."

"ఎక్కడికి తీసికెళ్ళావు?"

"సెంట్రలు స్టేషన్‌లో దింపాను సార్."

"సరిగ్గా ఎన్నిగంటలకి దింపావు?"

"పన్నెండుంపావు అయింది సార్."

"థాంక్స్" చెప్పి రూం బాయ్‌కి, డ్రైవర్‌కీ చెరొక రెండురూపాయలు యిచ్చి అక్కడ్నించి బయలుదేరాడు. ఫుల్ సూటులో వున్న మనిషి సూర్యప్రకాష్ అనే పేర్న కాటేజీ తీసుకున్నాడని రిజిష్టర్‌లో చూశాడు. అది అతని అసలు పేరో, మారుపేరో తెలియడం కష్టం. హోటల్ లగ్జరీలో కాటేజీ రోజుకి ముప్పయి రూపాయలు. అంత డబ్బు ఖర్చుచేసే మనిషి మూడవక్లాసులో ప్రయాణం చెయ్యడు. ఫస్టుక్లాసులో ప్రయాణం చేస్తే రైల్వే రికార్డులలో పేరుంటుంది.

సెంట్రలు స్టేషన్ చేరుకోగానే రాజు రైళ్ళ రాకపోకల టయిం బోర్డు దగ్గిరకి వెళ్ళి పన్నెండుంపావు తర్వాత బయలుదేరే రైళ్ళు ఏవో చూశాడు. బెంగుళూరుకి పాసింజర్, జనతా ఎక్స్‌ప్రెస్, అర్కోణం పాసింజర్, గుంటకల్ పాసింజర్ - ఈ రైళ్ళన్నీ రెండుగంటల లోపునే బయలుదేరుతున్నాయి. రాజు రిజర్వేషన్ గుమస్తాని కలుసుకుని జూలై 15వతేదీన సూర్యప్రకాశ్ అనే అతను ఏ రైలులో ఎక్కడికి వెళ్ళిందీ చెప్పమని అడిగాడు.

అరగంటసేపు రికార్డులన్నీ వెతికి చివరికి "సార్! సూర్యప్రకాశ్ అనే అతను మీరు చెప్పిన రైళ్ళలో వెళ్ళలేదు" అన్నాడు.

"పోనీ ఏ రైలులో ఎక్కడికి వెళ్ళిందీ చెప్పగలరా?"

"జూలై 15వ తేదీ రాత్రి బొంబాయి మెయిలులో సూర్యప్రకాశ్ అనే పేర్న ఫస్టుక్లాస్ రిజర్వేషన్ ఉన్నది బొంబాయి" అన్నాడు గుమస్తా.

గుమాస్తాకి థాంక్స్ చెప్పి రాజు ఎంక్వయిరీస్‌లోంచి బయటికి వస్తుండగా యుగంధర్ ఎదురయ్యాడు. రాజు తన దర్యాప్తు ఫలితం యుగంధర్‌తో చెప్పిన తర్వాత యిద్దరూ కలిసి మళ్ళీ ఎంక్వయిరీస్‌లోకి వెళ్ళారు.

"కుమారి జయంతి అనే ఆమె జూలై 15వతేదీ ఏ రైలులో ఏ ఊరికి వెళ్ళిందో చెప్పగలరా?" అడిగాడు యుగంధర్.

"రిజర్వు చేసుకుంటే చెప్పగలము" అని గుమాస్తా పుస్తకం చూసి "హూ ఆర్ లక్కీ. కుమారి జయంతి జూలై 15వ తేదీ బెంగుళూరు ఎక్స్‌ప్రెస్‌లో బెంగుళూరుకి వెళ్ళింది. ఫస్టుక్లాసులో ప్రయాణం చేసింది" అన్నాడు.

"ఆమె ఒక్కతే వెళ్ళిందా? ఆమె కూడా యింకెవరయినా ఉన్నారా?"

"ఈ పుస్తకంలో ఉన్న పేర్లివి. అది నాలుగు బెర్తుల కంపార్టుమెంటు. మహావీర్ అనే ఆయనా, సుందర్ అనే ఆయనా, డాక్టర్ శ్రీనివాస్ అనే ఆయనా, కుమారి జయంతీ."

"ఎవరూ? డాక్టర్ శ్రీనివాసా?" అడిగాడు యుగంధర్.

"అవును. డాక్టర్ శ్రీనివాస్ పేర్న రిజర్వేషన్ ఉంది."

"ఆయన ప్రయాణం చేసి ఉండడానికి వీల్లేదు. జూలై 14వతేదీ రాత్రి డాక్టర్ శ్రీనివాస్ మరణించారు."

"అలాగా! అయితే కాన్సిల్ చేసి ఉంటారు. ప్లాట్‌ఫాం టి.సి.ని అడగండి. వివరాలు తెలుస్తాయి" అన్నాడు గుమాస్తా.

యుగంధరూ, రాజు ఆ వేళ డ్యూటీలో వున్న ప్లాట్‌ఫాం టి.సి.ని కలుసుకుని అడిగారు.

"అవును. నాకు బాగా జ్ఞాపకమున్నది. కుమారి జయంతి అనే ఆమె వచ్చి డాక్టర్ శ్రీనివాస్ ఆ వేళ ప్రయాణం చెయ్యడం లేదనీ, బెర్త్ కాన్సిల్ చెయ్యమని చెప్పి టిక్కెట్టు ఇచ్చేసింది" అన్నాడు.

"కుమారి జయంతి ప్రయాణం చేసిందా?"

"యస్" అన్నాడతను.

"ఈ సూర్యప్రకాశ్ అనే అతనికీ, జయంతికీ ఏదో సంబంధం వుండి ఉండాలి. డాక్టర్ శ్రీనివాస్, జయంతీ కలిసి జూలై 15వ తేదీ ఎక్స్‌ప్రెస్‌లో బెంగుళూరు వెళ్ళడానికి బెర్తులు రిజర్వ్ చేసుకున్నారు. అంతకు ముందురోజే ఎందువల్లో జయంతి హోటలు లగ్జరీలో గది తీసుకుని, సుబ్బరామయ్య యింటినుంచి బయలుదేరి, సెంట్రల్ స్టేషన్‌కి వెళ్ళి, అక్కణ్ణించి యింకో టాక్సీలో హోటల్‌కి వెళ్ళింది. మర్నాడు పొద్దున్నే హోటలునుంచి రైలు స్టేషన్‌కి వెళ్ళి ఎక్స్‌ప్రెస్‌లో వెళ్ళిపోయింది. డాక్టర్ ప్రయాణం చెయ్యడం లేదని టి.సి.కి చెప్పి బెర్త్ కాన్సిల్ చేసింది. జయంతి ప్రవర్తన చాలా విచిత్రంగా ఉంది. సూర్యప్రకాశ్ అనే అతను కారు ప్రమాదం జరిగిన చోటినించి కాలినడకన బయలుదేరి గిండీ రైలు స్టేషన్ దగ్గిర ఒక లారీ ఎక్కి, మౌంట్ రోడ్ చేరుకుని, అక్కణ్ణించి రాత్రి మూడుగంటలకి హోటల్ లగ్జరీకి వెళ్ళాడు. అతను అంతకుముందే కాటేజీ రిజర్వ్ చేసుకున్నాడు. అతనూ పన్నెండుగంటల ప్రాంతాల టాక్సీలో సెంట్రలు స్టేషన్‌కి వెళ్ళి, బొంబాయి వెళ్ళిపోయాడు. బెంగుళూరు నించి జయంతి బొంబాయికి వెళ్ళిందో బొంబాయినించి సూర్యప్రకాశ్ బెంగుళూరు వెళ్ళాడో దర్యాప్తు చేస్తేకానీ తెలియదు. జయంతి ప్రవర్తన బట్టి ఆ సూర్యప్రకాశ్ ప్రవర్తన బట్టి డాక్టర్ని హత్యచేసి యిద్దరూ యీ ఊర్నించి పారిపోయారేమోననిపిస్తోంది. హత్యకి కారణం వాళ్ళని పట్టుకుంటే కానీ తేలదనే అనుకోవచ్చు.

రాజూ! నేను బెంగుళూరు వెళుతున్నాను జయంతి విషయం ఆరా తీయడానికి. త్రీ జోకర్స్ రెస్టారెంట్‌లో ఉంటాను. సూర్యప్రకాశ్ విషయం తెలిస్తే ట్రంకాలు చెయ్యి. నువ్వు బొంబాయి వెళ్ళి హోటలు హాలీడేస్‌లో దిగు. నీతో అవసరం కలిగితే నేను ట్రంకాల్ చేస్తాను" అన్నాడు యుగంధర్.

రాజుని విమానాశ్రయంలో దింపి యుగంధర్ క్రిజ్లర్ కారులో బెంగుళూరు వెళ్ళాడు. మూడుగంటలకల్లా బెంగుళూరు చేరుకున్నాడు. బెంగుళూరు కంటోన్‌మెంట్ రైల్వేస్టేషన్‌లో విచారించడమా? తిన్నగా హోటల్‌కి వెళ్ళి పోలీసు అధికారుల సహాయంతో హోటళ్ళన్నీ గాలించడమా? ఏది మంచిది? బెంగుళూర్నించి యింకో ఊరికి వెళ్ళిందేమో? అని ఆలోచించాడు.

కంటోన్‌మెంట్‌లో ఆగి, స్టేషన్‌లోకి వెళ్ళి టిక్కెట్ ఎగ్జామినర్‌ని అడిగాడు.

"నో సార్! నో. మీరు చెప్పినటువంటి ఆమె యీ స్టేషన్లో దిగలేదు. అలా ఒంటిగా వచ్చివుంటే నాకు జ్ఞాపకముంటుంది" అన్నాడతను.

యుగంధర్ నవ్వుకున్నాడు. టిక్కెట్టు ఎగ్జామినర్ పాతికేళ్ళవాడు. బెంగుళూరు సిటీ రైలు స్టేషన్‌కి వెళ్ళి అక్కడా అడిగి చూశాడు. జ్ఞాపకం లేదన్నారు.

"బెంగుళూరుకి టిక్కెట్టు కొనుక్కుని వుంటే యిక్కడే దిగివుంటుంది" అన్నాడు ఒక ఉద్యోగి చాలా తార్కికంగా. బెంగుళూరుకి టిక్కెట్టు కొనుక్కుని వుంటే బెంగుళూరు దాటి వెళ్ళడానికి వీల్లేదు. అయినా యీ రైలు యిక ముందుకి వెళ్ళదు. నా సమస్య అదికాదు. ఈ ఊళ్ళోనే దిగిందా? వెనక ఏ స్టేషన్లోనైనా దిగిందా అని."

"అది ఎలా తెలుస్తుంది?" అని ఊరుకున్నాడు ఆ ఉద్యోగి.

టాక్సీ డ్రైవర్ని, సైకిలు రిక్షావాళ్ళనీ, జట్కావాళ్ళనీ అడిగి చూశాడు. జ్ఞాపకం లేదన్నారు.

త్రీజోకర్స్ హోటల్‌కి వెళ్ళి గది తీసుకుని తర్వాత బెంగుళూరు పోలీసు కమీషనర్ ఆఫీసుకి వెళ్ళాడు యుగంధర్. తను వచ్చిన పని చెప్పగానే "మిష్టర్ యుగంధర్ మీరు వెళ్ళి వాకబు చెయ్యనవసరంలేదు. మా ఆఫీసర్ల చేత నేనే వాకబు చేయిస్తాను" అన్నాడు కమీషనర్.

"థాంక్ యు. రేపు వచ్చి కలుసుకుంటాను" అని యుగంధర్ హోటలు చేరుకున్నాడు. పోలీసులు దర్యాప్తు చేసి చెపుతారు. తను అంతవరకూ చెయ్యగలిగిందేమీ లేదు. పత్రికలు చదువుతూ గదిలోనే కూర్చున్నాడు.

రాత్రి ఎనిమిదిన్నరకి గదిలో టెలిఫోన్ మోగింది.

"యుగంధర్ స్పీకింగ్" అన్నాడు.

"డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ శివణ్ణ స్పీకింగ్ సర్. మీకు ఫోన్ చేసి చెప్పమన్నారు చీఫ్."

"ఏమిటి?"

"జయంతి అనే యువతి జూలై 15వ తేదీ సాయంకాలం యీ ఊళ్ళో హోటల్ పాలెస్‌లో దిగింది. సరిగ్గా రెండురోజులుండి వెళ్ళిపోయింది. నేనే స్వయంగా విచారించి యీ విషయాలు తెలుసుకున్నాను" అన్నాడు ఇన్స్పెక్టర్.

"థాంక్స్ ఇన్స్పెక్టర్ ఇక్కణ్ణించి ఏ ఊరు వెళ్ళిందో తెలిసిందా?"

"లేదు, విచారిస్తే తెలియవచ్చు."

"ఆమె ఒక్కతే వచ్చిందా? కూడా ఎవరయినా ఉన్నారా?"

**"ఒక్కతే వచ్చి** డబుల్ రూం తీసుకుందిట. సాయంకాలానికి తన భర్త వస్తాడని చెప్పిందిట."

"సాయంకాలం ఆమె భర్త వచ్చాడా?"

"ఆ!"

"అతని పేరు?"

"సూర్యప్రకాశ్ అని హోటలు పుస్తకంలో రాశాడు."

"మీరెక్కణ్ణించి ఫోన్ చేస్తున్నారు?"

"హోటల్ పాలెస్ నించే."

"నేను అక్కడికి వస్తున్నాను మీరు ఉంటారా?"

"ఉంటాను."

యుగంధర్ క్రిజ్లర్ కారులో బయలుదేరాడు.

14

బొంబాయిలాంటి మహానగరంలో ఒక మనిషి కోసం వెతకడం ఎంత కష్టమో రాజుకి తెలుసు. అయినా ఫస్టుక్లాసులో దాదాపు రెండురోజులపాటు ప్రయాణం చేసిన మనిషి రైలు స్టేషన్లో దిగగానే మాయమవడం కష్టం. తోటి ప్రయాణీకులుంటారు. వాళ్ళనించయినా కొంత తెలుస్తుంది అనే ధైర్యంతోనే రాజు బొంబాయి శాంతాక్రజ్ విమానాశ్రయంలో దిగాడు. సూర్యప్రకాశ్‌తోపాటు అదే కంపార్టుమెంటులో ప్రయాణం చేసిన నలుగురి పేర్లుకూడా రాజు రాసుకున్నాడు. వాళ్ళల్లో ఇద్దరు బొంబాయి నగర వాస్తవ్యులు. రాజు హోటల్‌కి వెళ్ళగానే టెలిఫోన్ డైరెక్టరీ తిప్పి చూశాడు. హీరాలాల్ మదనలాల్ అనే పేరుకోసం వెతికాడు. దొరికింది. ఆ నెంబరుకు ఫోన్ చేసి "హీరాలాల్‌గారున్నారా?" అడిగాడు. "యస్. హు యీజ్ స్పీకింగ్?"

"నా పేరు రాజు. నేను మద్రాసునుంచి వచ్చాను. మీరు పదిరోజుల క్రితం మద్రాసు నుంచి వచ్చారు కదూ?"

"యస్."

"మీతోపాటు మద్రాసునుంచి అదే రైలు పెట్టెలో సూర్యప్రకాశ్ అనే ఆయన ప్రయాణం చేశారు ఆయన బొంబాయిలో ఎక్కడ ఉన్నారో తెలుసా?"

"ఆయనతో మీకేం పని?" అడిగాడు హీరాలాల్.

"నేను డిటెక్టివ్ యుగంధర్‌గారి అసిస్టెంటుని. ఒక కేసు సందర్భంలో ఆయన్ని కలుసుకోవాలి" అన్నాడు రాజు.

అవతల ఒక నిముషం పాటు నిశ్శబ్దం.

"మీరు ఒక్కరే వచ్చారా? యుగంధర్‌గారు కూడా వచ్చారా?"

"నేను ఒక్కణ్ణే వచ్చాను. దయచేసి నేను అడిగిన ప్రశ్నకి సమాధానం చెప్పగలరా? సూర్యప్రకాశ్ అనే అతను ఎక్కడ దిగాడో తెలుసా?"

"తెలుసు."

"అయితే చిరునామా చెపుతారా?"

"చిరునామా నాకు తెలియదు. నా కారులో దింపాను. నా డ్రైవర్‌కి యిల్లు తెలుసు."

"ఇల్లా? హోటలా?"

"ఇల్లే."

"అయితే దయచేసి మీ డ్రైవర్ని అడిగి అడ్రసు చెపుతారా?"

"అడ్రసు డ్రైవర్‌కి కూడా తెలియదు. డ్రైవర్ని మీ దగ్గరికి పంపిస్తాను. ఇల్లు చూపిస్తాడు. మీరు ఎక్కడున్నారో చెప్పండి."

"చాలా థాంక్స్. నేను హోటల్ హాపీడేస్‌లో ఉన్నాను. గది నెంబరు 79. పేరు రాజు."

"పదిహేను నిముషాల్లో మా డ్రైవర్ వస్తాడు" అన్నాడు హీరాలాల్.

రాజు కాచుకున్నాడు. తలుపు తట్టిన చప్పుడు కాగానే తెరిచాడు.

"నేను హీరాలాల్ గారి డ్రైవర్ని. చంద్ బాషా."

"నేనే రాజుని. అయ్యగారితో రైలులోంచి దిగిన సూర్యప్రకాశ్ అనే ఆయన్ని ఎక్కడ దింపావో గుర్తుచెప్పగలవా?"

"బైకుల్లా ప్రాంతంలో. వీధిపేరు యింటినెంబరు తెలియదు. రండి తీసుకెళతాను.

"వస్తున్నాను" అని రాజు అతనితో బయలుదేరాడు.

డ్రైవరు కారు ఎక్కమని రాజుతో చెప్పగానే రాజు ఆశ్చర్యపడ్డాడు.

"అర్జంటు పనిమీద ఎక్కడికో వెళ్ళాలిట. వెంటనే మిమ్మల్ని అక్కడ దింపి రమ్మన్నారు అయ్యగారు" అని డ్రైవర్ చెప్పగానే రాజు కారు ఎక్కాడు.

బైకుల్లాలో ఓ వీధిలోకి తీసుకెళ్ళి "ఇదే సార్ ఇల్లు లోపలికి వెళ్ళి అడగండి" అన్నాడు డ్రైవర్.

రాజు కారు దిగి, డ్రైవర్‌కి థాంక్స్ చెప్పి తలుపు తట్టాడు.

లావుగా ఎర్రగా వున్న ఓ మనిషి వచ్చి తలుపు తీశాడు.

"సూర్యప్రకాశ్ అనే ఆయన ఉన్నారా?" అడిగాడు రాజు.

"ఉన్నారు. రండి" అని లోపలికి తీసుకెళ్ళి ఒక గదిలో కూర్చోపెట్టి "ఇప్పుడే వస్తారు. స్నానం చేస్తున్నారు" అని చెప్పాడామనిషి రాజు సోఫాలో కూర్చున్నాడు. రెండు నిముషాల తర్వాత యిద్దరు గదిలోకి వచ్చారు. ఒకతను షేక్‌హాండ్ యిస్తున్నట్టు చెయ్యి జాపి ముందుకి వచ్చాడు. రాజు చెయ్యి అందించగానే రాజు చేతిని గట్టిగా పట్టుకుని ముందుకి లాగాడు. వెంటనే రెండో మనిషి రాజుని వెనకనించి ఛాతీమీద చేతులు బిగించి పట్టుకుని "ఆవ్! ఆవ్"అని కేకేశాడు. వెంటనే యింకో మనిషి వచ్చి రాజు చేతులూ, కాళ్ళూ

కట్టేశాడు. తర్వాత రాజు జేబులు వెతికి పిస్తోలు, తాళం చెవులు, కాగితాలు తీసుకున్నాడు. తననెందుకు వీళ్ళు అలా బంధించారో రాజుకి అర్థంకాలేదు. డాక్టర్ని హత్యచేసిన సూర్యప్రకాశ్‌కి యింతమంది ఎందుకు సహాయం చేస్తున్నారో అంతకన్నా అర్థంకాలేదు. డాక్టరు శ్రీనివాస్ హత్యతో ఇంతమందికి సంబంధం ఉందా?

ఫుల్‌సూటులో వున్న మనిషి గదిలోకి వచ్చి కుర్చీకి తాళ్ళతో కట్టబడి వున్న రాజుని పరీక్షగా చూసి "నా విషయం నీకెలా తెలిసింది?" అడిగాడు.

రాజు నవ్వి "నాకేకాదు. మద్రాసు పోలీసులకీ, డిటెక్టివ్ యుగంధర్‌కీ, యీ ఊరి పోలీసులకి కూడా తెలుసు. నన్ను ఇలా బంధించినంత మాత్రాన తప్పించుకోగలననుకోకు" అన్నాడు ధీమాగా.

"నేను తప్పించుకోగలనో లేదో తర్వాత చూద్దాం. ముందు నీ విషయం ఆలోచిద్దాం. నా ఉనికి నీకెలా తెలిసింది?" అడిగాడు.

"అంత కష్టమేం కాదు. ఫస్టుక్లాసులో, నీ పేరుతో బర్తు రిజర్వు చేయించుకుని, ప్రయాణం చేస్తే ఎందుకు తెలియదు?"

"ఆ విషయం కాదు. అసలు నా మీద మీకు అనుమానం ఎందుకు కలిగింది?"

"డాక్టరుని హత్యచేసిన చోటినుంచి కాలినడకన వెళుతున్నప్పుడు ఒకతను నిన్ను చూశాడు. గిండీ స్టేషన్ వద్ద నువ్వు ఆపిన లారీ డ్రైవర్ చెప్పాడు. హోటల్ లగ్జరీలో నీ విషయం తెలిసింది."

"వాట్ యీజ్ దిస్. హత్యా? డాక్టర్ శ్రీనివాసా? ఎవరతను?" అడిగాడు సూర్యప్రకాశ్.

రాజు నవ్వి "తెలియనట్లు నటించినంత మాత్రాన ఎవరు నమ్ముతారు?" అన్నాడు.

సూర్యప్రకాశ్ రాజుని తీక్షణంగా కళ్ళల్లోకి చూసి "మిస్టర్ రాజూ! మీరు నిజమే చెపుతున్నారా? నిజంగా డాక్టర్ శ్రీనివాస్ హత్య గురించి దర్యాప్తు చేస్తూ నన్ను వెతుక్కుంటూ వచ్చారా?" అడిగాడు.

రాజు తలవూపాడు.

"డాక్టర్ శ్రీనివాస్ ఎవరో నాకు తెలియదు. నేను గిండీ రైలు స్టేషన్ వద్ద నిలుచోలేదు. నేను హోటల్ లగ్జరీకి వెళ్ళలేదు. హత్య ఎప్పుడు జరిగిందన్నారు?" అడిగాడు.

"జూలై 14వతేదీ రాత్రి."

"వెరీ గుడ్ జూలై 14వ తేదీ సాయంకాలం నేను తిరుచునాపల్లికి చేరుకున్నాను. ఆ రాత్రంతా తిరుచునాపల్లిలో వుండి, మర్నాడు పొద్దున్న పదిగంటలకి విమానంలో బయలుదేరి, మద్రాసు వచ్చి మధ్యాహ్నం ఎక్స్‌ప్రెస్‌లో బొంబాయికి బయలుదేరాను. కనుక మీరు చెప్పిన డాక్టర్ని నేను హత్య చేసి ఉండడం అసంభవం" అన్నాడు సూర్యప్రకాశ్.

"అది నిజమైతే నిరూపించండి" అన్నాడు రాజు.

"నిరూపిస్తాను. అంతటితో మీరు ఇక నా విషయం మరిచిపోతారా?"

రాజు నవ్వి "మీరు నిజంగా నిర్దోషులైతే ఎందుకు యిలా గూండా మల్లే దౌర్జన్యం ప్రదర్శించారు?" అడిగాడు.

సూర్యప్రకాశ్ విసుగ్గా రాజుని చూసి "ఆ విషయమే మరిచిపొమ్మన్నాను" అంటుండగా లావుగా, పొట్టిగా, ఎర్రగా వున్న మనిషి గదిలోకి వచ్చి "ఏమిటి ప్రకాశ్ వీళ్ళకి ఎలా తెలిసిందిట?" అడిగాడు.

"ఏదో హత్యకేసు దర్యాప్తు చేస్తూ తప్పు సూచనలను అనుసరించి నన్ను వెతుక్కుంటూ వచ్చాడు యితను మద్రాసు నుంచి హీరా" అన్నాడు సూర్యప్రకాశ్.

అతను హీరాలాల్ అనీ, తనని ఆ యింటికి పంపించిన మనిషి అతనేననీ రాజు గ్రహించాడు. సూర్యప్రకాశ్‌కి నిజంగా యీ హత్యతో సంబంధంలేదా? అతను చెప్పినట్లు తప్పు సూచనలని అనుసరించి తను యీ సూర్యప్రకాశ్ కోసం వచ్చాడా?

సూర్యప్రకాశ్, హీరాలాల్ వీళ్ళకి డాక్టర్ శ్రీనివాస్ హత్యతో సంబంధం లేకపోయినా ఏవో అక్రమమైన పనులు చేస్తున్నారు. అందుకే తనని చూసి అంత భయపడి బంధించారు.

"అవును. తప్పుతోవన పడి వచ్చి ఉండాలి సూర్యప్రకాశ్ అనే పేర్న అదే రోజు, యింకో మనిషి ఆ రైలులో ప్రయాణం చెయ్యడం మన దురదృష్టం. యితని దురదృష్టం" అన్నాడు హీరాలాల్.

"ఇప్పుడు యితన్ని ఏంచేద్దాం?" అడిగాడు సూర్యప్రకాశ్.

"ఏం చేస్తాం? వదిలేస్తే పోలీసులకు చెపుతాడు. పోలీసులు మన విషయం దర్యాప్తు చేస్తే అంతా బయటపడిపోతుంది. లక్షలకి లక్షల రూపాయలకి సంబంధించిన వ్యాపారమాయె మనది. వీణ్ణి ఎలా పోనిస్తాం?"

"పోనివ్వక ఏం చేస్తాం? ఇక్కడ ఎంతకాలం బంధించి ఉంచుతాం?" అడిగాడు సూర్యప్రకాశ్.

"బంధించి ఉంచడం దేనికి? దారాకీ, గులాబ్‌కీ చెప్పామంటే అయిదు నిముషాలలో మనిషిని మాయం చేస్తారు" అన్నాడు హీరాలాల్.

"అటువంటి పని వద్దు. హత్యలు చెయ్యడం నాకిష్టం లేదు."

"నాకూ ఇష్టంలేదు. తప్పనిసరి అయినప్పుడు ఏం చేస్తాం?"

"అందరం జైలుకి వెళతాము."

"ఇతని వాగ్దానం యిస్తాడేమో? మన విషయం పోలీసులకి చెప్పనని."

"ఇతను వాగ్దానం నమ్మడం ఎలా? ఇక్కణ్ణించి తిన్నగా పోలీస్ కమీషనర్ ఆఫీసుకి వెళితే ఏం చెయ్యగలం. ఈ యుగంధర్‌కీ, అతని అసిస్టెంట్‌కీ పోలీసులతో చాలా స్నేహం. తప్పదు. వీణ్ణి ఫైసల్ చెయ్యవలసిందే"

సూర్యప్రకాశ్‌కి యిష్టం లేకపోయినా ఏం చెయ్యలేక మౌనంగా ఉండిపోయాడు.

హీరాలాల్ డ్రైవర్ని పిలిచి అతనికి ఏదో చెప్పాడు. డ్రైవర్ వెళ్ళిపోయాడు. సూర్యప్రకాశ్, హీరాలాల్ అక్కడే రాజుకి ఎదురుగా కూర్చున్నారు.

రాజు వాళ్ళనే పరీక్షగా చూస్తున్నాడు. సూర్యప్రకాశ్‌ని దబాయిస్తే దడిసే మనిషే కానీ హీరాలాల్ సులభంగా బెదిరే మనిషికాడు. రాజు చేతులు కదిపి చూశాడు. చాలా గట్టిగా కుర్చీకి బిగించారు. ఊడతీసుకోవడం సులభం కాదు. ఎవరో గూండాలని పిలవమని చెప్పివుండాలి హీరాలాల్. వాళ్ళు రాగానే తనని వాళ్ళకి అప్పచెప్పి వెళ్ళిపోతారు వీళ్ళు. పాతికకో, పరకకో హత్యలు చేసే గూండాలుంటారు యీ ఊళ్ళో. గూండాల చేతిలో చిక్కిన తర్వాత వాళ్ళనించి తప్పించుకోవడానికి అవకాశం ఉండదేమో? అంతలో ఇద్దరు గదిలోకి వచ్చారు. బిగుతుగా వున్న పైజామాలు, షర్టు వేసుకున్నారు. రాజుని పరీక్షగా చూశారు. హీరాలాల్‌కి సలాం చేశారు.

"వీణ్ణి ఫైసల్ చెయ్యండి" అని చెప్పి హీరాలాల్ సూర్యప్రకాశ్‌తో వెళ్ళిపోయాడు. వెంటనే యిద్దరు గూండాలూ రాజు దగ్గరికి వచ్చారు. ఒకడు కత్తి తీశాడు. రాజుని పరీక్షగా చూస్తున్నాడు ఎక్కడ పొడుద్దామా అన్నట్లు. అంతలో హీరాలాల్ మళ్ళీ గదిలోకి వచ్చి "ఇక్కడకాదు, ఎక్కడికయినా తీసుకెళ్ళండి" అని చెప్పి వెళ్ళిపోయాడు. వాళ్ళు తలలూపారు.

ఒకడు వెళ్ళి నిముషం తర్వాత ఒక పెద్ద గోనెసంచి తీసుకువచ్చి రాజుని తలమీద పిడికిలితో కొట్టాడు రాజు కళ్ళు చీకట్లు కమ్మాయి. తల తిరుగుతోంది. తనని కుర్చీనించి విడదీసి, గోనెలో పడేస్తారని మాత్రం తెలుసు. అంతే స్పృహ పోయింది.

15

యుగంధర్ హోటల్ పాలెస్ ముందు కారు ఆపి, దిగి లోపలికి వెళ్ళగానే తెల్లని పాంటు, తెల్లని షర్టు వేసుకున్న ఆజానుబాహుడు యుగంధర్ దగ్గరకి వెళ్ళి "నేనే ఇన్‌స్పెక్టర్ శివణ్ణ. గ్లాడ్ టు మీట్ యు సార్" అన్నాడు.

యుగంధర్ షేక్ హాండ్ ఇచ్చి "ఇక్కణ్ణించి జయంతీ, ఆమె భర్తా ఏ ఊరు వెళ్ళారో తెలిసిందా?" అడిగాడు.

ఇన్‌స్పెక్టర్ తల విదిలించి "లేదు జూలై 18వ తేదీ పొద్దున్న గది ఖాళీచేసి వెళ్ళిపోయారుట."

"టాక్సీలోనే వెళ్ళివుండాలిగా?" అన్నాడు యుగంధర్.

"కనుక్కుంటాను. టాక్సీలో వెళ్ళివుంటే ఎక్కడికి వెళ్ళిందీ తెలుసుకోవడం కష్టంకాదు అనుకుంటాను" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"జయంతి, సూర్యప్రకాశ్ బస చేసిన కాటేజీ కుర్రాడు వుంటే ఒకసారి పిలిపించండి. మాట్లాడాలి" అన్నాడు యుగంధర్.

ఎర్రగా వున్న పద్దెనిమిదేళ్ళ కుర్రాడు వచ్చాడు.

"పద్దెనిమిదోవ నెంబరు కాటేజీలో ఉన్నవాళ్ళు నీకు జ్ఞాపకం ఉన్నారా?" అని అడిగాడు యుగంధర్.

"అవును సార్. భార్యాభర్త. రెండు రోజులున్నారు. ముందు ఆమె వచ్చింది. ఆమె రాత్రి ఎప్పుడో వచ్చాడు."

యుగంధర్ జయంతి ఫోటో చూపించి "ఈమేనా?" అడిగాడు.

"అవును."

"ఆమె కూడా ఉన్నతను ఎలా ఉన్నాడు? ఆనవాలు ఏమైనా చెప్పగలవా?"

"నేను సరిగా చూడలేదు సార్."

"ఏం? రెండురోజులు కాటేజీలో ఉన్నా సరిగా ఎందుకు చూడలేకపోయావు?

"నేను కాఫీ తీసుకెళ్ళడానికి లోపలికి వెళ్ళినప్పుడూ అతను నీళ్ళగదిలోనో, పడకగదిలోనో ఉండేవాడు."

"ఒక్కసారి కూడా నువ్వు చూడలేదా? అయితే ఎవరో మొగాడున్నాడని ఎలా చెప్పగలవు?"

"నీళ్ళ గదిలోంచి ఆమెని ఒకసారి కేకేశాడు. ఇంకోసారి ఆమె టిఫిన్ ఏం కావలని అడిగితే అతను పడకగదిలోంచి జవాబు చెప్పాడు. ఒకసారి అతని కాళ్ళు చూశాను. దినపత్రిక చదువుతున్నాడు. మొహానికి అడ్డంగా ఉంది" అన్నాడు కుర్రాడు.

"వాళ్ళిద్దరూ అసలు బైటికి వెళ్ళలేదా?"

"లేదు సార్ కాటేజీలోంచి ఆ రెండు రోజులూ కదలలేదు సార్."

"కాటేజీ ఖాళీ చేసేటప్పుడయినా నువ్వు అతన్ని చూడలేదా?"

"లేదు సార్. టిక్కట్లు కొనడానికి అతను తెల్లారే, యింకా బాగా వెలుగు రాకముందే రైలు స్టేషన్‌కి వెళ్ళాడని ఆమె చెప్పింది. టాక్సీలో ఆమె ఒంటరిగా వెళ్ళింది."

యుగంధర్ ఆలోచనలో పడ్డాడు. తను ఎక్కడికి వెడుతున్నదీ, ఎక్కడుంటున్నదీ జయంతి దాచడానికి ప్రయత్నం చెయ్యలేదు. దాపరికం ఏమీ లేకుండా ప్రవర్తించింది. సూర్యప్రకాశ్ అనే అతను మాత్రం దోషి మల్లే ప్రవర్తించాడు. పట్టపగలు తన మొహం చూపించడానికి భయపడ్డాడు.

ఇద్దరూ కలిసి బెంగుళూరు వచ్చి, రెండు రోజులుండి హోటల్లోంచి బయటికి కదలకపోవడం ఆశ్చర్యంగా ఉంది.

"నేను టాక్సీ డ్రైవర్ని పట్టుకుని వాళ్ళు ఎక్కడికి వెళ్ళినదీ తెలుసుకోవడానికి ప్రయత్నిస్తాను" అన్నాడు ఇన్ స్పెక్టర్ శివణ్ణ.

"థాంక్స్! దయచేసి ఆ సహాయం చేసిపెట్టండి. నేను హోటల్లోనే ఉంటాను" అని యుగంధర్ తను బసచేసిన హోటల్‌కి వెళ్ళాడు.

బొంబాయి రైలు ఎక్కిన సూర్యప్రకాశ్ బొంబాయికి వెళ్ళలేదన్నమాట. ఏ అర్కోణంలోనో దిగి బెంగుళూరు వెళ్ళాడు. రాజు అనవసరంగా బొంబాయిలో అతనికోసం వెతుకుతూ ఉంటాడు.

యుగంధర్ టెలిఫోన్ తీసి "పర్టిక్యులర్ కాల్ ఎక్స్‌ప్రెస్, బొంబాయి, హోటల్ హాపీడేస్, మిష్టర్ రాజు" అని చెప్పి రిసీవర్ పెట్టేశాడు.

16

**ఎంతసేపు** స్పృహలేకుండా ఉన్నాడో రాజుకి తెలియదు. మొహం మీద గరుగ్గా ఏదో రాసుకోవడం, చేతులూ కాళ్ళు బిగుసుకుపోయినట్లు అనిపించడం, చెవుల్లో ఏదో హోరు వినిపించడంతో అతనికి స్పృహ వచ్చింది. జరిగిందంతా జ్ఞాపకం వచ్చేందుకు నిముషం పట్టింది.

చెవుల్లో వినపడుతున్న హోరు మోటారు కారు యింజన్ చప్పుడు అన్నీ తను గోనెసంచిలో ఉన్నాననీ, ఆ సంచి మోటారుకారు వెనక ఉండే లగేజ్‌బూట్‌లో వున్నదనీ రాజు గ్రహించాడు. తను ఆపదలో ఉన్నాడని తెలుసు. తన ప్రాణం గూండాలకి తృణప్రాయం అనీ తెలుసు. ఏ నూతిలోనో, చెరువులోనో, గోతిలోనో తనని అలాగే గోనెతో పారెయ్యవచ్చు. లేదా తనని చంపి ఏ రహస్య స్థలంలోనో పాతిపెట్టవచ్చు.

ఈ గూండాలకి మనుష్యుల ప్రాణాలన్నా, వాళ్ళ బాధలన్నా లెక్కలేదు. దయా, ప్రేమ మొదలయినవి వీళ్ళకి పుట్టుకతోనే ఉండవో లేక తర్వాత వయసుతో అవి అంతర్ధానమవుతాయో తెలియదు కానీ వాళ్ళనించి తప్పించుకోవాలంటే, ప్రాణం రక్షించుకోవాలంటే ఏదో యుక్తితో సాధించాలి కానీ వాళ్ళలో పరివర్తన కలిగి తనమీద జాలివేసి తనని వదిలేస్తారని ఆశించడం పొరబాటు అనీ రాజుకు తెలుసు.

చేతులూ, కాళ్ళూ కట్టిలేవు. అంతవరకూ తన అదృష్టం. ఆ గూండాలకి ధైర్యం ఎక్కువే. గోనెసంచిలో కట్టి, కారు వెనకపడేసిన మనిషి తప్పించుకోలేడని వాళ్ళ ధైర్యం. రాజు గోనెసంచి చింపడానికి ప్రయత్నించాడు. ప్రయోజనం లేకపోయింది. చాలా గట్టిగా ఉంది. పళ్ళతో గోనెసంచిని అక్కడక్కడ కొరికాడు. ఆ సందుల్లో వేళ్ళుపెట్టి చింపడం ప్రారంభించాడు. గోనె చిరిగిపోయింది.

అమ్మయ్య అనుకుని, పక్కకి తిరిగి జేబులు వెతుక్కున్నాడు. పిస్తోలు లేదు. జేబులో ఒక్క వస్తువూ లేదు. చిల్లర డబ్బులు కూడా లేవు. అన్నీ తీసేసుకున్నారన్నమాట. రెండు చేతులు తప్ప తనకి వేరే ఆయుధం లేదు. కారు ఆపి వాళ్ళు వచ్చి డిక్కీ తెరిచేటంతవరకూ కాచుకునుండడం అవివేకం. అప్పుడు తప్పించుకోవడం చాలా కష్టం. రాజు నెమ్మదిగా డిక్కీ తెరిచాడు లోపల్నించి. అదృష్టం. వాళ్ళు తాళం వెయ్యలేదు. రెండడుగుల కింద రోడ్డు కనిపిస్తోంది. అరవై మైళ్ళ స్పీడున కారు వెళుతూ ఉండి ఉండాలి. డిక్కీ తెరుచుకుని దూకడానికి వీల్లేదు. దూకితే ఎముకలు పిప్పి అయిపోతాయి.

కారు ఆగేటంతవరకూ కాచుకోవాలి. డిక్కీ తలుపు కొంచెంగా ఎత్తి తెరిచి పట్టుకుని రోడ్‌ని చూస్తున్నాడు. అరగంట గడిచింది. ఎదురునుంచి రెండుసార్లు కార్లు వెళ్ళాయి. కానీ వెనకనుంచి ఒక కారూ రాలేదు. అలా వెనకనించి కారు వస్తే తను డిక్కీ తెరిచి ఆ కారుని ఆపమని సంజ్ఞ చేద్దామనుకున్నాడు. కానీ దానికి అవకాశం లేకపోయింది.

కారు స్పీడు తగ్గింది. వాళ్ళేదో మాట్లాడుకుంటున్నారు. మాటలు వినిపించడంలేదు ఆ హోరులో.

రాజు తయారుగా ఉన్నాడు. కారు ఆగిన మరుక్షణం తను తప్పించుకునేందుకు ప్రయత్నించాలి. ఆలస్యం చేస్తే ప్రమాదం. డిక్కీ మూత సగం తెరిచి పట్టుకున్నాడు.

కారు రోడ్డుకి పక్కగా ఆగింది. రాజు వెంటనే డిక్కీలోంచి ఒక్క దూకిదూకి డిక్కీ మూత వదిలేశాడు. ధన్‌మని చప్పుడయింది. కారులోంచి యిద్దరు రోడ్డుమీదకి ఉరికారు.

"అరే! వాడు బయటికి వచ్చేశాడు."

"వస్తే రానీ. ఎక్కడికి పోతాడు?" నవ్వుతున్నాడు యింకోడు.

రాజు డిక్కీ వెనక్కి నిలుచుని చూశాడు. ఇద్దరే ఉన్నారు. ఒకడు డ్రైవర్, యింకొకడు గూండా. ఇద్దరూ చెరొక పక్కనుంచీ వస్తున్నారు. ఇద్దరి చేతుల్లో బాకులున్నాయి. దరిదాపుల్లో చెట్లు ఎక్కడా లేవు. ఒక వైపున అగాధం, రెండోవైపు యిసుక. సముద్రపు ఘోష వినపడుతోంది దూరంగా. కనుచూపు మేరలో ఎక్కడా మనవమాత్రుడు కనిపించలేదు.

గూండా ఆరు అడుగుల నాలుగు అంగుళాల పొడుగు ఉన్నాడు. రెండువందల పౌనుల పైన బరువుంటాడు. అతని వయస్సు ఊహించడం కష్టం. డ్రైవర్ అయిదడుగుల ఆరు అంగుళాల పొడుగే ఉన్నా కండలు తిరిగిన ఒళ్ళు.

"ఎక్కడికి పారిపోతాడు? కత్తి విసరనా?" అని యీల వేశాడు గూండా.

ఇంకో క్షణమే వ్యవధి ఉంది తనేం చెయ్యదలచుకున్నా. ఏం చెయ్యాలి? చేతిలో ఏ ఆయుధమూ లేదు. వాళ్ళ చేతుల్లో కత్తులున్నాయి. ఎలా?

"సంచి చింపి ఎందుకు బయటికి వచ్చావు" అన్నాడు గూండా.

రాజు అటు తిరిగాడు. కత్తిపట్టుకున్న చెయ్యి పైకెత్తి గూండా ముందుకి వస్తున్నాడు. రాజు రెండడుగులు వెనక్కి వేశాడు.

గూండా వచ్చి "ప్రయోజనంలేదు. వెనక అతనున్నాడు. వీపులో పొడుస్తాడు. నీ యిష్టం ఛాతీలోనా, వీపులోనా నువ్వే నిర్ణయించుకో."

రాజు ముందుకి ఒక్క పరుగు తీశాడు అతివేగంగా. గూండా అరక్షణం ఆశ్చర్యపడ్డాడు. ఎందుకు అలా ముందుకి పరిగెత్తుకు వస్తున్నాడు? చావడానికా? అతనికి కారణం తెలిసేలోపునే రాజు ఒక్క ఎగురు ఎగిరి, రెండు కాళ్ళతో గూండాని మొహం మీద తన్నాడు. గూండా వెనక్కి పడ్డాడు. గూండాతోపాటు రాజూ కిందపడ్డాడు.

"బద్మాష్" అని తిడుతూ గూండా లేచి కూర్చోబోయాడు. అతని కళ్ళల్లో తన బూట్సుల యిసక పడిందో, లేక బూట్సులే కళ్ళని పొడిచయో రాజుకి తెలియదు కానీ గూండా కత్తి వదిలేసి మొహం రెండుచేతులతో పట్టుకున్నాడు. రక్తం కారుతోంది. వెనక అలికిడి అయి రాజు చటుక్కున లేచాడు.

అప్పటికే ఆలస్యం అయింది. డ్రైవర్ కత్తిపట్టుకున్న చెయ్యి కిందకు వచ్చేసింది. రాజు చటుక్కున తల పక్కకి తిప్పాడు. కత్తి జబ్బలో దిగబడింది. డ్రైవర్‌ని మోకాళ్ళమీద తన్నాడు రాజు.

డ్రైవర్ కేకవేసి కిందపడ్డాడు. కనికరం చూపిస్తే ప్రయోజనం లేదు. కర్కోటకులు. పడిపోయిన డ్రైవర్‌ని మెడమీద, మొహం మీద బలంగా గుద్దాడు.

గూండా ఒక కన్ను తెరిచి చూసి లేవడానికి ప్రయత్నిస్తున్నాడు.

రెండు చేతులూ బిగించి గుప్పెళ్ళతో ఆ గూండా తలమీద మొత్తాడు రాజు బలం కొద్దీ. కిక్కురుమనకుండా గూండా నేలమీదకి ఒరిగాడు. డ్రైవర్ మూలుగుతున్నాడు. రాజు గూండా కింద పడేసిన కత్తి తీసుకుని జేబులో పెట్టుకున్నాడు. తర్వాత డ్రైవర్ తన జబ్బలో

పొడిచిన కత్తిని చూసి లాగుదామనుకుని లాగేస్తే ధారలుగా కారుతుందేమోనని, అలాగే ఉండనిచ్చి, డ్రైవర్‌ని కాళ్ళతో తంతూ, దొర్లిస్తూ కారు వెనక లగేజ్ బూట్ దగ్గరికి తీసుకెళ్ళి దానిలోకి తోసి తలుపు మూసేశాడు. తర్వాత గూండా దగ్గరికి పరీక్షగా చూశాడు. గూండాకి స్పృహలేదు. ఆ స్పృహలేని వాణ్ణి ఎలా కారులో ఎక్కించడం? ఒక చేత్తో అతన్ని ఎలా మొయ్యడం. ఎలాగో కష్టపడి కారులో ఎక్కించినా తను డ్రైవ్ చేస్తుండగా వాడికి స్పృహ వస్తే ఏం చెయ్యాలి?

రాజు కారు దగ్గరికి వెళ్ళి లగేజ్ బూట్ తెరిచాడు. డ్రైవర్ మూలుగు తున్నాడు. లగేజ్ బూట్ వెతికాడు. రెండు తీగలు, ఒక తాడు కనిపించాయి. వాటిని తీసుకుని గూండా దగ్గరికి వెళ్ళి చేతులనీ, కాళ్ళనీ గట్టిగా బిగించి, రోడ్డుకి ఒక పక్కకి తోసి కారెక్కి స్టార్ట్ చేశాడు. అరగంట తర్వాత బొంబాయి నగర పోలీస్ హెడ్‌క్వార్టర్స్ భవనం ముందు కారు ఆపి లోపలికి వెళ్ళాడు.

## 17

"హల్లో! యుగంధర్. చీఫ్ కమిషనర్ ఆఫ్ పోలీస్ స్పీకింగ్"

"హల్లో పొరపాటు ఏదయినా జరిగిందా? లేక మీరు రాజుకి వచ్చే టెలిఫోన్ కాల్సు అన్నీ మీకు డైరెక్టు చెయ్యమన్నారా?" అడిగాడు యుగంధర్.

"మీనుంచి ట్రంక్ కాల్ వస్తే నాకు కనెక్ట్ చెయ్యమన్నాను."

"రాజు ఎక్కడున్నాడు?"

"ఐయామ్ సారీ! రాజు ఆస్పత్రిలో ఉన్నాడు."

"ఆస్పత్రా? ఏమైంది?" అడిగాడు యుగంధర్ ఆదుర్దాగా.

"సూర్యప్రకాశ్ అనే అతన్ని వెతుక్కుంటూ ఓ చోటికి వెళ్ళాడుట. అక్కడ సూర్యప్రకాశ్ అనే అతను ఉన్నాడు కానీ అతను తను వెతుకుతున్న మనిషి కాడుట" అని రాజుకి కలిగిన అపాయం, అతను ఎలా తప్పించుకున్నదీ చెప్పి "బాగా రక్తం కారింది. చాలా నీరసంగా ఉన్నాడు. రేపటివరకూ ఆస్పత్రిలో ఉండి విశ్రాంతి తీసుకోవాలని చెప్పాడు డాక్టరు. రాజు విషయం నాకు తెలుసు. అలాటి సలహాల్ని లక్ష్యపెట్టేవాడు కాడు. అందుకని యిద్దరు మనుష్యులని కాపలా పెట్టాను అతను ఆస్పత్రి నుంచి పారిపోకుండా."

"థాంక్స్ నేను రాజుకి చెప్పాలి. రాజు పుణ్యమా అంటూ హీరాలాల్, సూర్యప్రకాశ్ యింకా ముగ్గురు అంతర్ రాష్ట్ర మోసగాళ్ళని పట్టుకున్నాము. మద్రాసు, మైసూరు, ఆంధ్ర, మహారాష్ట్ర రాష్ట్రాలలో వీళ్ళు వ్యాపారస్తులని మోసం చేసి చట్ట విరుద్ధంగా లక్షలకి లక్షలు సంపాదిస్తున్నారు. బొంబాయిలో ఆ ముఠాకి మూల పురుషులున్నారు. కానీ వాళ్ళు ఎవరో ఎక్కడున్నారో తెలియలేదు ఎంత ప్రయత్నించినా. ఇప్పుడు రాజు మూలంగా ఆ ముఠాలో అందర్నీ పట్టుకున్నాం. రాజు బందీగా తీసుకువచ్చిన డ్రైవర్ అన్ని వివరాలు చెప్పేశాడు."

"గుడ్! రాజు కోలుకోగానే తిన్నగా బెంగుళూరు రమ్మనండి. నేను ఇక్కడ ఉండకపోతే పోలీసు హెడ్ క్వార్టర్స్‌కి వెళ్ళి కనుక్కోమని చెప్పండి" అని యుగంధర్ టెలిఫోన్ పెట్టేశాడు.

యుగంధర్ నవ్వుకున్నాడు. నేరపరిశోధనలో కూడా అదృష్టం, దురదృష్టం ఉంటుంది. డాక్టర్ని హత్యచేసిన సూర్యప్రకాశ్ కోసం రాజు వెతుక్కుంటూ వెళితే మోసగాడు అయిన యింకో సూర్యప్రకాశ్ దొరకడం ఏమిటి? బొంబాయిలో వున్న సూర్యప్రకాశ్ మద్రాసునుంచి బయలుదేరిన రోజే డాక్టర్ని హత్యచేసిన సూర్యప్రకాశ్ కూడా సెంట్రల్ స్టేషన్‌కి వెళ్ళడం బొంబాయిలో వున్న సూర్యప్రకాశ్ దురదృష్టం కాకపోతే ఏమిటి? అంతలో టెలిఫోన్ మోగింది.

"హల్లో సార్. ఇన్‌స్పెక్టర్ శివణ్ణ"

''ఎస్! యుగంధర్ స్పీకింగ్''

''జయంతి ఇక్కణ్ణించి మైసూరు వెళ్ళినట్టు తెలుస్తోంది.''

''అలాగ! నిదర్శనం?'' అడిగాడు యుగంధర్.

''ఆమె రైలు స్టేషన్‌కి వెళ్ళినట్లు టాక్సీ డ్రైవర్ చెప్పాడు. ఆ టైంలో మైసూరుకి తప్ప యింకెక్కడికీ రైలు లేదు.''

''రిజర్వు చేసుకోలేదా?''

''లేదు.''

''జయంతి కూడా వున్న సూర్యప్రకాశ్ అనే అతన్ని గురించి ఏమైనా తెలిసిందా?''

''లేదు సార్! రైలు స్టేషన్‌లో జయంతి సామానులు దింపిన పోర్టర్ జయంతి కూడా ఎవరూ లేరని చెప్పాడు. ఒక టి.సి.కి జయంతి జ్ఞాపకం ఉన్నది. అతనుకూడా జయంతితో మొగాడెవరూ లేడని చెప్పాడు.''

''జయంతి సామానులు ఏ రైలులో ఎక్కించినదీ ఆ పోర్టర్ చెప్పలేదా?''

''లేదు. ప్లాట్‌ఫారం మీద సామానులు పెట్టిన తర్వాత పోర్టర్ కి డబ్బు యిచ్చి వెళ్ళిపొమ్మన్నదట.''

''థాంక్స్. నేను ఓ ఉత్తరం రాసి యిక్కడ మేనేజర్‌కి యిస్తున్నాను. నా అసిస్టెంట్ రాజు వస్తాడు అతన్ని ఆ ఉత్తరం తీసుకోమని చెప్పండి.''

''మీరు వెళ్ళిపోతున్నారా?''

''అవును. మైసూర్‌కి వెళ్ళి జయంతి జాడలు తెలుస్తాయేమో చూడాలి'' అన్నాడు యుగంధర్.

రాజుకి పెద్ద ఉత్తరం రాసి, దాన్ని హోటల్ మేనేజర్‌కి ఇచ్చి, యుగంధర్ క్రిజ్లర్ కారులో మైసూరుకి బయలుదేరాడు. జయంతి తను ఎక్కడికి వెళుతున్నదీ దాచడానికి అంతవరకూ ప్రయత్నించలేదు. కానీ బెంగుళూరు నించి మాత్రం ఎక్కడికి వెళ్ళినదీ ఎవరికీ తెలియకుండా ఉండడానికి తాపత్రయపడింది. ఎందుకు?

సూర్యప్రకాశ్‌కీ, జయంతికీ ఏమిటి సంబంధం?

డాక్టర్ని హత్యచేసి, పదివేలు తీసుకుని, యిద్దరూ పరారీ అవడానికి పన్నాగం పన్నారని సాక్ష్యాన్ని బట్టి తెలుస్తోంది. కానీ జయంతి తత్వాన్ని బట్టి ఆలోచిస్తే పదివేల రూపాయల కోసం హత్య కుట్రలో పాల్గొంటుందా? డాక్టర్ని హత్య చేయించడానికి డబ్బుకాక, జయంతికి మరేదో కారణం ఉండివుండవచ్చు. సూర్యప్రకాశ్‌కి డబ్బు కారణం కావచ్చు. లేదా జయంతి మీద మోజు కారణం కావచ్చు. ఇలా ఆలోచిస్తూ యుగంధర్ కారు అరవైమైళ్ళ స్పీడున డ్రైవ్ చేస్తున్నాడు. సాయంకాలం అయిదుగంటలకల్లా మైసూరు చేరుకున్నాడు. తిన్నగా మైసూరు రైల్వే స్టేషన్‌కి వెళ్ళి వాకబు చేశాడు. ఎవరూ చూడలేదన్నారు. రెండేరెండు టాక్సీలున్నాయి బయట. యుగంధర్ ఆ డ్రైవర్ని అడిగాడు.

''దాదాపు వారం రోజుల క్రితమా సార్. ఎలా జ్ఞాపకం ఉంటుంది?'' అన్నాడు ఓ డ్రైవర్.

యుగంధర్ జయంతి ఫోటో చూపించాడు. డ్రైవర్లు పెదిమలు విరిచారు.

''ఇంకో టాక్సీ ఉంది. అతను సవారీకి వెళ్ళాడు. కాసేపట్లో రావచ్చు. అతనికి తెలుసేమో అడగండి'' చెప్పారు.

యుగంధర్ కాచుకున్నాడు. అరగంట తర్వాత టాక్సీ వచ్చింది. యుఅంధర్ అతనికి జయంతి ఫోటో చూపించి అడిగాడు.

''వారం రోజుల క్రితం ఒకామెని బృందావన్‌లో ఒక హోటలికి తీసుకెళ్ళాను సార్. ఆమె మొహం సరిగా జ్ఞాపకం లేదు. ఈమె అవునో కాదో నిశ్చయంగా చెప్పలేను'' అన్నాడు.

"ఆమెతో కూడా ఎవరయినా మొగాడున్నాడా?" అడిగాడు యుగంధర్.

"ఇక్కడ టాక్సీ ఎక్కలేదు సార్. తోవలో ఒకచోట టాక్సీ ఆపమన్నది. ఓ షాపులోంచి ఒకతను వచ్చి టాక్సీ ఎక్కాడు. ఇద్దర్నీ బృందావన్ హోటల్‌లో దింపాను."

"అతని ఆనవాలు చెప్పగలవా?"

"ఫుల్ సూటులో ఉన్నాడు సార్. ఊదారంగు సూటు."

"థాంక్స్" అని చెప్పి యుగంధర్ క్రిజ్లర్ కారెక్కి బృందావన్‌కి బయలుదేరాడు.

మైసూరు నుంచి బృందావన్ పావుగంటలో చేరుకున్నాడు. హోటలు పారడయిజ్ ముందు కారు ఆపి, రిసెప్షన్ గుమాస్తా దగ్గిరకి వెళ్ళి "జయంతి అనే ఆమె మీ హోటల్లో ఉందా?" అడిగాడు.

గుమాస్తా లేదని తలతిప్పాడు.

"సూర్యప్రకాశ్ అనే అతను?"

"ఆ పేరు గల మనిషిలేడు" అన్నాడు గుమాస్తా.

"వాళ్ళు మీ హోటల్‌కి వచ్చి వారం రోజులు అయివుండాలి. బహుశా వెళ్ళిపోయి ఉంటారు యీపాటికి. దయచేసి మీ రిజిష్టర్ చూపిస్తారా?" అడిగాడు యుగంధర్.

"మీరెవరు?" అడిగాడు గుమ్మస్తా.

యుగంధర్ తన పేరు చెప్పాడు. గుమ్మస్తా వెంటనే కుర్చీలోంచి లేచి నమస్కారం పెట్టి "యుగంధర్‌గారా? మిమ్మల్ని గురించి ఎన్నో కథలు విన్నాను" అంటూ రిజిష్టర్ యుగంధర్‌కి యిచ్చాడు. జూలై 19వతేదీన హోటల్‌కి ఎవరెవరు వచ్చిందీ చూశాడు.

మిష్టర్ అండ్ మిసెస్ ధనరాజ్. వాళ్ళు యింకా హోటల్లోనే ఉన్నారు.

యుగంధర్ జయంతి ఫోటో గుమాస్తాకి చూపించి "ఈమె యీ మిసెస్ ధనరాజ్ ఒకళ్ళేనా?" అడిగాడు. గుమాస్తా పరీక్షగా చూశాడు ఫోటోని.

"చెప్పలేను సార్. మిసెస్ ధనరాజ్‌ని నేను చాలాసార్లు చూశాను. ఇద్దరికీ పోలిక ఉన్నట్లు ఉంది" అన్నాడు.

"థాంక్స్. నేను వాళ్ళ గదిలి వెళ్ళాలి. ఎక్కడున్నారు?"

"మేడమీద సార్. నేనూ రానా?"

"అవసరంలేదు" అని యుగంధర్ మేడమీదికి వెళ్ళాడు. రూం నెంబరు నాలుగు కుడివైపున ఉంది. ఆ గది తలుపు వరకూ అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్ళి, చెవి తలుపు సందుకి ఆనించి లోపల్నించి మాటలు ఏమైనా వినపడతాయేమోనని నిముషంపాటు కాచుకుని, చివరకు తలుపు మునివేళ్ళతో తట్టాడు.

"క్షణం ఆగండి" అన్న మాటలు వినిపించాయి. స్త్రీ కంఠస్వరం. సరిగ్గా అరనిముషం తర్వాత తలుపు ఒక రెక్క మాత్రం తెరిచి "ఎవరు కావాలి?" అడిగింది ఓ స్త్రీ.

"మిసెస్ ధనరాజ్ మీరేనా? ధనరాజ్ గారున్నారా?"

"మీ పేరు?"

యుగంధర్ నవ్వి "నా పేరు యుగంధర్" అన్నాడు.

"లోపలికి రండి, ధనరాజ్‌గారు షేవ్ చేసుకుంటున్నారు" అంది.

❦❦❦

**యుగంధర్** లోపల అడుగుపెట్టాడు. మరుక్షణం అతని తలమీద ఏదో బరువైన వస్తువు పడినట్లయింది. తలుపు వెనక నిలుచున్న మనిషి తనని తలమీద కొట్టాడని గ్రహించాడు యుగంధర్. కానీ ఏమీ చేయగల స్థితిలో లేడు. తల తిరిగిపోయింది ఆ దెబ్బకి. కళ్ళు చీకట్లు కమ్మాయి. కాళ్ళు బలహీనమైపోయాయి. నేలమీదకి జారిపోయాడు.

18

"సూర్యప్రకాశ్, జయంతి మైసూర్ వెళ్ళారని తెలిసింది. నేను మైసూర్‌కి వెళుతున్నాను. మైసూర్ సిటీ పోలీసు హెడ్ క్వార్టర్స్‌కి రా. నేను ఎక్కడవున్నదీ వాళ్ళు చెపుతారు - యుగంధర్."

రాజు ఉత్తరం చదవగానే మైసూర్‌కి రైలులో వెళ్ళడమా? బస్సులో వెళ్ళడమా అని ఆలోచిస్తూ అయిదు నిమిషాలు గడిపాడు. ఎవర్నయినా స్నేహితుణ్ణి అడిగి కారు తీసుకుని వెళ్ళడమే వీలు అని నిశ్చయించుకుని ఓ స్నేహితుడికి టెలిఫోన్ చేశాడు.

"దానికేం నిరభ్యంతరంగా తీసికెళ్ళు. కారు రెడీగా వుంది రా!" అని చెప్పాడు ఆ స్నేహితుడు.

అది స్టాండర్డ్ కారు. రోడ్డు గతుకులు లేకుండా నున్నగా వుంది. కారు డ్రైవింగ్‌లో రాజు చాలా నేర్పరి. డెబ్బై మైళ్ళ స్పీడున పోనిచ్చాడు. మధ్యాహ్నం పన్నెండు గంటలకి మైసూరు చేరుకున్నాడు. తిన్నగా పోలీసు సిటీ హెడ్ క్వార్టర్స్ ఆఫీసుకి వెళ్ళాడు.

"హల్లో రాజూ ఎప్పుడు వచ్చారు? యుగంధర్ కూడా వచ్చారా?" అడిగాడు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు.

"యుగంధర్ గారు నిన్నే వచ్చి ఉండాలి యిక్కడికి. నేను బెంగుళూరునించి యిప్పుడే వస్తున్నాను" అని యుగంధర్ రాసిన ఉత్తరం విషయం చెప్పాడు రాజు.

"నో! యుగంధర్ యిక్కడికి రాలేదు. ఈ ఊరికి కూడా వచ్చి ఉండరు. నిన్ననగా వచ్చివుంటే యింకా నన్ను కలుసుకోకుండా వుంటారా?" అన్నాడు సూపరింటెండెంట్.

రాజు కనుబొమ్మలు చిట్లించి ఆలోచించడం ప్రారంభించాడు. యుగంధర్ మైసూర్‌కే వెళితే బెంగుళూర్ హోటల్‌కో, ఇన్‌స్పెక్టర్ శివణ్ణకో టెలిఫోన్ చేసి చెప్పరా? నిన్ననగా యీ ఊరికి వచ్చివుంటే ఎందువల్ల యింకా పోలీస్ సూపరింటెండెంట్‌ని కలుసుకోలేదు? ఎంతపని వున్నా ఫోన్ చేసి చెప్పరా? తన్ని రమ్మనీ, సూపరింటెండెంట్‌ని కలుసుకోమనీ ఉత్తరం రాశాడే

"యుగంధర్ యీ ఊరికే వచ్చివుండాలి. మిమ్మల్ని యింతవరకూ కలుసుకోకపోవడానికి ఏదో కారణం ఉంటుంది"

"అయితే మైడియర్ రాజూ ఇక్కడే వుండండి. యుగంధర్ ఏ క్షణాన్నయినా ఫోన్ చెయ్యవచ్చు."

"ఇక్కడ కూర్చుని ఏం చేస్తాను? అలా ఊళ్ళోకి వెళ్ళి యుగంధర్ ఎక్కడికి వెళ్ళినదీ తెలుస్తుందేమో వాకబు చేస్తాను."

"మైడియర్ రాజూ హోటళ్ళకి ఫోన్ చెయ్యదలచుకుంటే యిక్కణ్ణించీ చెయ్యవచ్చుగా"

"యుగంధర్ హోటల్లో దిగారో లేదో? మళ్ళీ వస్తాను. యుగంధర్ ఫోన్ చేస్తే చెప్పండి. నేను సాయంకాలం అయిదుగంటల లోపున ఇక్కడికి వస్తాను" అని రాజు సూపరింటెండెంట్ ఆఫీసులోంచి బయలుదేరాడు.

జయంతిని గురించి యుగంధర్ రైలు స్టేషన్ దగ్గిర వాకబు చేసి ఉంటాడని అనుకుని రాజు ముందు రైలు స్టేషన్‌కి వెళ్ళాడు. టాక్సీ డ్రైవరు చెప్పినదాన్నిబట్టి యుగంధర్ బృందావన్‌కి బయలుదేరినట్లు గ్రహించి రైలు స్టేషన్ నించి తిన్నగా రాజు బృందావన్‌కి వెళ్ళాడు. ఓ హోటల్లోకి వెళ్ళి రెసెప్షన్ గుమాస్తాని అడిగాడు.

"యుగంధర్ గరా! అవునండీ నిన్న వచ్చారు. రూం నెంబరు 4లో వున్న దంపతుల గురించి విచారించారు."

"ఇక్కణ్ణించి ఎక్కడికి వెళ్ళారు?"

"నాకు తెలియదండీ రూం నెంబరు 4లో వున్న మిసెస్ అండ్ మిష్టర్ ధనరాజ్‌తో మాట్లాడ్డానికి వెళ్ళారు. తరువాత ఎక్కడికి వెళ్ళారో నాకు తెలియదు."

"ధనరాజ్ దంపతులు యింకా రూం నెంబరు 4లో ఉన్నారా?"

"లేదండీ. నిన్నరాత్రి ఎనిమిది గంటలకి ఖాళీచేసి వెళ్ళిపోయారు."

"ఎక్కడికి వెళ్ళారో తెలుసా?"

"తెలియదండీ. బహుశా వాళ్ళ ఊరికి వెళ్ళి ఉంటారు. గుంతకల్లు."

"యుగంధర్ వాళ్ళతో మాట్లాడినదీ లేనిదీ మీరు వాళ్ళని అడగలేదా?"

"అడిగానండీ మాట్లాడి అప్పుడే వెళ్ళిపోయారని చెప్పారు."

"ఇప్పుడు రూం నెంబరు 4లో ఎవరున్నారు?"

"ఎవరూ లేరండి. ఖాళీగా వుంది. మీకు కావాలా?"

"ఓ సారి ఆ గది చూడనిస్తారా?"

"ఓ యస్" అని కుర్రాణ్ణి పిలిచి, తాళం చెవి యిచ్చి "ఈయనకి రూం నెంబరు 4 చూపించు" చెప్పాడు గుమాస్తా.

కుర్రాడు రూం నెంబరు 4 తెరిచాడు. అది డబుల్ రూం. బాత్ రూం ఎటాచ్డ్ గది. గది మధ్య రెండు మంచాలు. సీలింగ్ ఫాన్, డ్రెస్సింగ్ టేబుల్, ఓ పక్కన చిన్న బీరువా బల్ల రెండు కుర్చీలు.

గదంతా పరీక్షగా చూశాడు రాజు. తర్వాత డ్రెస్సింగ్ టేబులు సొరుగులు పరీక్ష చేశాడు. బీరువా తలుపు తెరిచి చూశాడు. నీళ్ళగదిలోకి వెళ్ళి చూశాడు. తను దేనికోసం వెతుకుతున్నదీ తనకే స్పష్టంగా తెలియదు. తలుపు దగ్గిర నిలుచుని ఆలోచిస్తున్నాడు.

"ఏమిటి సార్! గది నచ్చలేదా?" అడిగాడు కుర్రాడు.

కుర్రాడు ఆ మాట అనగానే అటు తిరిగాడు రాజు. అప్పుడు చూశాడు తలుపు వెనక పెయింట్ మీద గీతలు. దగ్గిరగా వెళ్ళి పరీక్ష చేశాడు. ఎక్స్ గుర్తు అది. దాని కింద, ఒక గీత ఉంది. ఆపదలో ఉన్నప్పుడు ఒకళ్ళకి ఒకళ్ళు తెలియబరచడానికి ఉపయోగించే గుర్తు అది. అది ఎవరో ఎందుకో గీసిన గుర్తుకాదని నిశ్చయంగా తెలిసేందుకు ఎక్స్ క్రాస్ కింద అడ్డగీత పెడతారు. ఆ గుర్తుని బట్టి యుగంధర్ ఆ గదిలోకి వచ్చి ఏదో ఆపదలో యిరుక్కున్నాడని రాజు గ్రహించాడు. యుగంధర్ సంతకంతో ఉత్తరం రాసినంత నిశ్చయంగా తెలిసింది రాజుకి ఆ విషయం. అంతేకాదు, క్రాస్ అడుగున వున్న గీత వంకరలుగా అస్పష్టంగా వుంది. నేలమీద ఒరిగిపోతూ గోటితో గీసి ఉండాలి.

రాజు గుండె దడదడమంటున్నది. నేలమీద తివాసీ పరీక్షగా చూశాడు. నల్ల మరకలు కనిపించాయి. జేబులోంచి చాకు తీసి గీకాడు.

గడ్డ కట్టిన రక్తం. అది ఎవరిది? యుగంధర్‌దేనా? రాజుకి నిముషం పాటు మతిపోయినట్లయింది. డాక్టర్ని చంపి పారిపోతున్న సూర్యప్రకాశ్, జయంతీ యింకొక హత్య చేశారా? స్పృహలేని యుగంధర్ని యీ గదిలోంచి ఎలా బయటికి తీసుకెళ్ళారు? యుగంధర్ అంతటివాణ్ణి మేడమీదనించి కిందకి తీసుకెళ్ళడం సామాన్యమైన పనికాదు. ఒక మనిషి చెయ్యగలిగిన పనికాదు. "ఈ గదిలో వున్నవాళ్ళు నిన్న ఖాళీ చేసి వెళ్ళేటప్పుడు ఏయే సామానులు తీసుకెళ్ళారు?" అడిగాడు రాజు కుర్రాణ్ణి.

"ఓ పెట్టె, ఓ హోల్డాలు తీసుకెళ్ళారు."

"ఎంత పెద్ద పెట్టె?"

"పెద్దది కాదు సార్. రెండున్నర అడుగులు వుంటుంది అంతే. తోలుపెట్టె"

రాజుకి అంతా అయోమయంగా ఉంది. ఎక్స్ గుర్తుని బట్టి, తివాసీ మీద రక్తపు మరకని బట్టి యుగంధర్ ఆపదలో ఉన్నాడనీ, యీ గదికి వచ్చిన తర్వాత ఆపద కలిగిందనీ తెలుస్తోంది. యుగంధర్ యీ గుర్తుపెట్టిన తర్వాత ఆపద నుంచి తప్పించుకున్నాడా? ఎలా యీ గదిలోంచి యుగంధర్ని సూర్యప్రకాశ్, జయంతీ తమతో తీసుకెళ్ళి ఉంటారు? అక్కడ నిలబడి ఎంత ఆలోచించినా ఏమీ తేలదు. తెలుసుకున్న విషయాలు సూపరింటెండెంట్కి టెలిఫోన్ చేసి చెప్పాలని కిందికి దిగి వెళ్ళాడు రాజు.

## 19

యుగంధర్కి స్పృహ వచ్చేటప్పటికి తను మంచం మీద పడుకునున్నాడు. రెండు చేతులూ, రెండు కాళ్ళూ కట్టేసి ఉన్నాయి. నోటిలో ఏదో కుక్కి పెట్టారు. ఇటూ అటూ చూశాడు. ఎవరూ కనిపించలేదు. తలతిప్పి చూశాడు. అది రూం నెంబరు 4 కాదు. చాలా చిన్నగది. ఒకే ఒక మంచం ఉంది. రెండే కుర్చీలున్నాయి. తను ఈ గదిలోకి ఎలా వచ్చాడు?

నీళ్ళ గదిలో ఏదో చప్పుడు వినిపించింది. నీళ్ళు గలగలమంటున్నాయి. ఎవరో ఉన్నారన్నమాట. యుగంధర్ చేతులూ, కాళ్ళూ కదిల్చి చూశాడు. చాలా బిగుతుగా కట్టివున్నాయి. ఒదుల్చుకోవడం కష్టంకాదు కానీ గంటో రెండు గంటలో పడుతుంది. అంత వ్యవధి ఉన్నదా?

ఎవరు వీళ్ళు? తనని ఎందుకు తలమీద అలా కొట్టారు? ధనరాజ్ని తను చూడలేదు. కానీ తలుపు తెరిచిన మిసెస్ ధనరాజ్కీ, జయంతికీ విగ్రహంలో, జుట్టు దువ్వుకున్న తీరులో స్థూలంగా కొన్ని పోలికలున్నా ఆమెకీ, జయంతికీ మిగతా ఎక్కడా పోలిక లేదని ఆమెని చూడగానే గ్రహించాడు. ధనరాజ్ తలుపువెనక కాచుకుని తను లోపల అడుగుపెట్టగానే తలమీద కొట్టాడు. నేలమీదకు జారిపోతూ తలుపుమీద ఎక్స్ దానికింద అడ్డగీతా గీశాడు. అది అలవాటు. చాలా ఏళ్ళ అలవాటు. రాజు బొంబాయి నించి మైసూరుకి వచ్చి తన జాడలు తెలుసుకుని తనని రక్షిస్తాడని ఆలోచించి చేసిన పని కాదు అది.

నీళ్ళ గది తలుపు తెరుస్తున్న శబ్దం అయింది. తువ్వాల మాత్రం నడుంకి చుట్టుకుని నీళ్ళగదిలోంచి బయటికి వచ్చింది ఒక యువతి.

ఇరవై ఏళ్ళుంటాయి. గులాబీరంగు ఒళ్ళు, కత్తిరింపు జుట్టు. మోకాళ్ళకిందనించీ పాదాలవరకూ, నడుం నించి మెడవరకూ ఆమె వొంటిమీద బట్టలేదు. యుగంధర్ని చూసి "ఆ! తెలివి వచ్చిందన్నమాట" అని అక్కడే బల్లమీద వున్న సిగిరెట్ కేసులోంచి సిగిరెట్ తీసి వెలిగించి యింకో తువ్వాలుతో మెడా, గుండె తుడుచుకుంటోంది యుగంధర్ ఎదురుగా నిలబడి.

ఎవరీమె? ఆడవాళ్ళలో సహజంగా వుండే సిగ్గు లేకుండా ఎందుకిలా ప్రవర్తిస్తోంది? అడగడానికి నోరు మెదలదు. కళ్ళార్పకుండా ఆమెనే చూస్తున్నాడు యుగంధర్.

మంచం చివర్న వున్న హౌస్ కోటు తీసి వేసుకున్నది. తర్వాత కుర్చీ యుగంధర్ ముందుకి లాక్కుని కూర్చుని "నువ్వేనన్నమాట ఆ గొప్ప యుగంధర్" అని నవ్వింది.

యుగంధర్ కళ్ళార్పకుండా చూస్తున్నాడు.

"మా విషయం ఎవ్వరికీ తెలియదనుకున్నాం. ఎలా కనిపెట్టావు? అయినా నువ్వు పోలీసు ఉద్యోగివి కావుగా? నీకు మాపై యింట్రస్టు ఏమిటి?" అన్నది.

జవాబు చెప్పాలన్నా ప్రశ్నలు అడగాలన్నా అవకాశంలేదు యుగంధర్కి.

మొద్దుగా వున్న ఒక యినపకడ్డీని తీసి యుగంధర్‌కి చూపించి "నీకు తెలివి వస్తే రాగానే యీ కడ్డీతో తలమీద ఒక గట్టిదెబ్బ వెయ్యమని నాకు చెప్పారు. పాపం కిక్కురుమనకుండా నువు పడుకున్నావు. నిన్ను ఎందుకు కొట్టాలని ఊరుకున్నాను" అన్నది.

మంచిపని చేశావు అన్నట్లు తలూపాడు యుగంధర్, ఎవరీమె? జయంతి కాదు.

అంతలో తలుపు చప్పుడయింది. "ఎవరు?" అడిగిందామె.

"నేను, ప్రాణ్" ఎవరో మొగాడు.

ఆమె లేచి వెళ్ళి తలుపు తీసింది. అతను లోపలికి వచ్చి వెంటనే తలుపు మూసేసాడు. చాలా పొడుగ్గా, లావుగా ఉన్నాడు. దుబ్బ జుట్టు, వెడల్పయిన మొహం, దట్టమైన కనుబొమలు, ఉలెన్ సూటు వేసుకున్నాడు. యుగంధర్ పక్కకి వచ్చి కూర్చున్నాడు.

పిస్తోలు తీసి రాణికి యిచ్చి "ఈయన మీద గురిపెట్టి ఉంచు" అని యుగంధర్ వైపు తిరిగి "మా విషయం నీకు ఎలా తెలిసిందో అర్థం కాకుండా వుంది. ఎలా మా ఆచూకీ తెలిసింది? మా గురించి మీకేం తెలుసు? పోలీసులకి కూడా తెలుసా? ఎవరు మా రహస్యాలు బయట పెట్టారు? ఈ ప్రశ్నలకి జవాబులు కావాలి. నీ నోట్లో కుక్కిన పీలికలు తీసెయ్యను. తీస్తే నువ్వు అరవవచ్చు. అందుకని కుడిచేతికి కట్టిన తాడు ఊడతీస్తాను. నేను అడిగిన ప్రశ్నలకి జవాబులు కాగితం మీద రాయి" అని రైల్వేగైడ్ హొత్తుగా పెట్టి ఒక తెల్లకాగితం, పెన్సిలు తెచ్చి యుగంధర్ పక్కన పెట్టి కుడిచేతి కట్టూ విప్పాడు.

"మీ దురదృష్టం వల్ల మీ ఆచూకీ తెలిసింది" అని కాగితం మీద రాశాడు యుగంధర్.

అది చూసి ఆ మనిషికి చాలా కోపం వచ్చి యుగంధర్ని చెంపమీద ఫెళీమని కొట్టాడు.

"ప్రాణ్ వొద్దు. అకారణంగా దౌర్జన్యం చెయ్యక" అన్నది ఆమె.

"ఒళ్ళు పొగరుగా జవాబులు చెపుతున్నాడు" అన్నాడు ప్రాణ్ అనే అతను.

"మిసెస్ అండ్ మిస్టర్ ధనరాజ్ ఏమయ్యారు?" కాయితం మీద యుగంధర్ ప్రశ్న రాశాడు.

"వాళ్ళా అప్పుడే గది ఖాళీచేసి వెళ్ళిపోయారు. మేమూ యింకో గంటలో యీ గది ఖాళీ చేసి వెళ్ళిపోతాము. నిన్ను చంపి, నీ శవాన్ని ఆ బీరువాలో దాచి వెళ్ళిపోతాము. నీ శవం హోటలు వాళ్ళు చూసి, పోలీసులకి రిపోర్టు చేసేటప్పటికి మేము యిక్కడికి కొన్ని వందల మైళ్ళ దూరంలో ఉంటాము" అన్నాడు ప్రాణ్.

యుగంధర్ ఆలోచిస్తున్నాడు. అబద్దం చెపితే పోలీసులు యీపాటికి ధనరాజ్‌ని పట్టుకునుంటారనీ, తను ఒంటరిగా అక్కడికి రాలేదనీ, పోలీసులు ఆ ప్రాంతాల్లో కాపలా కాస్తున్నారనీ రాస్తే...

ప్రమాదం. వెంటనే తనని చంపి పారిపోవడానికి ప్రయత్నించవచ్చు. ఏవో మాటల్లో పెడితే తప్పించుకునేందుకు వ్యవధి అయినా ఉంటుంది. అవకాశం రావచ్చు. వీళ్ళు చేస్తున్న చట్ట విరుద్ధమైన చర్యలు ఏమిటో తెలిస్తే కొంతసేపు సంభాషణ సాగించవచ్చు.

"మా విషయం నీకెలా తెలిసింది?" అడిగాడు ప్రాణ్.

"ఆకాశవాణి చెప్పింది" అని రాశాడు యుగంధర్.

వెంటనే రాణీ అనే అమ్మాయి ప్రాణ్‌ని చూసి "నేను చెప్పలేదూ ఆ సుందరే చేసివుండాలి యీ పని. మనల్ని గురించి యింకెవ్వరు చెపుతారు పోలీసులకి" అన్నది.

"సుందరి చెప్పిందా?"

తల ఊపాడు యుగంధర్.

"ఇప్పుడు సుందరి ఎక్కడున్నది?"

"పోలీసు కస్టడీలో" అని రాశాడు యుగంధర్.

రాణి, ప్రాణ్ ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు.

"మనం త్వరగా యిక్కణ్ణించి వెళ్ళిపోవడం మంచిది. ఆ ధనరాజ్ యితన్ని మనకి అంటకట్టి తను తప్పించుకుని పారిపోయాడు" అన్నది రాణి.

ప్రాణ్ తలవూపాడు. యుగంధర్ని చూస్తున్నాడు.

"ఇతన్ని ఏం చెయ్యవద్దు. మనం యిప్పటికి చేసిన నేరాలకి తోడు హత్యకూడా చెయ్యవద్దు. ఇప్పుడు పట్టుబడితే జైలు శిక్షతో పోతుంది" అన్నదామె.

అతను ఆమెని కోపంగా చూశాడు. "ఇతన్ని యిలా వదిలి వెళితే యింకేమైనా వున్నదా? మనం మైసూరు చేరుకునే లోపున పట్టుకుంటాడు అన్నాడు.

"చంపవద్దు. చంపకుండా గది తాళం వేసి మనం మళ్ళీ వస్తామని చెప్పి గదికి డబ్బు యిచ్చి వెళదాం"

"ఈ యుగంధర్ని గురించి నీకు తెలియదు. జిత్తులమారి, ప్రమాదం. ఇతను తప్పించుకుంటే మనల్ని పట్టుకుని తీర్తాడు."

"నువ్వు యింత పిరికివాడివి అని అనుకోలేదు."

"ఇది పిరికితనం కాదు, వివేకం" అని యినపకడ్డీ తీశాడు అతడు.

"ప్రాణ్! వద్దు" అన్నది ఆమె.

"నీకేం తెలుసు? సామానులు సర్దు. నువ్వు చూడలేకపోతే వెళ్ళిపో."

"చూడలేక కాదు. నువ్వూ, నేను ఉరికంబం ఎక్కడం నాకు యిష్టంలేదు."

"నాన్సెన్స్" అంటూ యుగంధర్ని తలమీద కొట్టడానికి యినపకడ్డీ పైకి ఎత్తాడు ప్రాణ్.

"ప్రాణ్ వెంటనే ఆ యినపకడ్డీ కిందపడేయి. లేదా నిన్ను కాలుస్తాను" అన్నది రాణి.

ప్రాణ్ ఆశ్చర్యంతో చూశాడు ఆమెవైపు. ఆమె తలుపు దగ్గిర నిలుచున్నది. పిస్తోలు ప్రాణ్ ఛాతీమీద గురిపెట్టింది.

"ఏమిటిది?" అన్నాడతను.

"నచ్చచెప్పితే నువ్వు వినడంలేదు. నాకు ఉరికంబం ఎక్కడం ఇష్టం లేదు. ఆ కడ్డీ కిందపడేసి, సామానులు నువ్వే సర్దు" అన్నది ఆమె పిస్తోలు కిందికి దింపకుండా.

ప్రాణ్ ఆమె కళ్ళల్లోకి చూస్తూ "నువ్వు చెప్పిన మాట వినకపోతే నిజంగానే కాల్చేటట్టున్నావే?" అన్నాడు.

ఆమె తలవూపింది. "చంపను. చెయ్యో, కాలో కాలుస్తాను."

"అందరూ వస్తారు. నిన్నూ, నన్నూ పట్టుకుంటారు."

"అదే మేలు హత్య చెయ్యడం కన్నా."

ప్రాణ్ భుజాలు చరిచి, కడ్డీ కిందపడేసి సామానులు సర్దాడు. తలుపు బయట తాళం వేసి, వాళ్ళిద్దరూ వెళ్ళిపోయారు. రాణికి యుగంధర్ మనస్సులో ధన్యవాదాలు చెప్పుకున్నాడు. రాణి అడ్డుపడకపోతే ప్రాణ్ నిజంగానే తనని చంపేసేవాడు. ఎన్నో ప్రమాదాలనించి తప్పించుకున్న తను, ఎందరెందరో గజదొంగలనీ, హంతకులనీ పట్టుకున్న తను చివరికి తను చేస్తున్న దర్యాప్తుతో ఎటువంటి సంబంధం లేని మనిషిచేత చంపబడేవాడు. యుగంధర్ నవ్వుకున్నాడు. చేతులకీ, కాళ్ళకీ కట్టిన తాళ్ళు విడిపించుకోవటానికి ప్రయత్నం ప్రారంభించాడు. తాళ్ళు చాలా గట్టిగా ఉన్నాయి. కదలడానికి వీలులేకుండా మంచానికి బిగించి కట్టేశారు. ఎలా విడిపించుకోవడం?

దాహంతో, ఆకలితో యిలా యీ గదిలో తను యమబాధ పడి చావవలసి వస్తుందా? ప్రాణ్ పిస్తోలుతో తనని పేల్చి చంపి ఉండడమే మేలు అనిపిస్తుంది. చేతులు లాగాడు. కాళ్ళు కదల్చడానికి ప్రయత్నించాడు. నోట్లోంచి పీలికలు తీసెయ్యడానికి అష్టకష్టాలు పడ్డాడు. ప్రయోజనం లేకపోయింది. వాళ్ళు ఎన్నిరోజుల వరకూ గదికి డబ్బు యిచ్చారో? ఎన్ని ఎన్నిరోజుల తర్వాత హోటలు వాళ్ళు గది తలుపు తీసి చూస్తారో? రాయడానికి విప్పిన ఒక చేతిని మళ్ళీ కట్టి వెళ్ళాడు ఆ ప్రాణ్. చేతులు, కాళ్ళు ఒరుసుకుని మంటపుడుతున్నది. కానీ తాళ్ళు మాత్రం వొదులు కావడంలేదు. అయిదు నిముషాలు కూడా కాలేదు వాళ్ళిద్దరూ వెళ్ళి. అంతలో ఎవరో తలుపు తెరుస్తున్న చప్పుడయింది. యుగంధర్ ఆశతో చూశాడు.

మళ్ళీ వాళ్ళిద్దరే. రాణి, ప్రాణ్. ఎందుకు వచ్చారు?

ఏమైంది? తనని చంపడానికి ప్రాణ్ రాణిని ఒప్పించాడా?

ఇద్దరూ యుగంధర్ మంచం దగ్గిరకి వచ్చారు. ప్రాణ్ యుగంధర్ని విషపు చూపులు చూస్తున్నాడు.

"ఇక ఎలాగూ మనం తప్పించుకోలేము. వచ్చేశారు పోలీసులు" అన్నది నిట్టూర్చి రాణి.

"వీడివల్లే" పళ్ళ పటపట కొరికాడు ప్రాణ్.

రాణి చేతిలోనే ఉన్నది పిస్తోలు.

"అతని కట్లు ఊడదియ్యి" అన్నది.

"ఎందుకు?" అడిగాడు ప్రాణ్ కోపంగా.

"పోలీసులు వచ్చి ఎలాగూ మనల్ని పట్టుకుని యితన్ని విడిపిస్తారు. ఇప్పుడు యితన్ని విడిపిస్తే, ఇతని నేను చేసిన సహాయానికి నా మీద జాలి చూపించి, శిక్ష తక్కువ పడేటట్లు చేయిస్తాడేమో?" అన్నది.

యుగంధర్ తలవూపాడు అవునన్నట్లు.

"నేను ఊడదియ్యను" అన్నాడు మొండిగా ప్రాణ్.

"ప్లీజ్ త్వరగా కానియ్యి. వాదించక. వ్యవధి లేదు" అని పిస్తోలు అతని వైపు గురిపెట్టింది రాణి.

ప్రాణ్ ఆమెని విషపు చూపులు చూశాడు. తప్పలేదు. యుగంధర్ చేతులకీ కాళ్ళకీ వున్న కట్లు విప్పాడు. నోట్లో వున్న పీలికలు తీసేశాడు. యుగంధర్ కూర్చుని, చేతులూ కాళ్ళూ నిముషం పాటు మర్దన చేసుకుని "థాంక్స్ అమ్మా! నువ్వు చెప్పినట్లు పోలీసులకి నువ్వు నాకు చేసిన సహాయం గురించి చెపుతాను. ఆ పిస్తోలు యిలా యివ్వు" అన్నాడు యుగంధర్ చెయ్యి జాపి.

రాణి మాట్లాడకుండా పిస్తోలు అతనికి యిచ్చేసింది. ప్రాణ్ని దూరంగా కుర్చీలో కూర్చోమన్నాడు యుగంధర్. "అతని చేతులు, కాళ్ళూ కట్టెయ్యి" అన్నాడు రాణితో.

"ఎందుకు?" అడిగింది రాణి.

యుగంధర్ చిన్నగా నవ్వి "పోలీసులకి అప్పచెప్పడానికి. పోలీసులకి ఫోన్ చెయ్యడానికి నేను గదిలోంచి వెళితే యితను పారిపోతాడు. మీరు పొరపడ్డారు. మిమ్మల్ని గురించీ, మీరు చేస్తున్న చట్ట విరుద్ధమైన పనులగురించీ నాకేమీ తెలియదు. జయంతి, సూర్యప్రకాశ్ అనే వాళ్ళని వెతుక్కుంటూ నేను యీ హోటల్లోకి వచ్చాను. మిసెస్ ధనరాజే జయంతి అని పొరపడ్డాను. ఆమెను చూడగానే నా పొరపాటు తెలిసింది. పొరపాటు అని చెప్పి వెళ్ళిపోదామనుకున్నాను. కానీ అంతలో నా తలమీద ఎవరో కొట్టారు. బహుశా ఆ ధనరాజే అయ్యుండాలి" అన్నాడు యుగంధర్.

యుగంధర్ యీ మాటలు అంటూండగా ప్రాణ్ కుర్చీలోంచి లేవబోయాడు. యుగంధర్ పిస్తోలు చూపించి "సాహసించవద్దు" అని హెచ్చరించాడు.

"చాలా తెలివైనదానివి అనుకున్నావు. చూశావా? వీణ్ణి చంపి మనం వెళ్ళిపోయివుంటే ఎవరికీ తెలిసేది కాదు" అన్నాడు ప్రాణ్.

"ఎవర్నీ చంపడం నాకు యిష్టంలేదు. అయినా నాకు ఇలా ఊరినుంచి ఊరికి పరిగెత్తడం విసుగెత్తింది"

"అందుకని జైలులో ఉంటావా?" అడిగాడు ప్రాణ్.

"అదే నయమేమో?" అన్నది రాణి దిగులుగా.

"ఎందుకు పోలీసులంటే మీకు భయం. ఎందుకు ఊర్నించి ఊరు తిరుగుతున్నారు?" అడిగాడు యుగంధర్.

"నోరుముయ్యి, వీడికి ఏం చెప్పక" అరిచాడు ప్రాణ్.

రాణి బలహీనంగా నవ్వింది. "చెప్పకపోయినా ఎలాగూ తెలుసుకుంటారు. నేను, ప్రాణ్, ధనరాజ్, అతని భార్య నలుగురం కలిసి డబ్బున్నవాళ్ళని మోసం చేసి జీవిస్తున్నాము. ఇలాగే హోటళ్ళల్లో దిగడం, డబ్బున్నవాళ్ళతో స్నేహం చేసుకోవడం, ఆడవాళ్ళం రాత్రుళ్ళు వాళ్ళ గదుల్లో ఉండడం, ఆ మొగాళ్ళు ఆవేశంలో ఉండగా వాళ్ళ పర్సులు ఖాళీ చెయ్యడం, నగలు ఖరీదయిన వస్తువులు వుంటే వాటినీ తస్కరించడం - యివీ మేము చేస్తున్న పని. అపరిచితురాలైన స్త్రీతో రాత్రంతా గడిపినందుకు చింతించి, బుద్ధి తక్కువ పని చేశామని అనుకుని సామాన్యంగా అందరూ కిక్కురుమనకుండా ఊరుకునేవాళ్ళు. ఎవరో కొద్దిమంది మాత్రం పోలీస్ రిపోర్ట్ యిచ్చేవాళ్ళు. అందుకని పేర్లు మార్చుకుని ఊళ్ళూళ్ళు తిరుగుతున్నాం" అన్నది రాణి.

"ధనరాజ్ అతని భార్య ఎక్కడికి వెళ్ళారు?"

"వాళ్ళు కోయంబత్తూరు వెళ్ళారు. హోటలు హిమాలయాలో దిగి ఉంటారు."

**"థాంక్స్! పద."**

"ఎక్కడికి?"

"మనం వెళ్ళి పోలీసులకి ఫోన్ చేద్దాం. ఈ ప్రాణ్ నీ భర్తా?"

రాణి నవ్వింది. "నాకా? భర్తేమిటి? చెప్పానుగా నేను ఎటువంటిదాన్నో"

యుగంధర్ ఆమెని దయతో చూశాడు. "నీవు యింకా చిన్నదానివి. చేసిన తప్పులు చేశావు. ముందయినా నీ జీవితం సంస్కరించుకోవాలి" అని తలుపు తీసి రాణితో సహా బయటికి వచ్చాడు. సరిగ్గా ఆ సమయానికి రూం నెంబరు నాలుగులోంచి రాజుకూడా బయటికి వచ్చి యుగంధర్ని చూసి ఆశ్చర్యంతో "మీరు ఎక్కడున్నారు? తలుపు మీద ఎక్స్ గుర్తు చూసి.." అంటున్నాడు.

"అవును. నేనే ఆ గుర్తు పెట్టాను. తర్వాత చెపుతాను ఏం జరిగిందో నువ్వు యీ గదిలోకి వెళ్ళి కుర్చీలో కట్టబడి వున్న అతను తప్పించుకోకుండా చూస్తూ వుండు. ఇప్పుడే వస్తాను" అంటున్నాడు యుగంధర్.

## 20

"మిసెస్ ధనరాజ్ అనే ఆమెకీ, జయంతికీ కొంత పోలిక ఉండబట్టి యీ పొరపాటు జరిగింది" అన్నాడు యుగంధర్ పోలీస్ సూపరింటెండెంట్‌తో. పోలీస్ సూపరింటెండెంట్ నవ్వి "మీరు చేసిన పొరపాటు మాకు లాభించింది. ఇద్దరు ఆడవాళ్ళతో ఆ ధనరాజ్, ప్రాణ్ చేస్తున్న మోసాల గురించి చాలా కంప్లయింట్స్ వచ్చాయి. మద్రాసు ఆంధ్ర పోలీసులు వీళ్ళకోసం వెతుకుతున్నారు. హైదరాబాద్, విజయవాడలలో వీళ్ళు చాలా మందిని దబాయించి డబ్బు కాజేసారట. థాంక్స్ యుగంధర్" అన్నాడు.

యుగంధర్ నవ్వి "ఆ రాణి అనే అమ్మాయికి వీలయిన సహాయం చెయ్యండి. మనిషి మంచిది. ఈ దుర్మార్గుల సహవాసం వల్ల నేరాలు చేసింది. వస్తాము, మేము మళ్ళీ మా వేట ప్రారంభించాలి" అన్నాడు.

"ఎక్కడని ప్రారంభిస్తారు? జయంతి, సూర్యప్రకాశ్ యిక్కడికి వచ్చినట్లు మీరు సంపాదించిన సాక్ష్యం కూడా తప్పు సాక్ష్యమే అయ్యుంటుందా?" అడిగాడు పోలీస్ ఉద్యోగి.

"ఏమో? హోటల్ రిజిష్టర్ మరొకసారి చూసి యిక్కడికి రాలేదని తేలితే మళ్ళీ మైసూర్‌కి వెళ్ళి అక్కడ రైలు స్టేషన్ వద్ద వాకబు చెయ్యాలి" అని వెళ్ళిపోయి హోటల్ గుమస్తాని కలుసుకున్నాడు యుగంధర్.

"వీళ్ళు తప్ప యింకెవరూ అలాటి వాళ్ళు రాలేదు సార్" అన్నాడు గుమాస్తా.

గుమాస్తా పొరబడడం లేదని యుగంధర్ నిశ్చయించుకున్న తరువాత యుగంధర్ క్రిజ్లర్ కారులో, రాజు స్టాండర్డు కారులో మైసూర్‌కి బయలుదేరారు. అరగంటలో మైసూరు రైల్వేస్టేషన్ వద్ద రెండు కార్లూ ఆగాయి. రైలు స్టేషన్ ఉద్యోగులని, బయట వున్న టాంగాబళ్ళ వాళ్ళనీ, స్కూటర్ డ్రైవర్లనీ ప్రశ్నించాడు. జయంతి ఫోటో అందరికీ చూపించారు. ఎవరూ అటువంటి ఆమెని చూడలేదన్నారు. చూసినా యిన్నాళ్ళ తర్వాత జ్ఞాపకం ఉండకపోవచ్చునని యుగంధర్‌కి తెలుసు.

"రాజూ! ఓపికగా మనం యీ ఊళ్ళో హోటళ్ళన్నీ వెతకాల్సిందే" అన్నాడు యుగంధర్.

రాజు తల ఊపాడు. పోలీసు డిపార్టుమెంట్‌కి వెళ్ళి, ఊళ్ళో బసచేసే హోటళ్ళ జాబితా తీసుకుని రాజు, యుగంధర్ విడివిడిగా బయలుదేరారు.

"జూలై 19వ తేదీ మీ హోటల్లో బస చేసిన వాళ్ళ జాబితా చూపించండి."

"ఈమెని మీరు చూశారా?" జయంతి ఫోటో చూపించి ఇవే ప్రశ్నలు.

తలలు తిప్పేవాళ్ళు, ఫోటో పరకాయించి చూసి "ఏమో? సరిగా జ్ఞాపకం లేదు" అనేవాళ్ళే అంతా.

రిజిష్టరు తీసి చూసి "పేరేమిటన్నారు?" అడిగాడు ఒక హోటలు మేనేజర్.

"జయంతి."

"లేదు. ఆ పేరు వున్న అమ్మాయి మా హోటల్లో దిగలేదు. కాని మీరు చూపించిన ఫోటోలో వున్న అమ్మాయిలాంటి అమ్మాయి మా హోటల్లో దిగింది అనుకుంటాను. నేను పొరపాటు పడుతున్నానేమో తెలియదు."

"ఏ తేదీన వచ్చింది?"

"చూసి చెపుతాను" అని పుస్తకం చూసి జూలై ఆ9వతేది."

"ఏ పేరున రిజిష్టరు చేసుకున్నది?"

"రాధ"

"ఆమెకూడా ఎవరయినా మొగాడున్నాడా?"

"ఆమెకూడా రాలేదు కానీ మర్నాడు వచ్చాడు ఒకతను."

"ఎలా ఉంటాడు?"

నవ్వాడు మేనేజరు "మామూలుగానే వున్నాడు. వికృతంగా లేడు. అందగాడు కాదు. అతను రాగానే ఆమె సింగిల్ రూంలోంచి డబుల్ రూములోకి మారింది. అతను తన భర్త అని చెప్పింది."

"అతని పేరు?"

"సూర్యప్రకాశ్."

"వాళ్ళు యింకా హోటల్లో వున్నారా?"

"లేరు సార్ రెండు రోజుల క్రితం ఖాళీ చేసి వెళ్ళారు."

"ఎక్కడికి వెళ్ళారో తెలుసా?"

"తెలియదు."

"ఈ ఫోటో సరిగ్గా చూసి చెప్పండి ఈమేనా?"

"అచ్చంగా యీమెలాగే ఉంది. అంతకన్నా ఎలా చెప్పగలను?" అన్నాడు మేనేజర్.

సూపరింటెండెంట్ ఆఫీసుకి వెంటనే యుగంధర్ ఫోన్ చేశాడు. "జయంతి జాడలు తెలిశాయి. రాజు ఫోన్ చేస్తే అతన్ని హోటల్ చాముండికి రమ్మని చెప్పండి" అని చెప్పి "పొద్దున్నా, రాత్రా? ఎప్పుడు ఖాళీ చేశారు?" అడిగాడు మేనేజర్ని.

"మధ్యాహ్నం వెళ్ళినట్లున్నారు."

"ఇక్కణ్ణించి మధ్యాహ్నం ఏ వూరికి రైలున్నది?"

"మధ్యాహ్నం రైలు లేదు సార్."

"మీ హోటల్లో దాదాపు ఆరురోజులున్నారన్నమాట."

"అవును. విచిత్రమేమంటే ఆ ఆరురోజులూ అతను గదిలోంచి బయటికే రాలేదు."

"భోజనం?"

"గదికే తెప్పించుకున్నాడు."

"ఆమె?"

"ఆమె తరచూ బయటికి వెళ్ళివచ్చేది"

"వాళ్ళు యిక్కణ్ణించి ఏ ఊరికి వెళ్ళినదీ తెలుస్తుందేమో రూం బాయిస్‌ని అడిగితే?"

"అడుగుతాను" అని కుర్రాళ్ళని పిలిచి, ప్రశ్నించి "బస్‌స్టాండుకి వెళ్ళారని అంటున్నారు వీళ్ళు" అని చెప్పాడు మేనేజర్.

"ఎలా తెలుసు?"

"వాళ్ళు మాట్లాడుకుంటుంటే విన్నారుట."

"థాంక్స్" చెప్పి రాజుకోసం యుగంధర్ కాచుకున్నాడు. పదినిముషాల్లో రాజు వచ్చాడు. రాజుకి యుగంధర్ చెప్పాడు.

"ఆలస్యం ఎందుకు? బస్టాండ్ వద్ద వాకబు చేద్దాం" అన్నాడు రాజు.

యుగంధర్, రాజు బస్ టెర్మినల్‌కి వెళ్ళారు. చాలా సులభంగా తెలిసింది జయంతి, సూర్యప్రకాశ్ బెంగుళూర్ బస్సులో వెళ్ళారని.

"ఇక యిక్కడ మనం ఏం చేస్తాం? పద బెంగుళూరుకి" అన్నాడు యుగంధర్.

బెంగుళూరు చేరుకోగానే రాజు తన స్నేహితుడి కారు అతనికి యిచ్చేసి క్రిజ్లర్ కారు ఎక్కి "బస్ టర్మినెల్‌కేగా?" అడిగాడు.

యుగంధర్ తలవూపాడు.

"జూలై 25వ తేదీ మైసూర్నించి సాయంకాలం వచ్చిన బస్సులో ఒక యువతీ, ఒక యువకుడూ యిక్కడ దిగివుండాలి. ఇది ఆమె ఫోటో. మీకు జ్ఞాపకం వున్నదా?" అడిగాడు యుగంధర్ జయంతి ఫోటో చూపించి.

నిముషం పాటు ఆలోచించి "అవునండీ నాకు జ్ఞాపకమున్నది. మద్రాసుకి వెళ్ళే బస్సులో వెళ్ళారు" అన్నాడు ఒకతను.

"ఊళ్ళోకి వెళ్ళకుండా ఇటునించి ఇటే మద్రాసు బస్సు ఎక్కారా?"

"అవును. అప్పుడే యింకో పదినిమిషాలలో బయలుదేరుతోంది మద్రాసుకి బస్. సీట్లు లేవు అని చెప్పాను. వాళ్ళిద్దరూ చాలా దిగులుగా చూశారు. అంతలో ఎవరో నలుగురు వాళ్ళ సీట్లు కాన్సిల్ చేసుకున్నారు. వాటిలో రెండు సీట్లు వాళ్ళకి యిచ్చాను" అన్నాడు అతను.

"థాంక్స్ మద్రాసుకే టిక్కెట్లు కొన్నారా?"

"అవును."

యుగంధర్, రాజు క్రిజ్లర్ కారెక్కారు. "రాజూ ఫర్వాలేదు. ఇది రేసులా ఉంది. మనకన్నా వాళ్ళు పదిరోజుల ముందు మద్రాసునించి బయలుదేరారు. ఇప్పుడిక వాళ్ళకీ మనకీ రెండురోజుల తేడా వుంది అంతే. బహుశా యింకో నాలుగయిదురోజులలో పట్టుకోగలమనుకుంటాను" అన్నాడు.

"మద్రాసుకేనా?"

"యస్. టాంక్ ఫిల్ చేయించు. ఎంత త్వరగా వెళ్ళగలిగితే అంత త్వరగా వెళదాం" అన్నాడు యుగంధర్.

"రికార్డు చూసి చెపుతానుండండి. యస్! బస్ నెంబరు 57 కండక్టర్ నెంబరు 49 సెల్వరాజ్. కరెక్ట్. ఇంకో అరగంటలో డ్యూటీలోకి వస్తాడు" అన్నాడు ట్రాన్స్‌పోర్ట్ ఇన్‌స్పెక్టర్ యుగంధర్‌తో.

"ఈ అమ్మాయిని మీరు చూడలేదన్నమాట?" జయంతి ఫోటో చూపించి అడిగాడు.

"నాకు జ్ఞాపకం లేదు సార్. బెంగుళూరునించి మద్రాసు వరకూ బస్సులో వచ్చివుంటే ఆ కండక్టర్‌కి తప్పకుండా జ్ఞాపకం వుంటుంది. అడిగి చూడండి"

అరగంట తర్వాత యుగంధరూ, రాజు మళ్ళీ మద్రాసు మఫిజిల్ బస్టాండ్‌కి వెళ్ళారు.

"ఇతనే సార్ సెల్వరాజ్"

"గుడ్" అని యుగంధర్ సెల్వరాజ్‌కి జయంతి ఫోటో చూపించి అడిగాడు.

"జ్ఞాపకం వున్నది సార్ ఈమెకూడా ఒకతను ఉన్నాడు. ఫుల్‌సూటు అతను. వాళ్ళు మద్రాసుకి టిక్కెట్టు కొన్నారు కానీ యిక్కడిదాకా రాలేదు తోవలో దిగిపోయారు. అందుకే నాకు బాగా జ్ఞాపకం వున్నది."

"తోవలో దిగిపోయారా? ఎక్కడ?" అడిగాడు రాజు.

"రాణీపేటలో"

"ఎందుకు రాణీపేటలో దిగుతున్నారో చెప్పారా?"

"లేదు సార్ వాళ్ళ యిష్టం. నేనెవరు అడగడానికి?"

"థాంక్స్" చెప్పి యుగంధరూ, రాజు మళ్ళీ కారెక్కారు.

"రాణీపేట పెద్ద ఊరు కాదు. సులభంగా వాళ్ళ జాడ తెలుస్తుంది అనుకుంటాను" అన్నాడు రాజు.

యుగంధర్ తలవూపాడు. రాజు కారు డ్రైవ్ చేశాడు. రాణీపేట బస్టాప్ వద్ద విచారించారు.

"అవును సార్. మీరు చెప్పినలాంటి వాళ్ళు ఒక ఆడదీ, ఒక మొగాడూ యిక్కడ దిగారు. ఒక కుర్రాడిచేత సామానులు మోయించుకుని వెళ్ళారు" అని చెప్పాడు ఓ కిళ్ళీ షాపు అతను.

"ఆ కుర్రాడు నీకు తెలుసా?"

"తెలుసండీ బస్ వచ్చేవేళకి రోజూ యిక్కడికి వస్తాడు."

"ఇప్పుడెక్కడుంటాడు?"

"బజారులో వుంటాడు. వచ్చి చూపించనా?"

తల ఊపాడు యుగంధర్. కొట్లో యింకో మనిషిని కూర్చోపెట్టి అతను ఆ యిద్దరు డిటెక్టివ్‌లని బజారుకి తీసుకెళ్ళాడు. "అడుగో వాడేనండీ" అని పధ్నాలుగేళ్ళ కుర్రాణ్ణి చూపించాడు. ఆ కుర్రాణ్ణి పిలిచి అడిగాడు యుగంధర్.

"అవునండీ మార్కెట్‌కి అవతల వున్న లాడ్జికి తీసుకెళ్ళాను.

"చూపిస్తావా?"

ఉత్సాహంగా ఆ కుర్రాడు కారు ఎక్కాడు.

"ఓ ఊరినించి యింకో ఊరికి, ఒక హోటల్ నుంచి యింకో హోటల్‌కి పరుగెత్తుతున్నారు జయంతీ, ఆమె ప్రియుడు" అన్నాడు రాజు.

"అవును. కానీ ఆశ్చర్యమల్లా ఒకటే"

"ఏమిటి?" అడిగాడు రాజు.

"తమ ఆనవాలు దాచుకునేందుకు ప్రయత్నం చేశారే కానీ గట్టి ప్రయత్నం చెయ్యలేదు. ఇలా పేర్లు మార్చుకుని ఊళ్ళు ఊళ్ళు తిరగడం అలవాటులేక పొరపాట్లు చేశారో లేక..."

"లేక?" అడిగాడు రాజు.

"ఏమో?" అన్నాడు యుగంధర్.

లాడ్జికి వెళ్ళారు. మేనేజర్, ప్రొప్రయిటర్ అన్నీ ఒకే మనిషి. అది శుక్రవారం సాయంకాలం. దీపాలు వెలిగించే వేళయింది ప్రొప్రయిటర్ పూజ చేస్తున్నాడు. పది నిముషాల వరకూ డిటెక్టివ్‌లతో మాట్లాడలేదు. తర్వాత దీపాలు వెలిగించి "ఏమిటండీ?" అడిగాడు మర్యాదగా.

యుగంధర్ చెప్పాడు.

"అవును. చీకటి పడుతుండగా మా లాడ్జికి వచ్చారు. మేడమీద డబుల్ రూం తీసుకున్నారు. తెల్లారే వెళ్ళిపోయారు" అన్నాడు హోటల్ అతను.

"ఎక్కడికి వెళుతున్నదీ చెప్పారా?"

"లేదండీ వెల్లూరు ఆస్పత్రికి వెళుతున్నారని ఊహించాను వాళ్ళ మాటలని బట్టి."

"అంటే నిన్న పొద్దున్న వెళ్ళారన్నమాట."

"అవును."

"థాంక్స్" అని కుర్రాడికీ, షాపు అతనికీ చెరో రెండు రూపాయలు యిచ్చి యుగంధర్, రాజు వెల్లూరికి బయలుదేరారు. రాణీపేటకి వెల్లూరు చాలా దగ్గర. పావుగంటలో వెల్లూరు చేరుకున్నారు.

"ఎక్కడ విచారిద్దాం?" అడిగాడు రాజు యుగంధర్ని.

"రాణీపేటకీ, వెల్లూరికీ మధ్య టాక్సీలు, బస్సులు, సైకిల్ రిక్షాలు, జట్కాలు వెళుతూ ఉంటాయి. కనుక మనం వాళ్ళ ఆచూకీ ఆ విధంగా తెలుసుకోవడం కష్టం. హోటళ్ళల్లో అడగడం సులభం అనుకుంటాను" యుగంధర్ చెప్పగానే రాజు ఒక హోటల్ ముందు కారు ఆపాడు. రాజే లోపలికి వెళ్ళి అడిగివచ్చి "ఇక్కడికి రాలేదుట" అన్నాడు నీరసంగా.

నాలుగు హోటళ్ళలో అడిగిన తర్వాత అయిదవ హోటల్లో "యస్ మా హోటల్లో వున్నారు" అన్నాడు మేనేజర్. రాజు గుండె దడదడమన్నది.

"ఏ పేరున రిజిష్టర్ చేసుకున్నారు?"

"సునీత, సుందర్. భార్యాభర్తలు. మేడమీద ఎడం చేతివైపున నాలుగో గది" అన్నాడు మేనేజర్.

రాజు కారు దగ్గరికి పరిగెత్తుకు వెళ్ళి యుగంధర్‌కి చెప్పాడు.

"సరిగా కనుక్కున్నావా? ఇంకా యిక్కడే ఉన్నారా?"

"కనుక్కున్నాను సార్ ఇంకా యిక్కడే ఉన్నారట. రండి"

యుగంధర్ కారులోంచి దిగాడు. యుగంధర్ ముందు వెనక రాజు మేడమీదకి వెళ్ళి ఎడం చేతి వైపు తిరిగి నాలుగో గది తలుపు తట్టారు. "ఎవరు?" అడిగారు లోపల్నించి ఎవరో.

"తలుపు తియ్యండి."

గుసగుసలు వినిపించాయి. తర్వాత ఎవరో తలుపు దగ్గిరకి వస్తున్న అలికిడి అయింది.

యుగంధర్, రాజు తయారుగా ఉన్నారు. తలుపు గడియతీసిన చప్పుడయింది. తలుపు తెరవబడింది.

"ఎవరు కావాలి?" మొరటుగా అడిగాడు.

యుగంధర్ అతన్ని ఎగాదిగా చూసి "ఈ గదిలో యింకా ఎవరున్నారు?"

అడిగాడు.

"ఎవరూ లేరు"

"అబద్ధం యింకా కొందరి కంఠస్వరాలు వినపడ్డాయి. అడ్డంలే" అన్నాడు యుగంధర్.

"రండి" అని తలుపుకి దూరంగా జరిగాడు అతను. చటుక్కున లోపలికి వెళ్ళి, తలుపు వెనక చూశాడు. ఎవరూ లేరు. రాజుకూడా లోపలికి వెళ్ళాడు.

"నీళ్ళగదిలో దాక్కున్నారేమో?" అన్నాడు రాజు.

"అవును. నీళ్ళగదిలోనే దాక్కుండాలి" అన్నాడు యుగంధర్. రాజ్, యుగంధర్ తలుపువైపు చూస్తున్నారు. "రండి. మీరు ఎక్కడికీ తప్పించుకుని పోలేరు. నీళ్ళగదిలో ఉన్నారని మాకు తెలుసు" అన్నాడు యుగంధర్.

నవ్వు వినిపించింది వెనక. చటుక్కున యిద్దరూ వెనక్కి తిరిగారు. తలుపు తెరిచిన మనిషి పిస్తోలు పట్టుకుని వాళ్ళవైపు గురిపెట్టి ఉంచాడు. గది తలుపు మూసేశాడు.

"నీ చేతిలో పిస్తోలు చూసి బెదురుతాననుకున్నావా?"

"చేతులెత్తండి పిస్తోలుకి సైలెన్సర్ ఉన్నది. కాల్చడానికి ఏ మాత్రం సందేహించను" అన్నాడు. అతని కంఠస్వరంలో కాఠిన్యమూ, సంకల్పమూ విని యుగంధర్, రాజు చేతులు ఎత్తారు.

యుగంధర్ ఆశ్చర్యంతో అతన్నే చూస్తున్నాడు. జయంతి, ఆమె ప్రియుడు డాక్టర్ని హత్యచేసి పారిపోతున్నారు. పిస్తోలుతో తమని బెదిరిస్తారని అనుకోలేదు.

అంతలో నీళ్ళగది తలుపు తెరుచుకున్నది.

ఎవరో వస్తున్న అలికిడి అయింది.

ఒకళ్ళు కాదు, యిద్దరు కాదు. చాలామంది వుండి ఉండాలి.

యుగంధర్ వెనకనించి నలుగురు ముందుకి వచ్చి నిలబడ్డారు. యిద్దరు ఆజానుబాహులు, ఒకడు చాలా పొట్టిగా, బక్కగా ఉన్నాడు. ఇంకొకడు లావుగా, పొట్టిగా ఉన్నాడు.

లావుగా, పొట్టిగా వున్న మనిషి యుగంధర్ని పరీక్షగా చూసి "యుగంధరా?" అన్నాడు.

"నువ్వు ముత్తురాజ్వి కదూ జైలునించి ఎప్పుడు విడుదల అయివచ్చావు?" అడిగాడు యుగంధర్.

"మీ సహాయం ఎవరు అడిగారు? ఆ బాంక్ వాళ్ళా?" అడిగాడు.

యుగంధర్, రాజు ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు. ఏమిటి విచిత్రం. తాము దర్యాప్తు చేస్తున్న కేసు ఒకటి, తమకి తటస్థపడుతున్న కేసులు వేరు.

"బాంకులో దొంగతనం చేశావన్నమాట."

ముత్తురాజ్ నవ్వాడు. "బాంక్లో దొంగతనం చెయ్యక ముష్టివాడి యింట్లో దొంగతనం చేస్తానా? మేము యిక్కడ ఉన్నామని మీకెవరు చెప్పారు?"

"ఆకాశవాణి"

"యుగంధర్! పరిహాసాలకి యిది సమయంకాదు. చెప్పు నీకెలా తెలిసింది?"

"నాకే కాదు. పోలీసులకి కూడా తెలుసు. ప్రస్తుతం యీ హోటల్ చుట్టూ పోలీసులు కాపలా కాస్తున్నారు."

"ఇలాగే చెప్పి ఒకసారి నాలుగేళ్ళ క్రితం నన్ను మోసం చేసి పట్టుకున్నారు మీరు. ఇక మీ మాటలు నమ్మను" అని క్షణం ఆగి "ఏయ్ పండా! తాళ్ళు రెండు తీసుకురా. ఏయ్ కుళ్ళన్ యుగంధర్ని వెనకనించి చేతులు విరిచి పట్టుకో" అని అనుచరులకి ఆజ్ఞలు యిస్తున్నాడు ముత్తురాజ్.

ఈ దొంగలచేతిలో యిలా చిక్కిపోవడమూ, వాళ్ళు తమని తాళ్ళతో  కడుతూంటే కళ్ళప్పగించి చూస్తూ ఊరుకోవడము యుగంధర్కీ, రాజుకీ యిష్టంలేదు. కుళ్ళన్ అనే అతను బాగా దగ్గిరకి వచ్చి జబ్బల మీద చెయ్యి వేసేటంత వరకూ కాచుకుని, వెంటనే యుగంధర్ కాస్త ముందుకి ఒంగి రెండు చేతులూ వెనక్కి వచ్చి ఆ కుళ్ళన్ నడుం పట్టుకుని పైకెత్తి, తలమీద నించి ముందుకు లాక్కొని తనకి అడ్డంగా కవచంలా పట్టుకున్నాడు.

ఇదంతా రెప్పపాటు కాలంలో జరిగింది.

పిస్తోలు పట్టుకుని నిలుచున్న మనిషికి ఏం చెయ్యాలో తెలియలేదు. "కాల్చవద్దు. కాలిస్తే నేను చస్తాను" అరుస్తున్నాడు కుళ్ళన్.

కుళ్ళన్ కిక్కురుమనకుండా ఉండిపోయాడు.

"యుగంధర్ వాణ్ణి వదిలెయ్యి. ఎలాగూ నువ్వు యిక్కణ్ణించి తప్పించుకుని పారిపోలేవు."

యుగంధర్ నవ్వాడు. నవ్వుతూ ఓరకంటితో చూస్తున్నాడు రాజు ఏం చేస్తున్నాడా అని. రాజు తన వెనక్కి వెళ్ళిపోయాడు. కనిపించడంలేదు. పిస్తోలు పట్టుకున్నవాడి చేతిలోంచి ఎలాగయినా పిస్తోలు లాగేస్తే...! ఎలా? ఉన్నట్లుండి, యుగంధర్ కాళ్ళకింద భూమి

కదిలినట్లయింది. ఏమిటిది? భూకంపమా? కుళ్ళన్‌తో సహా యుగంధర్ ముందుకు పడ్డాడు. పడుతూ చూశాడు రాజు ఒక్క గంతున పిస్తోలు పట్టుకున్న అతని మీదకి ఉరకడం పిస్తోలు పట్టుకున్న అతనూ, తనలాగే కిందపడ్డాడు. కిందపడినా యుగంధర్ కుళ్ళన్‌ని వదలలేదు. అతన్ని తన ఛాతీమీద అడ్డంగా పెట్టుకుని దొర్లాడు.

గదిలో తివాసీ ఒక చివర్న పట్టుకుని బలంగా లాగాడు రాజు. యుగంధరూ, పిస్తోలు పట్టుకున్న అతను కూడా తివాసీ మీదే నిలుచునుండడం వల్ల యిద్దరూ కిందపడ్డారు. పిస్తోలు పట్టుకున్న అతను కింద పడిన మరుక్షణం రాజు ఒక్క గంతున అతని మీదికి ఉరికి అతని చెయ్యి గట్టిగా పట్టుకున్నాడు.

"ఒదులు. పిస్తోలు వొదులు" అన్నాడు అతని చెయ్యి వెనక్కి విరుస్తూ. అది గమనించి తతిమ్మా వాళ్ళు రాజుమీదికి ఉరికారు. ఒకడు రాజుని బూట్సు కాలితో తన్నాడు. అయినా రాజు పిస్తోలు పట్టుకున్న అతని చెయ్యి వదలలేదు. వెనక్కి విరుస్తున్నాడు. అతను నొప్పి తట్టుకోలేక పిస్తోలు వదిలెయ్యడం యిష్టంలేక మూలుగుతున్నాడు.

రాజు మెడ ఒకడు పట్టుకున్నాడు. రెండుకాళ్ళూ యింకోడు పట్టుకున్నాడు. రాజుని లాగుతున్నారు వాళ్ళు. యుగంధర్ కుళ్ళన్ని ఒక తోపు తోసి లేచాడు. పిస్తోలు ప్రమాదం లేదు. రాజు సాహసం వల్ల ఆ అపాయం తప్పింది. కాలెత్తి ఒకణ్ణి వెనక మోకాళ్ళమీద బలంగా తన్నాడు యుగంధర్.

"అమ్మో" అంటూ వాడూ కిందపడ్డాడు. బాధతో మూలుగుతున్నాడు.

ఇంకొకణ్ణి భుజం పట్టుకుని తనవైపు లాక్కుని పిడికిలి బిగించి దవడమీద బలంగా కొట్టాడు. కళ్ళు తేలేసి చెట్టు విరిగి పడినట్లు నిటారుగా పడ్డాడు వాడు. రాజు కాళ్ళని పట్టుకుని లాగుతున్నవాణ్ణి జుట్టు పట్టుకుని యీడ్చాడు. వెనక్కి లాగి నేలకేసి వాడి తల ఒకసారి బాదాడు. వాడు కిక్కురుమనకుండా తెలివి తప్పి పడ్డాడు.

**ఇక మిగిలింది** పిస్తోలు పట్టుకున్నవాడు, కుళ్ళన్. పిస్తోలు వాడి చేతిలోంచి లాక్కుందామని యుగంధర్ వొంగాడు. సరిగ్గా ఆ సమయానికి మెడమీద ఏదో పడినట్లయింది యుగంధర్‌కి.

కుళ్ళన్ యుగంధర్ మీదికి ఉరికి, భుజం మీద కూర్చుని, కత్తితో యుగంధర్ని పొడవడానికి చెయ్యి పైకి ఎత్తాడు. కుళ్ళన్ మనిషంతా యుగంధర్ నడుం వరకైనా రాడు.

యుగంధర్‌కి నవ్వు వచ్చింది. ఒకసారి భుజాలు విదిలించాడు. కుళ్ళన్ వెనక్కి పడ్డాడు.

"ఉష్ అంటే కిందపడేవాడివి నీకు కూడా యింత ధైర్యమా" అని కుళ్ళన్ చేతిలో కత్తిలాక్కుని, వాణ్ణి చెంపమీద చిన్నగా ఒక దెబ్బవేసి పిస్తోలు పట్టుకునివాడివైపు తిరిగాడు యుగంధర్.

రాజు లేచి నిలబడుతున్నాడు. రాజు చేతిలో పిస్తోలున్నది. పిస్తోలు పట్టుకున్న అతను బాధతో కేకలు పెడుతున్నాడు.

రాజు వెనక్కివంచి, వంచి అతని చెయ్యి దాదాపు విరిచేశాడు. ఆ కేకలకి, ఆ అరుపులకి హోటల్లో జనం తలుపు బయట పోగయి అరుస్తున్నారు.

"ఏమిటీ గొడవ తలుపు తియ్యండి" అని కేకలు వేస్తున్నాడు మేనేజర్.

"ఎవరో చంపుకుంటున్నారు. పోలీసులకి కబురు పంపండి" మరొకడు సలహా యిస్తున్నాడు.

రాజూ, యుగంధర్ ఒకర్ని ఒకరు చూసుకుని నవ్వుకున్నారు. కుళ్ళన్ తప్ప తతిమ్మా అందరూ నేలమీద పడి దొర్లుతూ ఏడుస్తున్నారు. చెయ్యి విరిగిన అతను గగ్గోలు చేస్తున్నాడు. యుగంధరూ, రాజూ నీళ్ళగదివైపు చూశారు. నీళ్ళగదిలో ఒక రేకుపెట్టె కనిపించింది.

"రాజూ తలుపు తియ్యి. ఎవర్నీ లోపలికి రానివ్వక. పోలీస్‌లకి కబురు పంపమని చెప్పు" అని నీళ్ళగదిలోకి వెళ్ళి యుగంధర్ రేకుపెట్టె మూత తెరిచాడు.

కట్టలు కట్టలు నోట్లు బంగారం నగలు.

ఏదో బాంకు దోపిడి చేసి పంచుకుంటున్న సమయంలో అక్కడికి వచ్చి వాళ్ళ కార్యకలాపాలకి అడ్డం వచ్చామన్న మాట అనుకుని తనలో తను నవ్వుకుని యుగంధర్ నీళ్ళగది తలుపు మూసి వెనక్కి తిరిగాడు. రాజు గది తలుపుకి అడ్డంగా నిలబడి "పోలీసులు వచ్చేంతవరకు ఎవర్నీ లోపలికి రానివ్వను" అంటున్నాడు.

"నా హోటల్‌లోకి వచ్చి, గొడవచేసి లోపలికి రానివ్వని అంటావేమిటయ్యా" అరుస్తున్నాడు హోటల్ మేనేజర్.

యుగంధర్ వెళ్ళాడు.

"క్షమించండి. ఇది పోలీసుల వ్యవహారం. దొంగలని పట్టుకున్నాము. నా పేరు యుగంధర్. దయచేసి పోలీసులకి వెంటనే రమ్మని కబురు చెయ్యండి."

"అప్పుడే కబురు చేశాము" అన్నాడు హోటల్ మేనేజర్.

టకటక బూట్సులు చప్పుడు చేసుకుంటూ పోలీసులు వచ్చారు. స్థానిక ఇన్‌స్పెక్టర్ యుగంధర్ని చూసి, గుర్తుపట్టి "హల్లో సార్ వాట్ యీజ్ ది మేటర్" అన్నాడు.

"లోపలికి వెళ్ళి చూడండి. ఐదుగురు దొంగలు. కొన్ని లక్షల రూపాయలు వున్నాయి" అని ఇన్ స్పెక్టర్‌కి దారి యిచ్చి మేనేజర్ వైపు తిరిగి "సునీత, సుందర్ అనేవాళ్ళు యీ గదిలో ఉన్నారని చెప్పారు. అటువంటి పేర్లు కలవాళ్ళు ఈ గదిలో ఉన్నట్టు లేరే" అన్నాడు.

"ఈ గదిలో ఉన్నారని చెప్పలేదే మేడమీద కుడివైపు నాలుగో గది అని చెప్పాను."

"లేదు. ఎడం వైపు నాలుగోగది అని చెప్పారు మీరు."

"నేనెందుకు అలా చెపుతాను" అన్నాడు మేనేజర్.

"పొరపాటు ఎవరిదో ఒకళ్ళది. పద రాజూ" అని కుడివైపు నాలుగోగదికి పరిగెత్తాడు యుగంధర్.

ఆ గది తలుపు తెరిచి వుంది. గదిలో ఎవరూ లేరు. సామానులూ లేవు.

"గదిలో ఎవరూ లేరే" అని అరిచాడు యుగంధర్.

"లేరా! ఏమయ్యారు?" అంటూ మేనేజర్ అటు పరిగెత్తుకు వెళ్ళాడు.

"ఈ హడావిడికి హోటల్లో వాళ్ళంతా ఆ గదిముందు చేరేటప్పటికి అక్కడ ఏదో గొడవ జరుగుతోందనీ అక్కడ వుండడం మంచిది కాదనీ తెలిసి జయంతీ, సూర్యప్రకాశ్ చల్లగా జారుకుని వుండాలి" అన్నాడు యుగంధర్.

"అంతా పావుగంట క్రితమే వెళ్ళివుండాలి" అన్నాడు రాజు.

ఫర్వాలేదు. ఎక్కడికి పోతారు? పట్టుకోవచ్చు అనే ధైర్యంతో "రా! రాజూ!" అని హోటల్లోంచి బయటికి దారితీశాడు యుగంధర్.

వీధిలోకి వెళ్ళిన తర్వాత అక్కడ నలుగురయిదుగుర్ని అడిగారు జయంతి, సూర్యప్రకాశ్ ఎటు వెళ్ళినదీ తెలుసుకోవడానికి.

''బజారువైపు వెళ్ళారండీ'' అని చెప్పాడు ఒక మనిషి, రాజు క్రిజ్లర్ కారు బజారువైపు పోనిచ్చాడు. అక్కడ మళ్ళీ వాకబు చేశారు.

''ఇంతకుముందే అంటే పది పదిహేను నిముషాల క్రితం చూశానండీ మీరు చెప్పినటువంటి వాళ్ళని. వాళ్ళు కారు ఎక్కి వెళ్ళారు'' అన్నాడు ఒక షాపు అతను.

''కారా! నెంబర్ చూశారా?''

''నెంబరు చూడలేదు కానీ పాండిచ్చేరి కారు అయ్యుండాలి. పి. అని వుంది.''

''వెరీగుడ్ కారు ఎటు వెళ్ళింది?''

''అదుగో అటు. పాండిచ్చేరి రోడ్డుమీద.''

రాజు కారు అటు తిప్పాడు. అరవై మైళ్ళ స్పీడున పోనిస్తున్నాడు. ''పాండిచ్చేరి చేరేలోపున వాళ్ళ కారుని సమీపిస్తాము. వాళ్ళని పట్టుకుంటాము'' అన్నాడు నవ్వుతూ.

యుగంధర్ కూడా నవ్వి ''ఏమో? చెప్పలేం రాజూ ఇంతవరకూ వాళ్ళకి అదృష్టం కలిసివస్తోంది. నువ్వు పొరపాటు పడలేదనీ, ఆ హోటల్ మేనేజర్ పొరపాటున మనల్ని ఎడం వైపున నాలుగో గదికి వెళ్ళమని చెప్పాడనీ తెలుసు. ఆ గదిలో యింకెవరయినా వుండి వుంటే మనం వెంటనే పొరపాటు గ్రహించి కుడివైపు వెళ్ళి జయంతినీ, ఆమె ప్రియుడయిన ఆ సూర్యప్రకాశ్‌నీ పట్టుకునే వాళ్ళం. కానీ జయంతి అదృష్టం. ఆ దొంగల దురదృష్టం. నాలుగో నెంబరు గదిలో దొంగలు దోపిడీ ధనం పంచుకుంటూండగా మనం వెళ్ళాము. వాళ్ళతో పోట్లాట జరగడం వల్ల దాదాపు అరగంట మనం అక్కడ వుండిపోవడం జయంతి అదృష్టం కాదూ. అటువంటి అదృష్టమే యింకా వాళ్ళకి సహాయంగా వుందేమో'' అన్నాడు.

''అదృష్టం యీపాటికి అయిపోయివుండాలి'' అన్నాడు రాజు.

''వాళ్ళ అదృష్టం ఎప్పటికి అయిపోతుందో మనం ఎలా నిర్ణయించగలం? ఎంత విచిత్రమైన కేసు. ఇన్ని ఊళ్ళు తిరగడం, ఇంత దగ్గిరగా వచ్చికూడా మనం వెతుకున్న వాళ్ళని పట్టుకోలేకపోవడం నా అనుభవంలో ఎన్నడూ జరగలేదు. మనం వెతుకుతున్న మనుషులు కాక వేరే దొంగలు, మోసగాళ్ళు అంతర్ రాష్ట్ర నేరస్తులు చిక్కడం కూడా విచిత్రంగా ఉంది'' అని యుగంధర్ అంటూండగా ఢాం అని చప్పుడు అయింది. యుగంధర్ చటుక్కున వెనక్కి తిరిగి చూశాడు. వెనక కారేదీ రావడంలేదు. రాజు చేతిలో స్టీరింగ్ వీల్ కదిలిపోయి కారుని ఒక పక్కకి లాగేస్తోంది. అతి కష్టం మీద బ్రేక్ నొక్కి కారు రోడ్ పక్కనున్న చెట్లకి కొట్టుకోకుండా ఆపేశాడు రాజు. ''బరస్టు అయింది సార్'' అన్నాడు నవ్వుతూ.

యుగంధర్ కారు దిగి వెనక చక్రం పరీక్ష చేసి ''యు ఆర్ రైట్. బరస్ట్ అయింది. చూశావా వాళ్ళ అదృష్టం'' అన్నాడు.

''అదే నేనూ ఆలోచిస్తున్నాను. ఆ జయంతికి, సూర్యప్రకాష్‌కి మంత్రాలు తెలుసేమో'' అంటూ రాజు వెనక చక్రం మార్చడానికి టూల్సు తీసుకువచ్చాడు. ఇరవై నిముషాలు పట్టింది.

''అమ్మయ్య వాళ్ళ అదృష్టం సంగతి ఎలా ఉన్నా యీ చక్రాలు మార్చడం చాలా శ్రమ అయిన పని'' అని చేతులు దులుపుకుని రాజు సిగిరెట్ వెలిగించాడు.

''నేను డ్రైవ్ చేస్తానులే. నువ్వు కాసేపు విశ్రాంతి తీసుకో'' అన్నాడు యుగంధర్. అరవై మైళ్ళకి తక్కువ కాకుండా కారు నడిపాడు. మైలురాళ్ళు వెనక్కి దొర్లిపోతున్నాయి. చెట్లు పక్కలకి పరిగెత్తుతున్నాయి.

''ఇంకా ఆ కారు ఎక్కడా కనిపించదేం?'' అన్నాడు రాజు.

"వాళ్ళూ యింత వేగంగా వెళుతున్నారేమో?"

"ఇంకోవైపు పక్కరోడ్లకి వెళ్ళి ఎక్కడికయినా వెళ్ళారేమో? పాండిచ్చేరికి వెళ్ళడం లేదేమో?"

యుగంధర్ నవ్వి "ఈ ప్రాంతల పెద్ద ఊరు ఏదీ లేదు. మరీ చిన్న పల్లెలకి వెళ్ళి వాళ్ళు ఎక్కడుంటారు? హోటళ్ళల్లో దిగడం అలవాటయిన మనుష్యులు కాస్త పెద్దవూళ్ళే వెళతారు" అన్నాడు.

బస్సులు ఎదురు వచ్చాయి. లారీలు పక్కనించి వెళ్ళాయి. ఎద్దుబళ్ళు అడ్డం వచ్చాయి. "ఎదురొచ్చే కారునో, బస్సునో ఆపి అడిగితే తెలుస్తుందిగా" అని రాజు సలహా యిచ్చాడు.

"అనవసరం. మరికొంత టయిం వృధా అవుతుంది" అన్నాడు యుగంధర్. పాండిచ్చేరి చేరుకునేటప్పటికి అప్పుడే వీధి దీపాలు వెలిగాయి.

"మళ్ళీ హోటళ్ళన్నీ వెతకాల్సిందే" అన్నాడు రాజు.

యుగంధర్ తలవూపి "ఈ వూళ్ళో చాలా హోటళ్ళున్నాయి. కానీ పెద్దవీ, అన్ని సౌకర్యాలు వుండి వీలుగా వుండేవి నాలుగే హోటళ్ళు. అక్కడ ప్రారంభిద్దాం దర్యాప్తు" అన్నాడు.

హోటల్ కోస్టల్‌కి వెళ్ళారు. జయంతిని పోలిన మనిషి అక్కడికి రాలేదని తెలిసింది. తర్వాత హోటల్ హెలెన్‌కి వెళ్ళారు. అక్కడా లేరు జయంతీ, సూర్యప్రకాశ్. తరవాత హోటలు పాండీలోకి వెళ్ళారు.

"యస్ సార్. ఒక గంట క్రితమే వచ్చారు మీరు చెప్పినవాళ్ళు. రిజిష్టర్ చూస్తానుండండి. యస్ వెనుక వున్న కాటేజిలో దిగారు" అన్నాడు హోటల్ గుమాస్తా.

"కాటేజీ నెంబర్?" అడిగాడు యుగంధర్.

"రెండే కాటేజీలున్నాయి సార్ మొదటి కాటేజీలో దిగారు."

"థాంక్యూ" అని ఇద్దరు డిటెక్టివ్‌లూ కాటేజీల వేపు వెళ్ళారు.

"పూర్తయిందన్నమాట వేట. చివరికి చిక్కారు" అంటూ యుగంధర్ కాటేజీ తలుపు తట్టాడు.

"ఎవరు?"

"రూం సర్వీస్"

"ఇప్పుడు అవసరంలేదు" స్త్రీ కంఠస్వరం.

మళ్ళీ తలుపు తట్టాడు.

"ఏం అవసరంలేదు."

యుగంధర్ జవాబు చెప్పకుండా మళ్ళీ తలుపు తట్టాడు.

"అబ్బబ్బ ఏమిటీ గోల" అంటూ తలుపు దగ్గిరకి వచ్చి విసురుగా  తలుపు తీసి "ఎన్నిసార్లు చెప్పాలి" అంటూ మాట ఆపేసి తెల్లబోయి యుగంధర్నీ, రాజునీ చూసి "మీరెవరు?" అడిగింది హీనస్వరంతో.

యుగంధర్ గుర్తుపట్టాడు. జయంతే సందేహం లేదు.

"మిస్ జయంతీ" అన్నాడు.

"ఎవరు మీరు?" అరిచింది ఖంగారుగా.

"నా పేరు యుగంధర్. ఇతను నా అసిస్టెంట్ రాజు. మేం డిటెక్టివ్‌లం"

"డిటెక్టివ్‌లా" జయంతి మొహం పాలిపోయింది. బెదురుతూ వెనక్కి చూసింది.

"సూర్యప్రకాశ్ వున్నాడా?" అడిగాడు యుగంధర్.

"సూర్యప్రకాశా ఎవరతను?"

"జయంతీ ఇలా అబద్ధం చెప్పి ప్రయోజనం లేదు. సూర్యప్రకాశ్ నువ్వూ కలిసి యిక్కడికి వచ్చారని మాకు తెలుసు" అంటున్నాడూ యుగంధర్. అంతలో గదిలో ఏదో చప్పుడయింది.

"తలుపుకి అడ్డంలే" అన్నాడు యుగంధర్.

ఆమె కదలకుండా "ఏమిటీ దౌర్జన్యం?" అన్నది.

యుగంధర్ ఆమె రెండు భుజాలు పట్టుకుని ఎత్తి పక్కన నిలుచోపెట్టి గదిలోకి వెళ్ళాడు. అతని వెనకే రాజూ వెళ్ళాడు.

గదిలోకి ఎవరూ లేరు. యుగంధర్ నీళ్ళగది తలుపు లాగాడు. రాలేదు.

"మిస్టర్ తలుపు తియ్యి ఎంతసేపని అక్కడ దాక్కుంటావు?" అన్నాడు.

అప్పటికీ జవాబు లేదు. రాజు ఒక కుర్చీ తలుపు దగ్గిరకి లాగి, కుర్చీ ఎక్కి నిలుచుని, పైనున్న వెంటిలేటర్లోంచి లోపలికి చూసి "సార్, లోపల లేడు. పారిపోయాడు" అన్నాడు కుర్చీమీదనించి కిందకి దూకుతూ.

"ఎలా పారిపోయాడు?"

"ఇంకో తలుపున్నది" అంటూ రాజు బయటికి పరిగెత్తాడు.

రాజు వెనకే యుగంధర్ పరిగెత్తాడు. సూర్యప్రకాశ్ తప్పించుకుని పారిపోతాడేమోననే ఆదుర్దాలో జయంతికి ఎవరూ కాపలా లేకుండా పరిగెత్తారు.

పరిగెత్తుకుంటూ వెళ్ళి గేటు దగ్గిర వున్న ఒక ఫియట్ కారులో ఒకతను ఎక్కడం దూరాన్నించి చూసి రాజు యింకా త్వరగా పరిగెత్తాడు. కానీ రాజు అక్కడికి వెళ్ళేలోపున ఆ ఫియట్ కారు కదిలి వెళ్ళిపోతోంది. రాజు నిస్పృహతో వెనక్కి తిరిగి క్రిజ్లర్ కారు దగ్గిరికి పరిగెత్తాడు. అప్పటికే యుగంధర్ కారు స్టార్టు చేశాడు. కదులుతునన్ క్రిజ్లర్ తలుపు తెరుచుకుని యుగంధర్ పక్కన కూర్చున్నాడు రాజు రొప్పుతూ.

ముందు వెళుతున్న ఫియట్ కారు దృష్టిలోంచి తప్పించుకుపోకుండా యుగంధర్ అటే చూస్తూ గేటులోంచి కారు పోనిచ్చాడు.

"మన క్రిజ్లర్ స్పీడు ఆ చిన్న ఫియట్‌కి ఏనాడూ రాదు" అన్నాడు రాజు నవ్వుతూ.

యుగంధర్ జవాబు చెప్పలేదు. బజారు వీధిలో జనం కిటకిటలాడుతున్నారు. సైకిల్ రిక్షాలూ, సైకిళ్ళూ అడ్డదిడ్డంగా వస్తున్నాయి. పాండిచ్చేరిలో అన్నీ అడ్డరోడ్లు, నిలువు రోడ్లూ. ముందున్న ఫియట్ కారు ఎటన్నా తిరిగితే, మళ్ళీ పట్టుకోవడం కష్టం కావచ్చు. యుగంధర్ మనస్సంతా డ్రైవింగ్ మీద లగ్నం చేశాడు.

ఫియట్ కారు ఎటూ తిరగలేదు. తిన్నగా హైరోడ్డు మీదికి వెళుతోంది.

"ట్రంక్ రోడ్డు పట్టిస్తున్నాడు సార్. మనకి మరీ సులభం" అన్నాడు రాజు ఉత్సాహంగా.

యుగంధర్ తలవూపాడు. క్రిజ్లర్ కారుతో ఫియట్ కారుని సులభంగా దాటెయ్యవచ్చు. తర్వాత క్రిజ్లర్ కారు రోడ్డుకి అడ్డంగా పెడితే సూర్యప్రకాశ్ ఫియట్ ఆపక తప్పదు. ఏ పిస్తోలో పట్టుకుని, బెదిరించి, పోట్లాడే తత్వం వున్న మనిషి కాడని తేలిపోయింది. అటువంటి మనిషే అయితే హోటల్లోంచి అలా పారిపోడు.

ట్రంక్ రోడ్డుమీద వెళుతున్నాయి రెండు కార్లూ. ఫియట్ స్పీడు హెచ్చింది. యుగంధర్ క్రిజ్లర్ స్పీడూ హెచ్చించాడు. ఫియట్ దగ్గిరయింది. ఇక పక్కనించి దాటి ముందుకి వెళ్ళాలి.

బొయ్, బొయ్ మని హారన్ మోగిస్తూ పక్కగా తీసుకెళ్ళాడు క్రిజ్లర్ కారుని. ఫియట్ పక్కకి జరిగి సైడు యివ్వలేదు.

"కావలసి సైడు యివ్వడంలేదు" అన్నాడు రాజు.

యుగంధర్ తలవూపాడు.

"కుడివైపుకి వెళ్ళి రాంగ్ సైడు నించి ఓవర్ టేక్ చెయ్యండి" రాజు సలహా యిచ్చాడు.

"అటు మాత్రం సైడ్ యిస్తాడా? ఎందుకు ఓవర్‌టేక్ చెయ్యనిస్తాడు?" అన్నాడు యుగంధర్. అయినా ప్రయత్నించాడు.

ఫియట్ కారు కుడివైపుకి జరిగింది, అటునించీ క్రిజ్లర్ కారు దాటి ముందుకి వెళ్ళడానికి వీలు లేకుండా.

రాజు పిస్తోలు తీశాడు. "టయిర్ పేలుస్తాను" అన్నాడు.

యుగంధర్ తల విదిలించాడు. "చాలా ప్రమాదం. అతను చాలా వేగంగా వెళుతున్నాడు. స్టీరింగ్ కంట్రోలు తప్పి చాలా పెద్ద ప్రమాదం సంభవించవచ్చు. ఒద్దు కాల్చవద్దు" అని వారించాడు.

ముందు ఒక లారీ వెళుతోంది. ఫియట్ కారు ఆ లారీని దాటి వెళ్ళిపోయింది. క్రిజ్లర్ కారు ఆ లారీని సమీపించేటప్పటికి లారీ రోడ్డులో అడ్డంగా వెళుతోంది. హారన్ మోగించి, లారీని సైడ్ అడిగి, దాటి వెళ్ళేందుకు కొంతవేగం తగ్గించవలసి వచ్చింది యుగంధర్‌కి. లారీని దాటిన తర్వాత కనుచూపు మేరలో ఫియట్ కారు కనిపించలేదు.

"పక్కరోడ్లోకి తిప్పేశాడేమో?" అన్నాడు రాజు.

"చూద్దాం. ముందు ఎక్కడన్నా మలుపు వుండడం వల్ల ఫియట్ కనిపించడంలేదేమో?" అంటూ యుగంధర్ క్రిజ్లర్ కారు ఏక్సిలేటర్ నొక్కాడు. ఒక్క వురుకు ఉరికింది ముందుకి. వాయువేగంతో పోతోంది.

"అదుగో సార్ దూరాన కనబడే ఆ రెడ్‌లైట్ ఫియట్‌దే" అన్నాడు రాజు.

దూరాన ఎక్కడో ఉన్న ఆ రెడ్ లైట్ దగ్గిర అవుతోంది. బాగా దగ్గిరయింది. క్రిజ్లర్ కారు హెడ్‌లైట్స్‌లో కనిపిస్తోంది.

"ఆఁ ఫియట్టే" అన్నాడు రాజు.

"అవును. ఆ ఫియట్‌ని తరుముకుంటూ మనం ఎన్ని మైళ్ళు వచ్చాం?" అడిగాడు యుగంధర్.

"ముప్పయి అయిదు మైళ్ళు వచ్చాం పాండిచ్చేరి నించి."

"మద్రాసు చేరేలోగానైనా యితన్ని పట్టుకోగలమా" అన్నాడు యుగంధర్ నవ్వుతూ.

"ఇంకో పదిమైళ్ళు పోతే రోడ్డు బాగా వెడల్పుగా ఉంటుంది. అప్పుడు సులభంగా ఓవర్ టేక్ చెయ్యవచ్చు" అన్నాడు రాజు.

బాగా దగ్గిరవుతారు. యింకో అయిదు నిముషాలలో ఓవర్ టేక్ చెయ్యవచ్చునని అనుకుంటారు ఆ డిటెక్టివ్‌లు. అంతలో ఏ లారీయో, కారో, బస్సో అడ్డం వస్తుంది. ఫియట్ మళ్ళీ దూరం అవుతుంది.

"చెంగల్పట్టు దాటేశాం సార్" అన్నాడు రాజు నిస్పృహతో. "ఏం చేస్తాం. మద్రాసుకి వెళితే చిక్కిపోతాడు. ఇంత స్పీడుగా డ్రైవ్ చేస్తే మనమే కాక ట్రాఫిక్ సార్జంట్స్ మోటార్ సైకిల్స్ మీద తరుముతారు అతన్ని" అన్నాడు యుగంధర్.

సింగపెరుమాళ్ కోవిల్ కూడా దాటారు. తాంబరం వచ్చేసింది. గిండీ రైలు స్టేషన్ ముందునించి వెళ్ళారు. ఫియట్‌కీ, క్రిజ్లర్‌కీ యాభై గజాలకన్నా దూరంలేదు. గిండీనించి సైదాపేట బ్రిడ్జి మీదికి ఫియట్ తిరిగింది. వెనకే క్రిజ్లర్ వెళ్ళింది. ఓ లారీ బ్రిడ్జిమీద

ఆగివుంది. రాజు దూరాన్నించి చూసి "ఆ లారీ చెడిపోయినట్లుంది. దాన్ని దాటి వెళ్ళడం కష్టం. మనవాడు ఫియట్ ఆపి తీరాలి" అన్నాడు.

యుగంధర్ క్రిజ్లర్ స్పీడు తగ్గించాడు. ఫియట్ స్పీడు తగ్గలేదు. రయ్‌మని వెళుతోంది.

"పిచ్చిపట్టిందా ఏమిటి? ఎలా ఆ లారీని దాటి వెళతాడు బ్రిడ్జిమీద" అరిచాడు రాజు.

యుగంధర్ కూడా ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

లారీ పక్కన సందున్నది. ఒక కారు వెళ్ళడానికి చాలినంత స్థలం వుందా? లేకపోతే బ్రిడ్జి ప్రక్కన వున్న చెక్కఫెన్సింగ్‌కి తగులుతుంది.

"సార్! ఆ సందులోంచి వెళుతున్నాడు. మన క్రిజ్లర్ పట్టదు ఆ సందులో" అన్నాడు రాజు.

ఫియట్ లారీకి, చెక్క ఫెన్స్‌కి మధ్యవున్న సందులో దూరింది. వేగం తగ్గకుండానే రయ్‌మని వెళ్ళింది. చెవులు చిల్లులు పడేటట్లు చప్పుడు వినిపించింది.

"ఫెన్స్‌కి కొట్టుకుంది" అని రాజు అంటూండగానే ఫియట్ కారు తలకిందులుగా బ్రిడ్జిమీదనుంచి కిందపడింది. క్రిజ్లర్ బ్రేక్ వేసి యుగంధరూ, రాజూ దిగారు. లారీ డ్రైవర్, క్లీనర్ ఫెన్స్ దగ్గిరికి పరిగెత్తారు.

విచిత్రం అంత పైనించి కిందపడినా, ఆ ఫియట్ కారు హెడ్‌లైట్స్ బద్దలు కాలేదు. కనెక్షన్ పోలేదు. ఇంకా వెలుగుతూనే వున్నాయి. ఇంజన్ మాత్రం ఆగిపోయింది.

"ఇంత పైనించి పడితే యింకే బతుకుతారు. ఎంతమంది వున్నారో కారులో?" అన్నాడు లారీ డ్రైవర్.

యుగంధర్ కోపంగా లారీ డ్రైవర్ వైపు తిరిగి "నువ్వు ఈ బ్రిడ్జిమీద లారీ ఎందుకు ఆపిపెట్టావు?" అన్నాడు.

"ఏం చెయ్యను సార్. బ్రేక్స్ జామ్ అయ్యాయో ఏమైందో నాకు తెలియదు. లారీ కదలలేదు. నేనేం చెయ్యను. ఇటువంటి ప్రమాదం జరుగుతుందేమోననే నేను డేంజర్ లైటు వెలిగించి వుంచాను. నా తప్పేమిటి సార్"

"రాజూ నువ్వు త్వరగా వెళ్ళి ట్రాఫిక్ డిపార్టుమెంట్‌కి ఫోన్ చెయ్యి" అని చెప్పి యుగంధర్ వెనక్కి పరిగెత్తాడు. రాజు టెలిఫోన్ చెయ్యడానికి సైదాపేట వైపు పరిగెత్తాడు. బ్రిడ్జి చివరివరకూ వెళ్ళి యుగంధర్ కాలవ ఒడ్డుమీదనించి కిందకు దిగాడు. అది అడయార్ నది. నీళ్ళు అట్టేలేవు. టార్చిలైటు వెలిగించి. ఆ వెలుగులో తోవ చూసుకుంటూ ఫియట్‌కారు పడిన చోటికి పరిగెత్తాడు.

టార్చిలైట్ వెలుగు కారులోకి వేశాడు. డ్రైవింగ్ సీటులో కూర్చునున్న మనిషి మూలుగుతున్నాడు.

యుగంధర్ ఆశ్చర్యానికి అంతులేదు. అంత ఎత్తునించి కిందపడినా మనిషి యింకా ప్రాణాలతో వున్నాడు. ఆదరాబాదరా యుగంధర్ ఫియట్ కారు తలుపు తెరవడానికి ప్రయత్నించాడు. రాలేదు. తలుపు దెబ్బతిని తాళం బిగుసుకుపోయింది. ఓ రాయి తీసుకుని, తలుపు హాండిల్‌ని విరగగొట్టి, తలుపు తెరిచి టార్చిలైటు వెలుగు లోపలికి వేసి చూశాడు.

స్టీరింగ్ వీల్ కనిపించడంలేదు. కారులో వున్న మనిషి తల ముందుకి వాలివుంది. యమబాధతో మూలుగుతున్నాడు.

"క్షణం ఓపిక పట్టు" అని యుగంధర్ అతన్ని అక్కణ్ణించి బయటికి తియ్యడానికి ప్రయత్నించాడు. ప్రయోజనం లేకపోయింది. సీటుకీ, స్టీరింగ్ వీల్‌కీ మధ్య యిరుక్కుపోయాడు. ముందున్న విండ్ షీల్డ్ అద్దం తునాతునకలయి, అతని చేతులకీ, మెడకీ అద్దం పెంకులు గుచ్చుకున్నాయి. రక్తం ధారలుగా కారుతోంది. యుగంధర్ సీటు వెనక్కి లాగాడు. తర్వాత అతన్ని రెండు చేతుల్లో ఎత్తుకుని తెచ్చి నేలమీద పడుకోపెట్టాడు. చకచకా పరీక్ష చెయ్యడం ప్రారంభించాడు.

అతనింకా మూలుగుతున్నాడు. ఎక్కణ్ణించో నూతిలోంచి వస్తున్నట్లున్నది అతని గొంతులో మూలుగు. అతనికి స్పృహలేదు. తెలివి తప్పినా, ఆ స్థితిలో కూడా బాధభరించలేక మూలుగుతున్నాడు. అంబులెన్స్ వచ్చి, ఆస్పత్రికి తీసికెళ్ళేటంత వరకూ బతికి ఉంటాడని నమ్మకం లేదు యుగంధరికి. కారు ఏక్సిడెంట్‌లో మరణించినట్లు దొంగ సాక్ష్యం సృష్టించి, డాక్టర్ని హత్యచేసిన యీ మనిషి కారు ఆక్సిడెంట్‌లోనే మరణించడం విధి వైపరీత్యం. భగవంతుడు న్యాయం రకరకాలుగా చూపిస్తాడు.

అంతలో సైరన్ ఊదుకుంటూ అంబులెన్స్ వచ్చింది. క్షణాలలో నిచ్చెనలు, స్ట్రెచ్చర్లు తీసుకుని ఫైర్‌మెన్ దిగారు. పోలీసు ఉద్యోగులతో, ఫైర్‌మెన్‌తో, హెల్మెట్స్‌తో, టార్చిలైట్లతో ఆ స్థలం అంతా హడావిడిగా ఉంది.

**22**

"చెప్పలేను" అన్నాడు డాక్టర్ యుగంధర్‌తో.

"అంత అపాయస్థితిలో వున్నాడా?" అడిగాడు యుగంధర్.

"అవును. విండ్ షీల్డ్ అద్దం గుచ్చుకుని మొహం అంతా చెక్కుకుపోయింది. ముప్పయి యెనిమిది గాజుముక్కలు మొహంలో దిగబడ్డాయి. ఎన్ని కుట్లు వేశానో ఆ మొహం మీద నాకే తెలియదు. అంతేకాక స్టీరింగ్ వీల్ నొక్కుకోవడం వల్ల ఎముకలు రెండు విరిగి ఊపిరితిత్తి దెబ్బ తిన్నది. ఇప్పటికి రెండుసార్లు నెత్తురు ఎక్కించాము. చాలా తీవ్రంగా వుంది జ్వరం. బతికాడంటే నేనే ఆశ్చర్యపడతాను" అన్నాడు.

ఇద్దరు పోలీస్ కానిస్టేబుల్స్‌ని రోగి పక్కన కాపలా ఉంచాడు ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు.

"నేను అనుమతి యిచ్చేటంత వరకూ ఎవరూ రోగితో మాట్లాడకూడదు" అని డాక్టర్ మరీ మరీ హెచ్చరించాడు.

ఇన్‌స్పెక్టర్ తలవూపి "పారిపోకుండా" అని ఊరుకున్నాడు.

"మీ పోలీసులకి అనుమానం మరీ ఎక్కువ. చావుబతుకుల మధ్య వున్న రోగి ఎలా పారిపోతాడనుకుంటారు?" అన్నాడు డాక్టర్.

పాండిచ్చేరి పోలీసులు జయంతిని మద్రాసుకి తీసుకువచ్చి ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావుకి ఒప్పగించారు. ఆ విషయం తెలియగానే యుగంధర్, రాజు పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కి వెళ్ళారు. జయంతి తండ్రికూడా అక్కడే వున్నాడు.

"మేము ఎన్నిసార్లు అడిగినా ఎంత బతిమాలుతున్నా జయంతి ఏమీ చెప్పడంలేదు. మౌనవ్రతం పట్టింది" అన్నాడు ఇన్‌స్పెక్టర్ విసుగ్గా.

యుగంధర్ జయంతికి ఎదురుగా కూర్చున్నాడు. సూటిగా ఆమె కళ్ళల్లోకి చూస్తూ "ఏమమ్మా! ఎందుకలా మొండితనం చేస్తావు. ఇది చిన్నపిల్లల ఆటకాదు. దయచేసి వాగ్మూలం యియ్యి" అన్నాడు.

ఏమీ అర్థంకానట్టు చూసింది ఆమె.

"తల్లీ మీ అమ్మ మంచం పట్టింది. మేము ఎలా బతుకుతాము చెప్పు. వీళ్ళడిగిన ప్రశ్నలకి జవాబులు చెప్పెయ్యి. ఇంటికిపోదాం" అని తండ్రి వేడుకున్నాడు.

అయినా జయంతి పెదిమలు విప్పలేదు. ఒక్కమాటా మాట్లాడలేదు.

"అయితే నిన్ను కస్టడీలో వుంచవలసిందే" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

జయంతి అప్పటికీ మాట్లాడలేదు.

అయిదురోజుల తర్వాత రోగికి స్పృహ వచ్చింది. స్పృహ రాగానే "ఏమైంది? నేనెక్కడున్నాను?" అడిగాడు.

డ్యూటీలో వున్న నర్సు చెప్పింది కారు ఏక్సిడెంట్‌లో దెబ్బలు తగిలాయనీ, ఆస్పత్రిలో ఉన్నాడనీ. రోగికి స్పృహ వచ్చినట్లు స్వరాజ్యరావుకి కబురు వెళ్ళింది. ఇన్‌స్పెక్టర్, యుగంధరూ, రాజూ వెంటనే బయలుదేరి వచ్చారు.

"మిస్టర్ సూర్యప్రకాశ్ డాక్టర్ని ఎందుకు హత్య చేసిందీ అంతా వివరంగా స్టేట్‌మెంట్ యిస్తారా?" అడిగాడు స్వరాజ్యరావు.

రోగి మొహమంతా కట్లతో నిండిపోయింది. పెదిమలూ, ముక్కుచివరా తప్ప యింకేమీ కనిపించడంలేదు.

"నాకేమీ కనిపించడంలేదు. కళ్ళు పోయాయా?" అడిగాడు రోగి.

"లేదు. మొహానికి చాలా దెబ్బలు తగిలాయి. ముప్పయి ఎనిమిది కుట్లు వేశారు. కళ్ళకి దెబ్బ తగలలేదు" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"కట్లు ఎప్పుడు ఊడతీస్తారు?"

"ఇంకో రెండురోజుల్లో" అన్నాడు డాక్టర్.

"జయంతి ఏమైంది?"

"పోలీస్ కస్టడీలో వున్నది."

రోగి నిట్టూర్చాడు. "జయంతి నిర్దోషి. ఏమీ సంబంధం లేదు" అన్నాడు.

"నీ మాట ఎలా నమ్ముతాం?" అడిగాడు ఇన్‌స్పెక్టర్

"జయంతి ఏమన్నది?"

"ఏమీ చెప్పడంలేదు."

"నేను జయంతితో ఒక్కసారి మాట్లాడవచ్చా?"

"వీల్లేదు. నువ్వు ముందు స్టేట్‌మెంట్ ఇయ్యి. తర్వాత మాట్లాడవచ్చు" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"ఇస్తాను. రెండురోజులుండండి. నా మొహానికి యీ కట్లు ఊడతియ్యనివ్వండి" అన్నాడు రోగి నీరసంగా.

**కట్లు వూడతియ్యబోతున్నామని** రెండురోజుల తర్వాత డాక్టరు యుగంధర్‌కి ఫోన్ చేసి చెప్పాడు.

"ఎన్నిగంటలకి?"

"ఇంకో గంటలో."

"వస్తాను."

యుగంధర్, రాజు వెంటనే బయలుదేరి ఆస్పత్రికి వెళ్ళారు. అప్పటికే స్వరాజ్యరావు అక్కడ వున్నాడు.

"ఈవేళతో ఈ కేసు పూర్తి అవుతుందనుకుంటాను" అన్నాడు ఇన్‌స్పెక్టర్. ముగ్గురూ గది బయట నిలుచునున్నారు. ఇద్దరు నర్సులు, డాక్టరు గదిలోపల రోగి కట్లు విప్పుతున్నారు.

"ఇంకా ఎంతసేపు పడుతుంది?" అన్నాడు రాజు.

"ఇంకో అయిదు నిమిషాలలో అయిపోవాలి" అని యుగంధర్ అంటుండగా కెవ్వున కేక వినపడింది. ముగ్గురూ క్షణంపాటు ఆశ్చర్యపోయి ఒకేసారి గదిలోకి పరిగెత్తి "ఏమిటి? ఏమైంది?" అని అడిగారు.

డాక్టరు జవాబు చెప్పకుండా రోగిని చూపించాడు. రోగి మొహానికి కట్లు లేవు. అన్నీ విప్పేశాడు డాక్టరు. రోగి చేతిలో అద్దం ఉంది. "తన మొహం చూసుకుని అరిచాడు" అన్నాడూ డాక్టర్.

అతని మొహం కనిపించడంలేదు. అటువైపుకి తిప్పుకున్నాడు. ఇన్స్పెక్టర్ గబగబా అటువైపు వెళ్ళి, రోగి మొహం చూసి "గుడ్ గాడ్" అన్నాడు.

రోగి అదోరకంగా నవ్వి "ఘోస్లీగా వుంది కదూ" అన్నాడు.

ఒళ్ళంతా తెల్లగా వుంది. మొహం మాత్రం నల్లగా, బొగ్గు నలుపులో వుంది. ముక్కు ఒక వుండ, కళ్ళు ముద్దలా వున్న నల్లని మొహంలో రెండు గుంటలు. కనుబొమలు లేవు. కనురెప్పలకి వెంట్రుకలు లేవు. మొహం మీద ఎక్కడా ఒక్క వెంట్రుకా లేదు. గెడ్డం అసలే లేదు. మెడలో కలిసిపోయింది. చెంపలు రెండూ కనిపించడం లేదు. మొహం మీదంతా గోళీలంత వుండలు.

భయంకరమైన మొహం. పగలు చూస్తే రాత్రి కలలో వచ్చి భయపెట్టే మొహం. ఒకసారి చూస్తే జన్మజన్మంతా మరచిపోలేని అసహ్యమైన, వికృతమైన మొహం.

"నువ్వు హంతకుడివి. నిన్ను చూసి జాలిపడవలసిన అవసరంలేదు" అన్నాడు ఇన్స్పెక్టర్.

అతనేమీ మాట్లాడలేదు.

"సరే స్టేట్మెంట్ యిస్తానన్నావు. ఇస్తావా?" అడిగాడు ఇన్స్పెక్టర్.

"ఇస్తాను. నేనే హత్య చేశానని ఒప్పుకుంటాను. వివరాలు చెప్పేముందు జయంతితో మాట్లాడాలి."

"ఎందుకు? కూడబలుక్కోవడానికా? వీల్లేదు" అన్నాడు ఇన్స్పెక్టర్.

"ప్లీజ్ ఒక్కసారి జయంతితో మాట్లాడిన తర్వాత నేను నేరం ఒప్పుకుంటూ వాఙ్మూలం యిస్తాను" అన్నాడు దీనంగా.

ఇన్స్పెక్టర్ యుగంధర్ వైపు చూశాడు.

"జయంతిని పిలిపించండి" అన్నాడు యుగంధర్.

"అదంతా చాలా యిరెగ్యులర్" అని గొణిగాడు ఇన్స్పెక్టర్.

"మనం ఇక్కడే వుందాం. కూడబలుక్కోకుండా చూద్దాం" రాజు సలహా ఇచ్చాడు.

ఇన్స్పెక్టర్కి యిష్టంలేదు. అయినా ఒప్పుకున్నాడు.

జయంతిని తీసుకురమ్మని సార్జంట్ని పంపించాడు.

పదిహేను నిముషాల తర్వాత సార్జంట్ జయంతిని వెంటబెట్టుకుని వచ్చాడు. గదిలోకి వెళ్ళి నిలబడి చుట్టూ చూసింది బెదురుతూ.

"నేను సూర్యప్రకాశ్ని జయంతీ" అన్నాడు మొహం జయంతివైపు తిప్పి.

నిముషం పాటు రాతిబొమ్మలా నిలబడిపోయింది. తర్వాత ఒక పొలికేక పెట్టింది. భయంవల్లో, దుఃఖం వల్లో, తన ప్రియుడి మొహం అలా అయిపోయినందుకు బాధవల్లో కెవ్వున కేకవేసింది. అతని దగ్గరికి పరిగెత్తింది.

"జయంతీ! నేను సూర్యప్రకాశ్ని. నేను డాక్టర్ శ్రీనివాస్ని హత్యచేశాను. నేరం ఒప్పుకుంటున్నాను."

జయంతి ఏడుస్తోంది. వెక్కివెక్కి ఏడుస్తోంది.

"ఎందుకు ఏడుస్తావు? తప్పదు. శిక్ష అనుభవించాలి. నేరం చేస్తే శిక్ష తప్పుతుందా? ఏడవక. నేనిలా అయిపోవడమే మంచిదేమో. నీ బతుకన్నా బాగుపడుతుంది. జయంతీ నన్ను క్షమించు" అతనూ ఏడుస్తున్నాడు.

అందరూ ఊపిరి బిగపట్టి ఆ యిద్దర్నీ చూస్తున్నారు.

"నువ్వు వెళ్ళు. నన్ను మరిచిపో. ఎవర్నయినా యోగ్యుడైన యువకుణ్ణి చూసి పెళ్ళిచేసుకో."

"జయంతీ నువ్వు ఇక వెళ్ళు నేను పోలీసులకి వాగ్మూలం యివ్వాలి. గుడ్ బై" అన్నాడు మొహం తిప్పేసుకుని. అప్పుడే నిద్రలోంచి మేల్కొన్నట్లు జయంతి అందర్నీ కళ్ళప్పగించి చూసింది. అక్కణ్ణించి కదలలేదు.

"వెళ్ళమ్మా మీ నాన్న నీకోసం కాసుకున్నారు" అన్నాడు ఇన్‌స్పెక్టర్ జయంతితో.

జయంతి ఏడుస్తూ వెళ్ళిపోయింది.

## 23

"జయంతి కాలేజీలో చేరినప్పట్నించీ నేనూ ఆమె ప్రేయసీ ప్రియులం. జయంతి అంటే నాకు ప్రాణం. నా పేరు సూర్యప్రకాశ్. ఏడెనిమిది నెల్ల క్రితం జయంతికి డాక్టర్ శ్రీనివాస్‌తో పరిచయం అయింది. ఆ డాక్టరు జయంతిని ఆకర్షించి, ఆమెని తన వలలో వేసుకున్నాడు. అప్పటినించీ జయంతి నాకు దూరమైంది. నన్ను నిర్లక్ష్యం చేసింది. డాక్టర్ శ్రీనివాస్‌తో ఆమె స్నేహం అట్టే కాలం నిలవదని నాకు మొదటినుంచీ తెలుసు. త్వరలోనే జయంతికి డాక్టరు మీద విసుగు, అసహ్యం కలిగాయి. మళ్ళీ మేము ఇద్దరం స్నేహితులం అయ్యాం. డాక్టర్ అది భరించలేకపోయాడు. జయంతిని బెదిరించడం ప్రారంభించాడు. చెడు తిరుగుళ్ళు తిరుగుతుందని ఆమె తండ్రికి ఉత్తరం రాస్తానని భయపెట్టి మా యిద్దరి స్నేహానికి అడ్డం రావడం ప్రారంభించాడు. నేను అది భరించలేకపోయాను. డాక్టర్ని చాలాసార్లు హెచ్చరించాను. ఆయన వినిపించుకోలేదు. ఆ బెదిరింపుతో జయంతిని తన ఆధీనంలో వుంచుకున్నాడు. ఇక ఆ డాక్టర్ని హత్య చెయ్యకపోతే జయంతి నాకు దక్కదని తేలిపోయింది. డాక్టర్ని హత్య చేశాను. హత్యచెయ్యబోతున్నానని కానీ, హత్య చేస్తానని కానీ జయంతికి తెలియదు. ఈ హత్యకి పూర్తిగా నేనే బాధ్యుణ్ణి. జయంతికి ఈ హత్యతో ఎలాటి సంబంధమూ లేదు. హత్య చేసిన తరువాత కూడా జయంతికి చెప్పలేదు" అని వాగ్మూలం యిచ్చాడు రోగి.

"డాక్టరునించి పదివేల రూపాయలు తీసుకున్నారా?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"అవును"

"డాక్టర్ పదివేలు ఎందుకు ఆవేళ బాంకినించి తీసుకున్నాడు?"

"నాకు యివ్వడానికి. పదివేలు యిస్తే నేను జయంతిని యిక చూడననీ, మద్రాసు నించీ వెళ్ళిపోతాననీ చెప్పాను."

అర్ధరాత్రి ఆలందూర్ రోడ్డుమీదకి డాక్టరు ఎందుకు వచ్చాడు?"

"నేను ఫోన్ చేశాను. ఎవరో పేషెంట్‌ని చూడ్డానికి వచ్చినట్లు అక్కడికి రమ్మని చెప్పాను.

"జయంతి ఎందువల్ల ఆ రోజు హోటల్ లగ్జరీకి వెళ్ళింది? నువ్వు ఎందుకు హోటల్ లగ్జరీలో కాటేజీ తీసుకున్నావు?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

రోగి ఇన్‌స్పెక్టర్‌ని కోపంగా చూశాడు. "నేను హత్య చేశానని ఒప్పుకుంటున్నాను. ఇంకా నన్ను మీ ప్రశ్నలతో ఎందుకు వేధిస్తారు? ఆ రాత్రి హోటల్లో గడుపుదామని జయంతికి చెప్పాను. అందుకని ముందు కాటేజీ బుక్ చేశాను. జయంతిని హోటల్‌కి రమ్మని చెప్పాను. జయంతి పొరపాటున నేను గది బుక్ చెయ్యలేదేమో అనుకుని తను ఒక గది బుక్ చేసింది. అంతే" అన్నాడు అతను.

యుగంధర్ రోగి దగ్గరగా వెళ్ళి "మీదేవూరు?" మీ తండ్రిగారి పేరేమిటి?" అడిగాడు.

"చెప్పను. నావల్ల నా తండ్రికీ, నా బంధువులకీ అపకీర్తి కలగకూడదు. చచ్చినా చెప్పను. నేను హంతకుణ్ణి, డాక్టర్ శ్రీనివాస్‌ని హత్య చేసిన హంతకుణ్ణి. నన్ను ఉరి తియ్యండి" అని అరిచాడు.

యుగంధర్ ఆలోచిస్తూ నిలబడ్డాడు.

"ఏమిటి యుగంధర్ ఆలోచిస్తున్నారు?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

యుగంధర్ ఆ ప్రశ్నకి జవాబు చెప్పకుండా "ఇతన్ని ఛార్జిచేస్తున్నారా?" అడిగాడు.

"ఆఁ"

"అయితే ఒకసారి డాక్టరుగారి భార్య పార్వతిని పిలిపించి ఇతను ఎన్నడయినా తన భర్తతో మాట్లాడగా చూసిందేమో అడిగితే?"

"ఎందుకు?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"తరువాత చెపుతాను, పిలిపించండి."

సార్జంట్‌ని పంపాడు ఇన్‌స్పెక్టర్.

"ఆవిడెందుకు? ఒద్దు" అన్నాడు రోగి. ఎవరూ అతని మాట వినిపించుకోలేదు. అరగంట అయిన తర్వాత పార్వతి రోగి వున్న గదిలోకి వచ్చింది.

"చూడండమ్మా! ఈయన తన పేరు సూర్యప్రకాశ్ అని చెబుతున్నాడు. మీ భర్తని తనే హత్య చేశానని అంటున్నాడు. ఈయన్ని మీరు యిదివరకెన్నడయినా చూశారేమో చెప్పండి" అన్నాడు యుగంధర్.

పార్వతి మంచం మీద వున్న రోగిని అయిదునిముషాలు పరీక్షగా చూసి "లేదనుకుంటాను. ఎన్నడూ చూడలేదు. కానీ ఎక్కడో ఎప్పుడో చూసినట్లున్నాయి ఆ కళ్ళు" అన్నది.

రోగి నిట్టూర్చాడు.

## 24

"ఇవి వాళ్ళు వెల్లూరు హోటల్లో వదిలేసిన సామానులు ఇవి పాండిచ్చేరిలో వదిలేసినవి" అని చెప్పాడు ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు యుగంధర్‌తో.

"థాంక్స్! చాలా త్వరగా తెప్పించారా?"

"అవును. మీరు తెప్పించమన్నారుగా. ట్రంక్‌కాల్ చేసి తెప్పించాను. ఇవి ఎందుకు?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

యుగంధర్ మూడు వస్తువులనీ చూశాడు. ఒక తోలుపెట్టె, ఓ హోల్డాల్, ఓ బుట్ట. హోల్డాల్‌లో పరుపు, దిళ్ళు, దుప్పట్లు, తువ్వాళ్ళు తప్ప యింకేమీ లేవు. బుట్టలో షేవింగ్ సెట్, చీరలు, జాకెట్లు వున్నాయి. తోలుపెట్టెలో కూడా చీరలు, జాకెట్లు కాక, పాంట్లు కోట్లు, షర్టులు వున్నాయి. తోలుపెట్టెలో కూడా చీరలు, జాకెట్లు కాక, పాంట్లు కోట్లు షర్టులు వున్నాయి. పెట్టె మూతకి చిన్నసంచీ వుంది. ఆ సంచిలో చెయ్యిపెట్టి చూశాడు యుగంధర్. ఓ ఫోటో వున్నది. అది డాక్టర్ శ్రీనివాస్ ముగ్గురు పిల్లల ఫోటో. యుగంధర్ జేబులోంచి ఓ ఫోటో ఫ్రేము తీసి, ఆ ఫోటో ఫ్రేములో ఆ ఫోటో పెట్టి చూశాడు. సరిగ్గా సరిపోయింది.

"ఏమిటి యుగంధర్ అది?" అరిచాడు ఇన్‌స్పెక్టర్.

యుగంధర్ చెప్పాడు.

"ఈ సూర్యప్రకాశ్‌కి డాక్టర్ పిల్లల ఫోటో ఎందుకు అవసరమైంది?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

యుగంధర్ జవాబు చెప్పలేదు. అక్కణ్ణించి బయలుదేరి రాజుతో సహా డాక్టర్ క్లినిక్‌కి వెళ్ళాడు. బల్ల సొరుగులు తెరిచాడు మారుతాళం చెవులతో.

సొరుగులో కాగితాలు కాక మందు సీసాలు, యింజక్షన్ సిరెంజ్ పెట్టుకునే డబ్బా వున్నాయి.

"యస్! దీనిమీద దొరకవచ్చు. ప్రయత్నించి చూడు" అన్నాడు రాజుతో యుగంధర్. రాజు పౌడర్ తీసి, ఆ డబ్బామీద చల్లి ఫోటోలు తీశాడు. అక్కణ్ణించి ఆస్పత్రికి వెళ్ళారు. డాక్టరుతో అయిదు నిముషాలు మాట్లాడాడు యుగంధర్. డాక్టర్ తలవూపి, నర్సుని పిలిచి ఏదో చెప్పి పంపించాడు. అయిదు నిముషాల తర్వాత నర్సు ఒక గ్లాసు అడుగున పట్టుకుని తీసుకువచ్చి డాక్టర్ బల్లమీద పెట్టింది. రాజు ఆ గ్లాసు మీదా పౌడరు చల్లి ఫోటోలు తీశాడు.

యుగంధరూ, రాజూ కన్సల్టింగ్ రూంకి వెళ్ళిపోయారు. రాజు లాబరేటరీలోకి వెళ్ళి గంట తర్వాత రెండు ఫోటోలు యుగంధర్ ముందు పెట్టాడు. భూతద్దం తీసి యుగంధర్ అరగంటసేపు ఆ ఫోటోలని పరీక్షగా చూసి, నిట్టూర్చి "పాపం" అన్నాడు.

ఆస్పత్రి గది తలుపుకి చెరొకవైపున చెరొక కానిస్టేబుల్ నిలుచుని వున్నారు. యుగంధర్ని చూడగానే యిద్దరూ సెల్యూట్ చేశారు.

"రోగి ఏం చేస్తున్నాడు?" అడిగాడు యుగంధర్.

"ఖైదీ మంచం మీద కూర్చుని వున్నాడు సార్" చెప్పాడు ఓ కానిస్టేబుల్. యుగంధర్ లోపలికి వెళ్ళాడు. రోగి యుగంధర్ని చూసి మొహం తిప్పేసుకున్నాడు. రోగి యుగంధర్ని చూసి మొహం తిప్పేసుకున్నాడు. యుగంధర్ బాగా దగ్గరికి వెళ్ళి, ఎదురుగా నిలుచుని నిముషంపాటు రోగి కళ్ళల్లోకి చూసి "డాక్టర్ శ్రీనివాస్ ఏమిటిది?" అన్నాడు.

రోగి ఉలిక్కిపడ్డాడు. "నేను డాక్టర్ శ్రీనివాస్ని కాను. నేను సూర్యప్రకాశ్ని. హంతకుణ్ణి" అన్నాడు.

"ప్లీజ్ ఆ నాటకం ఇక చాలు. చాలా రోజులు నమ్మించారు డాక్టర్ మరణించాడని. మీ హత్యానేరానికి మీరే ఉరికంబం ఎక్కుదామనుకున్నారా ఎందుకు?" అడిగాడు యుగంధర్ దయగా.

డాక్టర్ కళ్ళల్లో నీళ్ళు నిండాయి. "నేను డాక్టర్ శ్రీనివాస్ని అని మీకు ఎలా తెలిసింది?" అడిగాడు.

"మీరు ఇన్స్పెక్టర్కి వాఙ్మూలం యిస్తున్నప్పుడు అనుమానం కలిగింది. ఆ వాఙ్మూలం కల్పనగా తోచింది. అందులో ఏమీ నిజం వున్నట్లు అనిపించలేదు. మీ సామానులలో మీ పిల్లల ఫోటో వుంది. అది మీ క్లినిక్లో వున్న ఫోటో ఫ్రేములోనిది అని తెలిసింది. తర్వాత మీ వేలిముద్రలు క్లినిక్లో సిరంజ్ డబ్బా మీద వేలిముద్రలతో పోల్చి చూశాను" అని నవ్వి "నేను నిజం చెప్పానుగా. మీరూ నిజం చెప్పండి" అన్నాడు యుగంధర్.

డాక్టర్ రెండు నిముషాలు మౌనంగా వుండి "ఏముంది నిజం చెప్పడానికి తెలుస్తూనే వుందిగా. జయంతితో ఓ రోజు నాకు స్నేహం అయింది. జయంతి అందం చూసి, ఆమెలో చలాకీతనం చూసి నేను ముగ్ధుణ్ణయిపోయాను. ఆవేళనించీ నేనూ, జయంతీ రోజూ కలుసుకునేవాళ్ళం. జయంతికి నాలో ఏం గొప్పతనం కనిపించిందో నాకు తెలియదు కానీ ఆమె కూడా నన్ను నిజంగా ప్రేమించింది. నా భార్య అంటే నాకు చాలా ఇష్టం, గౌరవం. నా పిల్లలంటే ఎంత అనురాగమో చెప్పలేను. వాళ్ళకి తెలియకుండా నేను నా ప్రేమకలాపం సాగిస్తున్నాను. నా భార్యకి కొంచెంగా అనుమానం కలిగిందని నాకు తెలుసు. ఆమె సాధ్వి. సహనం వున్న మనిషి. నన్ను ఒక్కమాటా అనలేదు. ఆమెకి అపచారం చేస్తున్నాననే చింత ఒక పక్క, జయంతిని విడవలేని, విడిచి వుండలేని ప్రేమ యింకొకవైపు. ఆ క్షోభలో సతమతమవుతుండగా జయంతి నన్ను మరింత క్లిష్ట పరిస్థితిలో పెట్టింది. ఎప్పుడో, ఎక్కడో రహస్యంగా కలుసుకుని గంటో గంటన్నరో గడిపి వెళ్ళిపోవడం తనకి బాగాలేదనీ, నాతో తన జీవితం పంచుకోవాలనీ, నా భార్యకి విడాకులు యిచ్చి, తనని పెళ్ళి చేసుకోమనీ అడిగింది. ఎలా? పార్వతిని విడాకులు యివ్వమని ఎలా అడగను? నా పిల్లల గతి ఏం కాను? ఏదో వంక చెప్పి ఎప్పటికప్పుడు తప్పించుకుంటూ వచ్చాను కొంతకాలం. జయంతి నేను కావాలని వాయిదే వేస్తున్నానని గ్రహించి, తనని పెళ్ళిచేసుకోకపోతే

తనమీద నిజంగా ప్రేమలేదని నిశ్చయించుకుంటాననీ, నాతో స్నేహం మానుకుంటాననీ చెప్పింది. ఆమెని విడిచివుండలేననిపించింది. చాలాసార్లు అనుకున్నాను నా భార్యని విడాకులు యిమ్మని అడుగుదామని. కానీ తీరా ఆమె కళ్ళల్లోకి చూశాక అడగలేక తలవంచుకుని వెళ్ళిపోయేవాణ్ణి. చివరికి ఒక ఉత్తరం రాసిపెట్టి వెళ్ళిపోదామనుకున్నాను. జూలై14వతేదీ యీ వూరు వదిలి వెళ్ళిపోవాలని నిశ్చయించుకుని బ్యాంకులో వున్న పదివేలరూపాయలూ తీసేసుకున్నాను. నా యిల్లు, యిన్సూరెన్సు పాలసీ నా భార్య పేర్న వున్నాయి. ఇంకో ఊరికి వెళ్ళి అక్కడ ప్రాక్టీసు ప్రారంభించి నెలనెలా నా భార్యకి డబ్బు పంపుదామనుకున్నాను. ఈ విషయం ముఖాముఖీ చెప్పలేక ఉత్తరం రాస్తూ కూర్చున్నాను. నేను నా భార్యని ఆవేళ వదిలి వచ్చేస్తున్నానని జయంతికి క్రితంరోజే చెప్పాను. ఆ రాత్రి ఇద్దరం హోటల్లో వుండి మర్నాడు పొద్దున్నే బెంగుళూరుకి వెళదామని చెప్పింది జయంతి. తనే హోటల్లో గది బుక్ చేసింది. కానీ ఆఖరి క్షణాన మనసు మార్చుకుని తిన్నగా రైల్ స్టేషన్‌కి వెళ్ళి అక్కణ్ణించి నాకు టెలిఫోన్ చేసింది. వెంటనే బెంగుళూరు వెళదామనీ, స్టేషన్‌కి రమ్మనీ. నేను నా భార్యకి ఉత్తరం రాయడం పూర్తికాలేదు. హోటల్‌కి వెళ్ళమనీ, అక్కడికి వస్తాననీ చెప్పాను. ఉత్తరం పూర్తిచేసి కవర్లో పెట్టి కవరు బల్లమీదపెట్టి నా పిల్లల ఫోటో ఫ్రేములోంచి తీసి జేబులో పెట్టుకున్నాను. హోటల్‌కి బయలుదేరదామనుకుంటుండగా శరభయ్య దగ్గుకుంటూ నా క్లినిక్‌లోకి వచ్చాడు. అతను నా పేషెంటు. అతనికి గుండె జబ్బు. నా అనేవారు ఎవరూ లేరు అతనికి. ఆ పేవ్‌మెంట్ మీదా, యీ అరుగుమీదా, చెట్టుకిందా పడుకుని, వాళ్ళూ వీళ్ళూ పెట్టే భోజనం తిని బతుకుతున్నాడు. ఒకప్పుడు స్కూల్లో నా క్లాస్‌మేట్. నా వయస్సే. చాలా ఏళ్ళుగా అతనికి ఉచితంగా వైద్యం చేస్తున్నాను. నా ఖర్చుతోనే మందులు యిస్తున్నాను. ఆ రాత్రి, అంటే జూలై 14 రాత్రి చాలా గుండె నెప్పితో నా క్లినిక్‌లోకి వచ్చాడు. బల్లమీద పడుకోబెట్టాను. నేను పరీక్ష చేసేలోపునే త్రాంబిసిస్ వచ్చి ప్రాణం విడిచాడు. అతను దాదాపు నా అంత పొడుగు వుండేవాడు. అప్పుడు తట్టింది నేను మరణించినట్లు సాక్ష్యం సృష్టించి మాయమైతే జయంతితో వుండవచ్చుననీ, నేను తననీ, పిల్లల్నీ వదిలి వెళ్ళి ద్రోహం చేశానని నా భార్య అనుకోదని. ఆ ఆలోచన స్ఫురించగానే నా చేతి గడియారం, నా ఉంగరం తీసి అతనికి పెట్టి, అతని శవాన్ని కారులో ఎక్కించుకుని తీసికెళ్ళి కారు రోడ్డుపక్కన పల్లంలోకి తోసేసి, నిప్పు అంటించి కాలినడకన గిండీ చేరుకుని, అక్కణ్ణించి సెంట్రల్ దగ్గిర ఒక హోటల్‌కి వెళ్ళాను. మర్నాడు నేనూ, జయంతీ కలిసి బెంగుళూరు వెళ్ళాము. నా పేర్న వున్న రిజర్వేషన్ కాన్సిల్ చేయించి అదే బర్త్ నేనే యింకొక పేర్న తీసుకున్నాను. ఆ తర్వాత వూళ్ళూళ్ళూ తిరిగాం. పోలీసులు నేను హత్యచేయబడ్డాననుకుని హంతకుడి కోసం వెతకడం అంతా పత్రికలో చదివాను. జయంతికీ తెలిసింది. ఏం చేస్తుంది? నాతోబాటు తిరిగింది. చివరికి యిలా అయింది నా గతి" అని ఏడ్చాడు డాక్టర్ శ్రీనివాస్.

"అయితే జూలై 14వతేదీ రాత్రి మూడుగంటలకి హోటల్ లగ్జరీకి వెళ్ళింది మీరు కాదన్నమాట?" అన్నాడు యుగంధర్.

"నేను కాదు" అన్నాడు శ్రీనివాస్.

అయిదు నిమిషాలు యిద్దరూ మాట్లాడలేదు. తర్వాత శ్రీనివాస్ కళ్ళు తుడుచుకుని "యుగంధర్ గారూ నేను డాక్టర్ శ్రీనివాస్ అని మీకూ, జయంతికి తప్ప యింకెవరికీ తెలియదు. ఎటువంటి పరిస్థితుల్లోను నేను డాక్టర్ శ్రీనివాస్ నని చెప్పవద్దని జయంతినించి బెంగుళూరులోనే వాగ్దానం తీసుకున్నాను. మిమ్మల్ని వేడుకుంటున్నాను. మీరెంతో దయగలవారని విన్నాను. నేనెవరో నా భార్యకీ, పిల్లలకీ తెలియకుండా నన్ను ఉరికంబం ఎక్కనివ్వండి. నాకు బతకాలని లేదు. ఈ వికృతమైన మొహంతో నేను బతికినా ఎవరికి కావాలి? జయంతి దడుచుకుంది. నా పిల్లలు దడుచుకుంటారు. నా భార్య అసహ్యించుకుంటుంది. నన్ను చూస్తే నాకే రోతగా ఉంది. దయచేసి ఈ రహస్యం దాచండి. డాక్టర్ శ్రీనివాస్ హత్య చెయ్యబడ్డాడనే అందరూ అనుకోనివ్వండి. ముఖ్యంగా నా పిల్లలకి తమ తండ్రి తమని వదిలి యింకో ఆడదానితో వెళ్ళిపోయిన బలహీనుడు, నీతి రహితుడు అని తెలియనివ్వకండి" ఏడుస్తున్నాడు డాక్టర్ శ్రీనివాస్.

యుగంధర్ డాక్టర్ని తీక్షణంగా చూశాడు. "డాక్టర్ మొదట్నించీ మీరు చాలా పిరికితనం ప్రదర్శించారు. మీ భార్య సాధ్వి, గుణవంతురాలు అని తెలిసీ ఆమెకి అపచారం చేశారు పోనీ అలా యింకో స్త్రీచేత ఆకర్షింపబడి ఆ బలహీనత జయించలేనప్పుడు ధైర్యంగా మీ భార్యకి ఆ విషయం చెపితే ఆమె విడాకులు ఇవ్వడానికి అంగీకరించేదో లేక జయంతిని మీరు రెండో వివాహం చేసుకోడానికి అంగీకరించేదో? మన దేశంలో స్త్రీలకి చట్టాలు సంఘమూ ఎన్ని హామీలు యిచ్చినా హైందవ స్త్రీ వాటన్నిటిని భర్త సౌఖ్యం, ఆనందం కోసం చిరునవ్వుతో వొదులుకుంటుంది. అది మన స్త్రీ జాతి తత్వం. భర్తే దైవం, భర్తే సర్వస్వం అని రక్తంలో జీర్ణించుకుపోయి భర్తని దైవంగా కొలిచే హైందవ స్త్రీ భర్త ఎన్ని అఘాయిత్యాలు, ఎన్ని అవినీతి పనులు, ఎన్ని ఘోరాలు చేసినా సహించి, క్షమించి ఆ భర్తని ఆరాధిస్తుంది. అటువంటి ఉత్తమోత్తమ స్త్రీకి, అంత హృదయవైశాల్యం, అంత క్షమ, అంత ఉదాత్తత వున్న స్త్రీకి, అపచారం చెయ్యడం పాపం. ఆ పాపానికి తోడు ఇప్పుడు మీరు అంతకన్నా ఘోరమైన అపచారం చేస్తున్నారు మీ భార్యకి. మీ మొహం వికృతమైనదని మీ భార్య మిమ్మల్ని అసహ్యించుకుంటుంది అనుకోవడం ఆమెకి అపచారము చేయడమే. మీరు ఒక బలహీనతకి లోబడి యింకో స్త్రీతో కొన్నాళ్ళ పాటు తిరిగారని ఆమె మిమ్మల్ని చీదరించుకుంటుందనుకోవడం, మీరు ఆమెకి అవసరం లేదనుకోవడం చాలా ఘోరమైన పాపం. ఆమెకి చాలా ఘోరమైన అపచారి. ఆలోచించండి. బాగా ఆలోచించండి. మీ భార్య శ్రీమతి పార్వతీదేవి గుణవంతురాలు, సాధ్వి, ఔదార్యం వున్న మనిషి, ఏనాడూ మిమ్మల్ని బాధపెట్టని పుణ్యవతి. అటువంటి స్త్రీ మిమ్మల్ని నిరసిస్తుందా లేక మీరు ఎలాంటి రూపంలో వున్నా సంతోషిస్తుందా? ఇంతేనా మీ భార్యని గురించి మీకు తెలిసింది?"

డాక్టర్ శ్రీనివాస్ తలవంచుకున్నాడు. "క్షమిస్తుందా?" అన్నాడు.

"క్షమిస్తుంది. ఆమెనే అడగండి. ఇప్పటికయినా పిరికితనం మాని ధైర్యంగా మీ భార్యనీ, పిల్లల్నీ ఎదుర్కోనండి" అని యుగంధర్ తలుపువైపు చూసి "రాజా" అని పిలిచాడు.

రాజు పార్వతితో సహా గదిలోకి వచ్చాడు. పార్వతి మంచమ్మీద కూర్చునున్న డాక్టర్ని చూసింది. ఒక్క పరుగున దగ్గిరకి వెళ్ళిపాదాలు ముట్టుకుంది.

"అవును. అవును. మీ మొహం గుర్తుపట్టలేకపోయాను పాపిష్టిదాన్ని. ఈ పాదాలని ఎలా గుర్తుపట్టకుండా వుండగలను" అంటూ మంగళసూత్రం కళ్ళకి అద్దుకుని అతని పాదాలమీద తలవాల్చి పెదిమలనీ, కళ్ళనీ అతని పాదాలకి అదుముకుని వెక్కి వెక్కి ఏడుస్తోంది.

యుగంధర్, రాజు చప్పుడు చెయ్యకుండా బయటికి వెళ్ళిపోయారు.

"డాక్టర్‌కి శిక్షపడుతుందా?" అడిగాడు రాజు.

యుగంధర్ కళ్ళు తుడుచుకున్నాడు. పార్వతి దుఃఖం అతని గుండెని కరిగించింది.

"ఎందుకు శిక్ష ఆ స్నేహితుడి శవం మోటారు కారులో తగలపెట్టినందుకా? అవును నేరమే చూడాలి, ఇన్‌స్పెక్టర్ ఏం చేస్తాడో" అని "డాక్టర్ మనిషి మంచివాడే కానీ ఉత్త మంచితనం ఎందుకూ పనికిరాదు. మంచితనంతోపాటు మంచినీ చెడ్డనీ అన్నింటినీ ఎదుర్కోగలిగే ఆత్మధైర్యం కూడా వుండాలి. తప్పు చేస్తున్నాననే జ్ఞానం వుంటే చాలదు. తప్పు చెయ్యకుండా వుండే శక్తి వుండాలి, తప్పు చేసిన తర్వాత తప్పు చేశానని ఒప్పుకుని దిద్దుకునే ధైర్యం వుండాలి" అన్నాడు యుగంధర్.